RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:169 హైదరాబాద్, శుక్రవారం, 3 జనవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

# జనవరి 5 నుంచి రైతు భరోసా దరఖాస్తులు స్వీకరణ?



హైదరాబాద్: రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితి పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది.

రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించనున్నారు. జనవరి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు తీసుకునే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను చెల్లిస్తామన్న ప్రభుత్వం.. నాలుగో తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబులు సభ్యులుగా ఏర్పాటైన ఉపసంఘం ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై చర్చించింది.

# ఆ రైతులకు ఏమైనా అయితే.. బాధ్యత భాజపాదే: కేజ్రీవాల్



దిల్లీ: పంజాబ్ సరిహద్దులో నిరసన తెలుపుతోన్న రైతులకు ఏదైనా జరిగితే అందుకు భాజపాదే బాధ్యత అని ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. రద్దుచేసిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిలో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆ విషయమై అభిప్రాయాల సేకరణకు అన్ని రాష్ట్రాలకు కొత్త పాలసీకాపీలు పంపారని పేర్కొన్నారు. 'నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్' ముసాయిదా పాలసీని కేంద్రం ప్రకటించింది. దీనిని ఉద్దేశించే కేజ్రీవాల్ మాట్లాడారు.

గతంలో కేంద్రం తీసుకువచ్చిన సాగు చట్టాలను రైతులు వ్యతిరేకించడంతో వాటిని రద్దుచేసిన సంగతి తెలిసిందే. అప్పుడు ఏడాది పాటు దేశ రాజధాని సరిహద్దుల్లో రైతులు నిరసన తెలిపారు. ప్రస్తుతం పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరశన దీక్ష చేపట్టారు.

ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. వైద్యసహాయం అందించాలని సుప్రీం అక్కడి ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని పంజాబ్ ప్రభుత్వం నిస్సహాయతను వ్యక్తంచేసింది. ఈ అంశంపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. నిరసన చేస్తోన్న రైతులతో చర్చలు ఎప్పుడు జరుపుతారంటూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మీడియా ప్రశ్నించగా.. సుప్రీంకోర్టు సూచనల మేరకు తమ ప్రభుత్వం వ్యవహరిస్తుందని వెల్లడించారు.

# బీపీఎస్సీ వ్యవహారం.. ప్రశాంత్ కిశోర్ ఆమరణ నిరాహారదీక్ష

పట్నా: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఇటీవల బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్( నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు వారాలుగా బీపీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలు చేపడుతున్నా, ప్రభుత్వంలో ఎలాంటి కదలిక రాలేదంటూ గాంధీ మైదానంలో ఆయన దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసి.. మళ్లీ కొత్తగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షలో అవకతవకలకు కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనకారుల బృందం సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అమృత్‌లాల్ మీనాను కలిసిన తర్వాత కిశోర్ మీడియాతో మాట్లాడుతూ.. 48 గంటల్లోగా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే దీక్షకు దిగుతానని అన్నారు. ఆ సమయం ముగిసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఆయన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు.



డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో నిరుద్యోగులు ఆందోళన కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పరీక్షను రద్దు చేసే ప్రసక్తే లేదని అధికారులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఉద్యోగార్థులు తమ ఆందోళనల్ని ఉద్ధృతం చేయగా.. ప్రశాంత్ కిశోర్ వాళ్లకు మద్దతుగా నిలిచారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంలో విచారణ

%దిల్లీ: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. తిరుపతన్న ప్రధాన నిందితుడని తెలిపారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఆయన కీలకంగా వ్యవహరించారన్నారు. ఆధారాలు చెరిపేయడంలోనూ కీలకంగా ఉన్నారన్నారు. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేశారని చెప్పారు.

మరోవైపు తిరుపతన్న పాత్రపై ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ దవే తెలిపారు. 9 నెలలుగా జైలులో ఉన్నారని వాదించారు. తప్పనిసరైతేనే జైలులో ఉంచాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పులిచ్చిందని ప్రస్తావించారు. బెయిల్ పొందడం హక్కు అని చెప్పారు. ఈక్రమంలో తిరుపతన్న పాత్రపై దర్యాప్తు ఎప్పటికి పూర్తిచేస్తారని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. సుదీర్ఘకాలం కొనసాగడం సరికాదని చెప్పింది.



దర్యాప్తు కొనసాగింపు పేరుతో పిటిషనర్ స్వేచ్ఛను అడ్డుకోలేమని పేర్కొంది. విచారణ పూర్తిచేసేందుకు మరో 4 నెలలు పడుతుందని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పారు. ఎంత సమయం పడుతుందో రాతపూర్వకంగా చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఈక్రమంలో అఫిడవిట్ దాఖలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది లూథ్రా సమయం కోరారు. దీంతో ధర్మాసనం విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.



# ఉచితాలపై ఆధారపడొద్దు..: కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి విజ్ఞప్తి

మంగళూరు: ఉచితాల కోసం ప్రభుత్వంపై ఆధారపడొద్దని.. సొంతంగానే సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవాలని కేంద్ర పునరుత్పాదక విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి (ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మంగళూరులో సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలిగించే శిలాజ ఇంధనాలను ఉపయోగించి ఉత్పత్తి చేసే ఉచిత విద్యుత్ పంపిణీ వెనుక ఉద్దేశాలపై తాను వ్యాఖ్యానించబోనన్నారు. అయితే, విద్యుత్ రంగంలో సుస్థిరతే దేశానికి సురక్షిత భవిష్యత్తుకు కీలకం కానుందని అభిప్రాయపడ్డారు.

ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకునేందుకు 'ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన'పథకానికి గతేడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా కోటి మంది ప్రజలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. ఇదే అంశంపై కర్ణాటకలోని మంగళూరులో చర్చావేదికలో మంత్రి మాట్లాడారు. పునరుత్పాదక రహిత ఇంధన వనరులతో కూడిన ఉచిత పథకాలు భారంగా మారుతున్నాయన్నారు.

# అవినీతి, అరాచక కాంగ్రెస్‌ను గద్దె దింపేదాక పోరాటం సాగిద్దాం : కేటీఆర్

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ తుగ్లక్ విధానాలపైన, నిరంకుశ పాలనపైన, హామీలను ఎగవేసిన మోసపూరిత ప్రభుత్వ తీరుపైన మన పోరాటం కొనసాగిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. పోయిన ఏడాది పాటు కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలను ఎండగట్టిన పార్టీ శ్రేణులకు ఒక సందేశం ఇచ్చారు. ప్రాణ సమానులైన%ా% మన బీఆర్ఎస్ తోబుట్టువుల్లారా.. అంటూ ప్రారంభించిన కేటీఆర్, గత ఏడాది పాట చేసిన పోరాటాలను నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే రానున్న రోజుల్లోనూ కాంగ్రెస్ మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు.

గత ఏడాది కాలంగా ఈ కాంగ్రెస్ నిరంకుశ పాలనపై గులాబీ సైనికులందరూ కనబరిచిన పోరాట స్ఫూర్తికి పేరుపేరునా ప్రతి ఒక్కరికి శిరస్సువంచి సలాం చేస్తున్నా. గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు కనబరిచిన కదనోత్సాహం.. రాష్ట్ర స్థాయిలో పని చేసే నాయకత్వంలో కూడా మాటలకందని స్థాయిలో కొండంత స్ఫూర్తి నింపిందని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు..

తెలంగాణ గ్రామ గ్రామాన ఉన్న.. గులాబీ సైనికులు రాష్ట్ర ప్రజలపక్షాన.. విరామం ఎరుగని పోరాటం చేస్తున్నారనీ, అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన ఈ తుగ్లక్ పాలన వల్ల కష్టకాలంలో ఉన్న అన్ని వర్గాల పక్షాన అలుపులేని పోరాటం చేశారని అభినందించారు. ఏడాది కాలంలో పార్టీ శ్రేణులు రైతుల పక్షాన మీరు పోరాడారు, నేతన్నల గొంతుకై మీరు నిలిచారు, మహిళా సమస్యలపై మీరు గర్జించారు, బడుగు బలహీనవర్గాల ప్రజల గళమయ్యారు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన సమరభేరి మోగించారు.. నిరుద్యోగుల హక్కుల కోసం కాంగ్రెస్ సర్కారును నిలదీశారు.. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారని కేటీఆర్ తెలిపారు.



బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన జంగ్ సైరన్‌తో ముఖ్యమంత్రికి ముచ్చెమటలు

'మూసీలో మూటల వేట' నుంచి 'లగచర్ల లడాయి' వరకూ.. అన్యాయం జరిగిన ప్రతిచోటా బాధితుల పక్షాన మీరు కొట్లాడారనీ, తెలంగాణ ప్రజల గుండెచప్పుడును అడుగడుగునా మీరు ప్రతిధ్వనింపజేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు పార్టీ చేసిన పోరాటాలు.. చరిత్రపై చెరగని సంతకాలుగా నిలుస్తాయన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను, అత్యంత సమర్థంగా తిప్పికొట్టిన సందర్భాలు.. ఈ పోరాటపథంలో నిలిచి ఉండే మైలురాళ్లు మారాయి అని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. అసమర్థ, అనాలోచిత కాంగ్రెస్ విధానాలపై.. బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన జంగ్ సైరన్ ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

మొక్కవోని ధైర్యంతో పార్టీ శ్రేణులు నిలబడ్డ తీరు అపూర్వం..భారత రాష్ట్ర సమితి చేసిన అలుపెరగని పోరాటాల వల్లే.. అదానీ ఆశజూపిన రూ.100 కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సి వచ్చిందన్న కేటీఆర్, లగచర్ల లడాయి.. యావత్ దేశం ముందు నియంతృత్వ కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టిందన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## కాశీ, మధురతో సరిపుచ్చేస్తారా....

ప్రస్తుతంతో పోల్చుకుంటే గతం చాలా భయంకరంగా ఉందనేది నిజం. ఇప్పుడు రాజులు, రాజ్యాలు పోయాయి. ప్రపంచాన్ని కుదించేసి, ప్రజాస్వామ్యం పరుగులు పెడుతోంది. ప్రపంచాన్ని ఏలిన బ్రిటన్, అమెరికా లాంటి దేశాలను కూడా పాలించే స్థాయికి భారతీయులు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బాబ్రీ మసీదు ఉన్న స్థలంలో రామమందిరాన్ని నిర్మించిన తర్వాత.. కాశీ, మధురలోని మరో రెండు ఆలయాలను శాంతియుతంగా విముక్తి చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవింద్ దేవ్ గిరి మహారాజ్‌తో పాటు చాలా మంది హిందూ వాదులు అన్నారు.ఆ సందర్భంగానే గోవింద్ దేవ్ గిరి మాట్లాడుతూ.. కాశీ, మధుర దేవాలయాలను శాంతియుతంగా విముక్తి చేసిన వెంటనే, విదేశీ ఆక్రమణదారులు ధ్వంసం చేసిన దేవాలయాలను హిందూ సమాజం మరచిపోతుందని స్పష్టం చేశారు. దాదాపు 3 వేల 500 దేవాలయాలు విదేశీ దాడుల్లో నేలమట్టం అయ్యాయనీ.. అయినప్పటికీ, ఈ మూడు దేవాలయాలు శాంతియుతంగా కలిసిపోయిన తర్వాత, ఏ ఇతర దేవాలయాల వైపు చూడమని హామీ ఇచ్చారు. “మనం గతంలో కాదు, భవిష్యత్తులో జీవించాలి” అని కూడా గోవింద్ దేవ్ గిరి వెల్లడించారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో గోవింద్ దేవ్ గిరి మహారాజ్ మాట్లాడుతూ.. నా దేశం మారిపోయిందని అన్నారు. “గతం అంతా మరచిపోతాం” అని కూడా అన్నారు. కాశీ, మధురలోని దేవాలయాలను హిందువులకు అప్పగించాలని కూడా ఆయన ముస్లిం సమాజాన్ని కోరారు. వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదుకు సంబంధించిన సర్వే నివేదికలో.. పురాతన హిందూ దేవాలయ అవశేషాలపై మసీదు నిర్మించారిని భారత పురావస్తు శాఖ రిపోర్ట్ ఇచ్చిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. అయితే, ఇటీవల లోక్‌సభ ఎన్నికల నుండీ దీనికి విరుద్ధంగా బిజెపి నేతల వ్యాఖ్యలు చేస్తున్నారు.ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ అయితే దాదాపు అన్ని వేదికలపై దేవాలయాల పున:స్థాపన నినాదాన్ని ఎత్తుకుంటున్నారు. ఇటీవలి మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల సందర్భంలోనే ఇదే అంశాన్ని లేవనెత్తారు. ఈ క్రమంలోనే, ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్‌లో షాహీ జామా మసీదు విషయంలో స్థానిక కోర్టు సర్వేకు అనుమతి ఇచ్చింది. అది అక్కడ మత వివాదానికి దారి తీసింది.ఈ తాజా వివాదం గురించి రాజ్యసభ ఎంపీ, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడైన కపిల్ సిబల్ కూడా ఘాటుగా స్పందించారు. ఈ దేశం ఎటు వెళుంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ విభజనను సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయనీ.. దేశాన్ని ఎటు తీసుకెళ్తున్నామో అర్థమవుతుందా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి విభజన రాజకీయాలు ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు.నిజానికి, ఇలాంటి ప్రశ్నలు సామాన్యుల నుండీ మేథావుల వరకూ చాలా మంది మెదడును తొలిచేస్తున్న ప్రశ్నలే. అందులోనూ, అజ్మీర్ దర్గాను భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండీ ఇప్పటి ప్రధాని నరేంద్ర మోడీ వరకూ అందరూ గౌరవించే వారే. ఆ దర్గాకు దేశ ప్రధానమంత్రి హోదాలో మోడీ కూడా చాదర్‌ను పంపించారు. అలాంటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న కట్టడం విషయంలో వివాదాన్ని సృష్టించడం, దాని నుండి రాజకీయ లబ్ధిని పొందడం అనేది ఆందోళన కలిగించే విషయం అన్నది చాలా మంది చెబుతున్న మాట.ఎవరి పేరుతో అయితే ఈ దర్గా ఉందో.. ఈ మొయినుద్దీన్ చిస్తీ 13వ శతాబ్దానికి చెందిన సూఫీ సన్యాసి, తత్వవేత్త. మొయినుద్దీన్ మరణించిన తర్వాత ఆయన్ను గొప్ప సాధువుగా అందరూ పరిగణించారు. ముయిన్ అల్-దీన్ దర్గాను 1236 మార్చిలో నిర్మించారు. ఇది తర్వాత శతాబ్దంలో అత్యంత గౌరవనీయమైన ప్రదేశంగా మారింది. అప్పటి నుండీ అన్ని సామాజిక వర్గాలు దీన్ని గౌరవిస్తూ వచ్చారు. ఈ సమాధిని ఈ యుగంలోని అత్యంత ముఖ్యమైన సున్నీ పాలకుల గౌరవంగా చూసుకున్నారు. మొఘల్ చక్రవర్తి అక్బర్ తన పాలనా కాలంలో పద్నాలుగు సార్లు ఈ దర్గాను సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది. 1566లో తన హిందూ భార్య మరియం-ఉజ్-జమానీతో కలిసి, వారికి బిడ్డలు పుట్టాలనే ఆశతో.. చెప్పులు లేకుండా ఈ సమాధికి తీర్థయాత్ర చేసినట్లు తెలుస్తోంది.మధ్యయుగ కాలం నుండి ముస్లింలతో పాటు భారీగా హిందువులు కూడా ఈ స్థలాన్ని సందర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బరోడా మహారాజు 1800 సంవత్సరంలో దర్గాపై కవచాన్ని నిర్మించారు. ప్రస్తుతం, మొయినుద్దీన్ చిస్తీ సమాధి భారత ఉపఖండంలోని సున్నీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన సందర్శనా స్థలాలలో ఒకటి. భారత ఉపఖండం నలుమూలల నుండి వందల, వేల మంది ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. 2019లో, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ స్వచ్ఛ భారత్ అభియాన్ కింద దర్గా కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించింది. 2015లో, మొయినుద్దీన్ చిస్టీ 808వ ఉర్స్‌లో ముస్లిం మతపెద్దలతో జరిగిన కార్యక్రమంలో.. అజ్మీర్ షరీఫ్ దర్గాలో సమర్పించిన ‘చాదర్’ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందించారు.ఎంతో చరిత్ర ఉన్న ఈ దర్గా పలు వివాదాలకు కూడా కేంద్రంగా ఉంది. 1992 అజ్మీర్ రేప్ కేసు నుండీ.. 2007లో టిఫిన్ క్యారియర్ బాంబు ఘటన వరకూ ఈ ప్రదేశం పాపులర్ అయ్యింది. రంజాన్ మాసంలో ఉపవాస ప్రార్థనల తర్వాత జనాలు గుమ్మిగూడిన ప్రదేశంలో బాంబు పేలింది. ఈ పేలుడులో ఏడుగురు చనిపోగా, 17 మందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యేక న్యాయమూర్తి దినేష్ గుప్తా.. 149 మంది సాక్షుల వాంగ్మూలాలు, 451 పత్రాల ఆధారంగా దాదాపు 500 పేజీల తీర్పును సమర్పించారు.జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక న్యాయస్థానం దీనికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ ప్రచారక్‌లు కారణమని తేల్చింది.

## నూతన సంవత్సరంలో అధికారులు పెట్టింపు ఉత్సాహంతో పని చేయాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి





సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 02:నూతన సంవత్సరం 2025 లో జిల్లా అధికారులు, ఉద్యోగులు పెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి కలెక్టర్ వద్ద కు వచ్చిన అధికారుల ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. గత సంవత్సరం కంటే అధికారులు మెరుగ్గా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకి అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు తెచ్చేలా అధికారులు పనిచేయాలన్నారు.

అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా స్థాయి వివిధ శాఖ ల అధికారులు, ఆర్డీవోలు, తాసిల్దారులు, టి ఎన్ జి ఓ నాయకులు, తదితరులు ఉన్నారు.

## టూరిజం శాఖ బోటు మాయం..?

కళ్యాణ్‌నగర్, కాళేశ్వరం బ్యాక్ వాటర్‌లో ఏర్పాటుచేసిన బోటు నడవక ముందే కనుమరుగైంది. 2019లో కాళే శ్వరం ప్రాజెక్టు కట్టిన తరువాత నిండుకుండలా మారిన గోదావరిపై గోదావరిఖని సమ్మక్క-సార లమ్మ గద్దెల వద్ద 50సీట్ల కెపాసిటీతో ఏర్పాటు చేసిన బోటు నడవక ముందే రెండుసార్లు వర దలు వచ్చి కొట్టుకుపోగా ఆ బోటు ప్రస్తుతం కన బడకుండా పోయింది. దీనిపై ఇటు పర్యాటక శాఖ గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ పట్టిం చుకోకపోవడంతో ఆ బోటు ఎక్కడికి వెళ్లిందనేది ప్రశ్నార్థకంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన బోటు రెండు సార్లు వచ్చిన వరదలతో కొట్టుకుపోయింది. వరద తాకిడికి తుమ్మ పొదల్లో చిక్కుకున్న బోటును 2023 ఎన్నికల్లో గెలిచిన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ 2024లో జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా బోటును బయటకు తీయించి బోటులో సౌకర్యాలు



ఏర్పాటు చేసి బోటు చుట్టూ లైటింగ్‌ను ఏర్పాటు చేయించి భక్తులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. సమ్మక్క- సారలమ్మ జాతర అయిపోయిన తరువాత ఆ బోటు కనిపించ కుండాపోయింది. ఆ బోటు దొంగలు ఎకెత్తుకెళ్లారా లేదా పర్యా టక శాఖ తీసుకెళ్లిందా అంతుపట్టడం లేదు. మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆ బోటు స్థానంలో మరో రెండు బోట్లు ఏర్పాటు చేసి రామగుండాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిందేకు ప్రణాళిక సిద్ధం చేస్తున్న తరుణంలో ఈ బోటు కనిపించకుండా పోయింది. ప్రస్తుతం ఉన్న ఈ బోటును ఇంజన్, విలువైన కేబుళ్లను దొంగ లు ఎత్తుకెళ్లారు. బోటును కాపాడేందుకు మున్సిపల్ శాఖ అధి కారులు ఒక మనిషిని కూడా ఏర్పాటు చేసింది. సమ్మక్క-సార లమ్మ జాతర అయిపోయిన నుంచి ఈ బోటు కనిపించకపోవ డంతో దీనిపై ఆరా తీసుకున్నారు. ఈ బోటును ఎవరు తీసుకెళ్లా రనే కోణంలో చర్చ జరుగుతోంది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సూర్యాపేట(కలెక్టరేట్),జనవరి 2, : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్ నుంచి వెబెక్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ని జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్‌స్పాట్స్ వద్ద చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని సం బంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సూర్యాపేట పట్టణంలోని జనగాం క్రాస్‌రోడ్డు సమీపంలో జరుగుతున్న పనులతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించాలన్నారు. కోదాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్-67వద్ద గల అప్రోచ్ రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మునిసిపాలిటీల పరిధిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు.

## సమయపాలనపాటించాల్సిందే

భువనగిరిరూరల్,జనవరి 2,

): వైద్యు లు, సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాల్సిందేన ని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించి ఎంత మంది గైర్హాజరయ్యారని ఆరా తీశారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి



ఎంతమంది పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్నారోనని డీసీహెచ్‌వో డాక్టర్ చిన్నా నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు కావాల్సిన మందుల స్టాక్‌ను అడిగి తెలుసుకున్నారు. మం దుల కొరత లేకుండా అవసరమైన మందులను అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆసుపత్రిలో వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్యం అందుతుందని, ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని రోగులకు, సహాయకులకు సూచించారు. ఆయనవెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారాం, డీసీహెచ్‌వో డాక్టర్ చిన్నా నాయక్, వైద్యులు అనిల్‌కుమార్, కిరణ్, కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

గైనకాలజిస్టు, ఫార్మసిస్టుకు షోకాజ్ నోటీసులు

జిల్లా కేంద్ర ఆసుపత్రిని కలెక్టర్ హనుమంతరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా విధులకు గైర్హాజరైన వైద్యాధికారి, ఫార్మసిస్టులకు డీసీహెచ్‌వో డాక్టర్ చిన్నానాయక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రోగులకు అత్యవసర సేవలు అందించాల్సిన కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ ఎం.అరుణ జ్యోతి మూడు రోజులుగా, ఫార్మసిస్టు జి.లక్ష్మీనారాయణ రెండు రోజులుగా విధులకు రావడంలేదని గుర్తించారు. దీంతో రోగులకు వైద్య సేవలు అందించడంలో జరిగిన అసౌకర్యానికి బాధ్యులను చేస్తూ శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

మినహాయించిన ఆదాయపు పన్నును జమ చేయాలి

భువనగిరి (కలెక్టరేట్): తమకు వచ్చే పెన్షన్ నుంచి ఆదాయపు పన్ను కింద మినహాయించిన సొమ్మును వెంటనే ఆదాయపు పన్ను శాఖకు చెల్లించాలని జిల్లా విశ్రాంత ఉద్యోగ సంఘం నేతలు కోరారు. శనివారం కలెక్టర్ ఎం.హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. తాము చెల్లించిన డబ్బు జమ కాకపోవడంతో నోటీసులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతకింది మల్లయ్య, పరిగెల రాములు, విశ్రాంత ఉద్యోగులు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, వంగపల్లి మల్లేషం, వంచ ఉపేందర్‌రెడ్డి, బల్ల దామోదర్, పటేల్ సుధాకర్ రెడ్డి, చిలుక వెంకటరామనర్సయ్య, వల్లా మధుసుధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆందోళన వద్దు..

పెద్దపల్లిటౌన్, : ఇందిర మ్మ ఇల్లు రాలేదని పేదలు ఆందోళన చెందవద్దని, ప్రతి నిరుపేదకు విడతల వారీగా మంజూరుచేస్తామని ఎమ్మె ల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. పెద్దపల్లి మండలంలోని చందపల్లి, హనుమంతునిపేట (రాంపల్లి) శివారుల్లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పన పనులను శనివారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసం పూర్తిగా డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణాలు వదిలేశారన్నా రు. ఇప్పటికే 4కోట్ల రూపాయలు కేటాయించి డ్రైనేజీలు, రోడ్లు, నీటిసంపులు, ఇతరత్రా మౌలిక వసతుల ఏర్పాటు కు చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారు లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అలాగే స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయ లు ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్వే ఇప్పటికే పూర్తి కావోస్తోందని, నిరుపేదలకు మొదటి దశలో ఇళ్ల కేటా యింపు జరుగుతుందని వివరించారు. ఏడాదికి నియోజకవర్గానికి 3వేల 500 చొప్పున ఇళ్లు ఇవ్వను న్నట్లు తెలిపారు. దశలవారీగా అర్హులైన అందరికీ ఇళ్లు కేటాయి స్తామన్నారు.

## విద్యా వ్యవస్థను పరిరక్షించాలి

నల్లగొండ, జనవరి 2,

విద్యా వ్యవస్థను పరిరక్షించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో టీఎసయూటీఎఫ్ రాష్ట్ర ఆరో విద్యా వైజ్ఞానిక మూడు రోజుల మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్య ఉన్న చోటే అభివృద్ధి ఉంటుందని, ఒక కుటుంబంలో ఒక్కరు విద్యావంతులైతే ఆ కుటుంబ సభ్యులందరూ అభివృద్ధి చెందుతారన్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 18.5లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, అనేక కారణాలతో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయన్నా రు. పారిశుధ్య కార్మికులు, కాపలాదారులు లేక ఇబ్బందికరమైన పరిస్థితుల్లో పాఠశాలలు ఉండేవని, ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను నియమించిందన్నారు. నూతన డీఎస్సీ ద్వారా 10 వేలకు పైగా కొత్త ఉపాధ్యాయులు వచ్చారని, రెసిడెన్షియల్, మో డల్ స్కూళ్లలో మరో 10వేల మంది నియమితులయ్యారన్నారు. పదోన్నతులు, బదిలీల సమస్య కాంగ్రెస్ హయాంలోనే పరిష్కారమైందన్నారు. 317జీవోలో సమస్యలున్నాయని, డిసెంబరు 31లోపు స్పౌజ్ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఉందన్నారు. టీఎసయుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ ఇన్‌చార్జీల పాలనలో విద్య వ్యవస్థను సరిదిద్దాలన్నారు. కొత్త ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్ల సమస్య తీర్చిందన్నారు. రాష్ట్రంలో 22జిల్లాలకు డీఈవోలు లేరని, 63మంది డిప్యూటీ డీఈవోలు లేరన్నారు. 640 మంది మండలాల్లో కేవలం మాత్రమే 14మంది రెగ్యూలర్ ఎంఈవోలు ఉన్నారన్నారు.

మత విశ్వాసాలు, మూఢనమ్మకాలను పెంచే విద్యావిధానం ప్రమాదకరమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న చరిత్ర నల్లగొండ జిల్లాకు ఉందన్నారు. మట్టి పిసికే చేతులే పోరాటాలు చేశాయని, వీరనారి చాకలి ఐలమ్మ పేరిట మహిళా విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దేశం ఐక్యంగా ఉండాలంటే భిన్నత్వంలో ఏకత్వంగా ఉండాలని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తలేదన్నారు. విద్యా విధానాన్ని కాషాయీకరణం చేయడం సరికాదన్నారు. విద్యకు బడ్జెట్‌లో కొంతమేరకు నిధులు పెంచినప్పటికీ ఇంకా పెంచాలన్నారు.

విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్దాలని ‘ఆంధ్రజ్యోతి’ పూర్వ సంపాదకుడు డాక్టర్ కే.శ్రీనివాస్ అన్నారు. మహాసభల్లో ‘విద్యలో రాజ్యాంగ విలువలు’ అనే అంశంపై మాట్లాడారు. విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్ది, వారు సమాజ మార్పునకు కృషి చేసేలా తీర్చిదిద్దాలన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించి, విశ్వసించి, అనుసరించి, అమలు చేసే బాధ్యత పౌరులదేనన్నారు. చదువు సమాజ మార్పునకు ఉపయోగపడుతుందన్నారు. విద్యా రంగంతోపాటు ఉపాధ్యాయులకు అనేక సమస్యలు ఉన్నాయని, ఉపాధ్యాయులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. ప్రజల స్వేచ్ఛపై దాడులు జరుగుతున్నాయని, అనేక కారణాల వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతుందన్నారు. పోరాట శక్తిని కలిగి ఉండాలని, అదే మార్పును తెస్తుందన్నారు. ప్రతిఒక్కరూ మంచి సమాజం కోసం కృషి చేయాలన్నారు.

సమాజంలో పెరుగుతున్న అంతరాలు : కే.నాగేశ్వర్

దేశంలో పాలకులు అవలంభిస్తున్న అసంబద్ధమైన విధానాల వల్ల సమాజంలో అంతరాలు పెరుగుతున్నాయని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. దేశంలో బడా పెట్టుబడిదారుల ఆదాయాలు భారీగా పెరుగుతున్నా, వారి నుంచి తక్కువ ట్యాక్సీ వసూలు చేస్తున్నారన్నారు. మధ్య తరగతి ఉద్యోగుల నుంచి మాత్రం వసూలు చేసే పన్ను అధికంగా ఉందని, అదే సమయంలో పెట్టుబడిదారులకు అధిక పన్ను రాయితీ ఇస్తుందన్నారు. దేశంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు అల్పహారం అందించేందుకు అయ్యే ఖర్చు కేవలం రూ.4వేల కోట్లు మాత్రమే ఉందన్నారు.

ప్రపంచంలో పలు దేశాలు నూటికి నూరుశాతం అక్షరాస్యత సాధించాయని, భారత దేశంలో 67శాతం అక్షరాస్యత మాత్రమే సాధించామని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల కాలంలో రాజ్యాంగం ద్వారా ఏమి సాధించామని అనుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ వ్యక్తి అభ్యున్నతికి, సమాజ వికాసానికి విద్య అవసరమన్నారు. ఉపాధ్యాయులు వేసే పునాది ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీష్ మాట్లాడుతూ 206 సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేశానని పెండింగ్ బిల్లు సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్, రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఏపీయూటీఎఫ్ అధ్యక్షుడు నక్క శ్రీనివాసరావు, ఎస్టీఎఫఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సంయుక్త, టాఫ్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, టీఎసయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, టీజీఎస్సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, నల్లగొండ జిల్లా టీఎసయూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బక్క శ్రీనివాసచారి, పెరుమాళ్ల వెంకటేశం, మాజీ అధ్యక్షులు ఎడ్ల సైదులు, జి.అరుణ, ఆయుష్ ఘోష్, విద్యాసాగర్ రెడ్డి, నలపరాజు వెంకన్న, బంగారయ్య, లక్ష్మారెడ్డి, రాములు, సోమ శేఖర్, రాజశేఖర్ రెడ్డి, నాగమణి, యాకయ్య, నర్సింహా తదితరులు ఉన్నారు. అంతకు ముందు పట్టణంలో నల్లగొండ గడియారం సెంటర్ నుంచి లక్ష్మి గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

# తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన బిఎల్ ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జనవరి 02: హైద్రాబాద్ బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్ పి)రాష్ట్ర కార్యాలయంలో బిఎల్ఎఫ్ , చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ చేతుల మీదుగా తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రములోని బిఎల్ టీయూ, బీడీ కార్మిక సంఘం కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ, 2025 సంవత్సరంలో అగ్ర స్థానంలో నిలువాలని, కార్మికులకు ఎక్కడ కష్టం వచ్చిన వారికి రక్షణగా ఉంటుందని, అలాంటి బిఎల్ టీయూ, బీడీ కార్మిక సంఘం 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం శుభ పరిమాణం అన్నారు.ఈ కార్యక్రమంలో, బహుజన లెఫ్ట్ పార్టి రాష్ట అధ్యక్షులు,దండి వెంకట్,రాష్ట్ర ప్రదాన కార్యదర్శి తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, బహుజన లెఫ్ట్ పార్టి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ యం.యం. గౌడ్,సబ్బని లత, నాగారపు యెల్లయ్య, వద్ల సాయి



కృష్ణ, రాష్ట్ర కోశాధికారి మారోజు సునీల్, రాష్ట్ర కమిటీ సభ్యులు మొర అజయ్, మైమూద్ సైయ్యద్,అరుణ,కళావతి,బిఎల్ టీయూ రాష్ట్ర నాయకులు యం.రాజేందర్,గంగా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జనగామ నూతన ఏ.ఎస్పీ



హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)జనవరి2: జనగామ డివిజన్ నూతంగా ఏ.ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పందరి చేతన్ నితిన్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్చాలను అందజేశారు. మహారాష్ట్ర కు చెందిన పందరి చేతన్ నితిన్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి 2022 సంవత్సరంలో ఐపిఎస్ కు ఎంపికై, గత ఏడాది శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం గ్రేహౌండ్స్ లో విధులు నిర్వహిస్తు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనగామ ఏ. ఎస్పీ గా పందరి చేతన్ నితిన్ నిన్నటి రోజున బాధ్యతలు చేపట్టారు.

# జ ఎస్ ఆర్ ఆధ్వర్యంలో జి ఎన్ ఆర్ జన్మదిన వేడుకలు

భారత శక్తి ప్రతినిధి, హనుమకొండ, జనవరి 2:వరంగల్ గోవిందరాజుల గుట్ట దేవాలయంలో గోపాల నవీన్ రాజ్ జన్మదిన వేడుకలు గణిపాక సుధాకర్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. గోవిందరాజుల గుట్ట దేవాలయంలో గోపాల్ నవీన్ రాజు పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక అర్చనలు,పూజలు నిర్వహించి భారీ కేక్ కట్ చేయడం జరిగింది. అనంతరం నిరుపేదలు 200 మందికి అన్న ప్రసాదాలు అందజేసి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గణిపాక సుధాకర్ మాట్లాడుతూ గోపాల్ నవీన్ రాజ్ దేవుని దీవెనలతో 100 కాలాలపాటు కుటుంబ సభ్యులతో చల్లగా ఉండాలని రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఎల్లప్పుడూ నవీన్ రాజ్ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవాలని కోరారు.ఈ



కార్యక్రమంలో కిరణ్,కిషోర్,భాను,నవీన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత





మందమర్రి (భారత శక్తి) జనవరి 2:మందమర్రి మున్సిపాలిటీ పార్టీలోని 19వ వార్డు విద్యానగర్ లో నివాసం ఉంటున్న గోడిసేల రాజం అనారోగ్య కారణాల వల్ల చనిపోవడం జరిగింది.అలాగే విద్యానగర్ ఎస్సీ ఎస్టీ కాలనీకి చెందిన మరో వ్యక్తి ఆవునూరి రాయమల్లు చనిపోయిన వారి ఆర్థిక పరిస్థితులను తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.

చెన్నూరు శాసనసభ్యులు డాక్టర్ వివేక్ వెంకటస్వామి ఆదేశాల ప్రకారంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్ కాంగ్రెస్ నాయకులు ఇరు కుటుంబాలకు (10000) పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి వారిని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మంకు రమేష్, ఎండి సుకూరు, వేటూరి సత్యనారాయణ, డాక్టర్ లింగన్న, ఛీద్రాల సతీష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్స్ పత్రాలను అందజేసిన జియం.

మందమర్రి (భారత శక్తి) జనవరి 2:నూతన సంవత్సరంలో కొత్త ఉత్సాహంతో ఇంకా ఎక్కువ కృషిచేసి సంస్థ ప్రగతికి అందరూ దోహద పడాలని జనరల్ మేనేజర్ జి దేవేందర్ అన్నారు. గురువారం జిఎం కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిఎం జి దేవేందర్ పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జనరల్ సర్వీస్ లింక్డ్ ప్రమోషన్స్ పత్రాలను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యాలయ ఉన్నతాధికారులకు సిబ్బందికి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ,జి.ఎం సేఫ్టీ రఘు కుమార్, ఎస్.ఓ.టు జి.ఎం విజయ్ ప్రసాద్, ఏ.ఐ.టీ.యూ.సీ మందమర్రి ఏరియ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారయణ, సి.ఎం.ఓ ఏ.ఐ అధ్యక్షులు రవి, ఏరియాస్ సేఫ్టీ ఆఫీసర్ రవీందర్,డీ.జీ.ఎం ఇ %ఱ% ఎం వెంకటరమణ,పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్,డీ.జీ.ఎం ఐ.డి రాజన్న,ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి,ఏరియా సర్వే ఆఫీసర్ బందోపాధ్యాయ, ఎస్.కె గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదిర్, క్వాలిటీ ఇంచార్జ్ ప్రదీప్,పర్చేస్ అదికారి బాబు, సెక్యూరిటీ ఆఫీసర్ రవి, డివైపిఎం ఆసిఫ్, జి.ఎం కార్యాలయ





ఉన్నతాధికారులు, జి.ఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శుక్రవారం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య కమీషన్ జిల్లాకు రాక.

కడప, జనవరి 02(భారత శక్తి ): షెడ్యుల్ కులాలలోని ఉప వర్గీకరణ పై విచారణ చేయడానికి ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య కమీషన్ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు డిఆర్ఓ విశ్వేస్వర నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేది(శుక్రవారం) ఉదయం.7.30గం.లకు కర్నూలు నుండి రోడ్డు మార్గం ద్వారా బయల్దేరి ఉదయం.10.30 గం.లకు జిల్లాకు చేరుకుని, 11.00 గం.ల నుండి మధ్యాహ్నం.2.00 గం.ల వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశం నిర్వహించడంతో పాటు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న సభా భవనం నందు వివిధ ఉప కుల సభ్యులు, సంఘాలతో వినతి పత్రాలను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3.30గం.లకు రోడ్డు మార్గం ద్వారా %ూరా=% నెల్లూరుకు బయల్దేరి వెళతారని డిఆర్ఓ ఆ ప్రకటనలో తెలిపారు.

# కోనో కార్పోస్ మొక్కలతో పొంచి ఉన్న ప్రమాదం - ప్రజల,మూగ జీవాల ప్రాణాలకే ముప్పంటున్న నిపుణులు..

## -జిల్లా వ్యాప్త ఆందోళనకు సిపిఎం కార్యాచరణ.

## సంకె రవి( సిపిఎం) జిల్లా కార్యదర్శి.



మంచిర్యాల,జనవరి 02,(భారత శక్తి): కోనో కార్పస్ ముక్కలతో ప్రజలు,మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి శంకర్ రవి అన్నారు.ముందు చూపులేని ప్రభుత్వాలు,జిల్లా ప్రజా ప్రతినిధులు,అధికారులు మంచిర్యాల వ్యాప్తంగా కోనో కార్పోస్ విషపు మొక్కలను నాటించడం,ప్రత్యేక శ్రద్ధతో పెంచడం జరిగింది.వీటితో ప్రజల,మూగ జీవాల ఆరోగ్యాలకు పెను ముప్పు పొంచున్నదని పర్యావరణ వేత్తలు,డాక్టర్లు చెప్పుతున్నా,మరో ప్రక్క సిపిఎం మంచిర్యాల జిల్లా కమిటీ ప్రతినిధి బృందం ప్రజావాణిలో 19/12/2024 న జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన మొక్కల తోగింపుకు తగు చర్యలు తీసుకోవడం లేదు..ప్రభుత్వ,జిల్లా ప్రజా ప్రతినిధుల, అధికారుల వైఖరి చూస్తుంటే ప్రజల,మూగ జీవాల ప్రాణాలను అనారోగ్యాల పాలు చేసి మరణించే విధంగా చెయ్యడం కోసం కంకణం కట్టుకున్నట్లుగా కనిపిస్తున్నది.ఇప్పటికే మంచిర్యాల జిల్లా ప్రజలు వాతావరణ కాలుష్యంతో రోజు రోజుకు అనేక రకాల జబ్బులకు గురై ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సర%శీ% విష జ్వరాలు వచ్చి నెలల తరబడి జీవన్మరణంతో బ్రతుకుతున్నారు.పలువురు మరణించడం జరుగుతుంది.పర్యావరణాన్ని కాపాడడం పేరుతో విషవాయునిచ్చే కొనో కార్పస్ మొక్కలను జిల్లా వ్యాప్తంగా పెట్టించడం జరిగింది.

ఈ మొక్కల వల్ల శ్వాసకోశ వ్యాధులు,అలర్జీ,ఆస్తమా, లంగ్ క్యాన్సర్,ఇతర అనారోగ్య సమస్యలు వస్తు,పర్యావరణానికి ముప్పు ఏర్పాడడం జరుగుతుందని.మనుషులతో పాటు, మూగా జీవాల మనుగడకు కూడ ప్రమాదం పొంచి ఉన్నదాన్ని ప్రముఖులైన డాక్టర్లు,పర్యావరణ వేత్తలు,మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కోనో కార్పస్ మొక్కల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను తెలియజేస్తు వివిధ పత్రికల్లో ప్రముఖంగా వార్తలు కూడ వచ్చాయి,వస్తున్నాయి. ఇంత తీవ్రమైన ప్రమాదం ఉన్న కానీ మొక్కలను తొలగించుతానికి చర్యలు చేపట్టడం లేదు.మొక్కలను పెట్టించేటప్పుడున్న శ్రద్ధ తొలగించడంలో కన్పించడం లేదు. ఈ మొక్కలు జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. ప్రజల,మూగా జీవాల ఆరోగ్యాల సంరక్షణ,మనుగడ కోసం,పర్యావరణ రక్షణ కోసం యుద్ధ ప్రాతిపదికన కానో కార్పస్ మొక్కలను తొలగించుటకు తగు చర్యలు చేపట్టక పోతే జిల్లా వ్యాప్తంగా సిపిఎం పోరాట కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అని సంకె రవి తెలిపారు.

# "ప్రజాదర్బార్" దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

ములుగు జిల్లా ప్రతినిధి,జనవరి 02 (భారత శక్తి):ప్రజల కోసం ,ప్రజా సమస్యలకోసం నిరంతరం పనిచేసేవే పత్రికలు అని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ఎం ఎల్ ఏ క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తో ప్రజాదర్బార్ తెలుగు దిన పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ముందుగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజా పక్షపాతి "ప్రజాదర్బార్" దిన పత్రిక అని అన్నారు. ప్రజాదర్బార్ దినపత్రిక గత ముప్పై సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై అవిశ్రాంతంగా అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా నిలిచిందని అన్నారు. ఎడిటర్ వేణుగోపాల శర్మ నేతృత్వంలో



ప్రజాదర్బార్ దినపత్రిక దిన దినాభివృద్ధి చెందుతూ..ప్రజా సమస్యలకోసం నిరంతరం కృషి చేయాలని కోరారు.

ములుగు జిల్లాలో దినపత్రికలో పనిచేస్తున్న రిపోర్టర్ల ను అభినందించారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చల్లగురుగుల రాజువర్ధన్,రిపోర్టర్లు గంగ్రత్ జయాకర్, పెండెం బిక్షపతి, ములుగూరి సంపత్, అలుగోజు కోటి లింగాచారి పాల్గొన్నారు.

# హనుమకొండలో వరలక్ష్మీ మెడికల్స్ అండ్ సర్జికల్స్ షాపు ప్రారంభం.



భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, జనవరి 2:హనుమకొండ కేయూ క్రాస్ లోని కందకట్ల కాంప్లెక్స్ లో నిర్వాహకులు మడతలపాటి ఆనంద్ నూతనంగా ఏర్పాటు చేసిన వరలక్ష్మీ మెడికల్స్ అండ్ సర్జికల్స్ షాపును బంధుమిత్రుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మడతలపాటి ఆనంద్ మాట్లాడుతూ హనుమకొండ నగరంలోని మెడిసిన్,సర్జికల్స్ కొనుగోలు చేసే కస్టమర్లకు అతి తక్కువ ధరకు లభిస్తాయని తెలిపారు. అంతేకాకుండా మెడిసిన్ ఆర్డర్ పై డోర్ డెలివరీ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సామ రాజు,రాజ్ కుమార్, రణదీప్,అనిల్,వినయ్,శ్రావణ్,రాజేశ్వర్ రెడ్డి, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# లక్ష డప్పులు వేయి గొంతులు కు సంపూర్ణ మద్దతు

## ఓయూ జేఏసీ నేత ప్రజాకవి దరువు అంజన్న

మందమర్రి టౌన్,జనవరి 02,(భారత శక్తి):ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఫిబ్రవరి 3 న తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతులు కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఓయూ



జేఏసీ నేత ప్రజాకవి దరువు అంజన్న తెలిపారు. గురువారం మందమర్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 33 జిల్లాలోని బీసీ కవులు కళాకారులు న్యాయపోరాటమైన ఎస్సీ వర్గీకరణకు ఊరూరా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా సుధీర్ఘ పోరాటం చేస్తున్నారని అన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటం న్యాయమైనదని సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ పై స్పష్టమైన తీర్పునిచ్చిందని ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నాయన్నారు. కొందరు మాల సామాజిక వర్గానికి చెందిన నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికైనా వారి ప్రయత్నాలు మానుకొని మందకృష్ణ మాదిగకు బేషరతుగా మద్దతు నివ్వాలని ఆయన కోరారు.

ఫిబ్రవరి 3న జరిగే లక్ష డప్పులు వేయి గొంతులు కార్యక్రమానికి లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో తెలంగాణ కళా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు సత్యం రెడ్డి, శశిధర్ రెడ్డి లు పాల్గొన్నారు.

# పెరుగుతున్న భార్య బాధితులు

న్యూఢిల్లీ, జనవరి 2, దేశంలో భార్య బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. బెంగళూరులో టెకీ అతుల్ సుభాశ్ ఆత్మహత్య ఘటన మరిచిపోక ముందే ఢిల్లీలో మరో భార్య బాధితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఢిల్లీలో ప్రముఖ కేఫ్ యజమాని ఆత్మహత్య చేసుకోవడం సంచలనం రేపింది. ఉడ్‌బాక్స్ కేఫ్ వ్యవస్థాపకుడు పునీత్ ఖురానా తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. . కళ్యాణ్ విహార్ ప్రాంతం మోడల్ టౌన్‌లో నివాసం ఉంటోన్న పునీత్.. తన గదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పునీత్ ఖురానా, ఆయన భార్య మానికా జగదీశ్ పహ్వా మధ్య విడాకుల కేసు నడుస్తుండగా.. వ్యాపారం విషయంలో ఇద్దరి మధ్య గొడవలు నడుస్తున్నాయిఉడ్‌బాక్స్ కేఫ్ యాజమాన్యం విషయంపై పునీత్, మానికా మధ్య గొడవలు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. భార్య వేధింపులతోనే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడినట్టు పునీత్ కుటుంబసభ్యులు ఆరోపించారు. పునీత్, మానికాకు 2016లో పెళ్లి జరిగింది. ఖురానా, మానికా మధ్య జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన 16 నిమిషాల ఆడియో క్లిప్ ఒకటి బయటకు వచ్చింది. ఈ ఆడియోలో ఇరువురి మధ్య బిజినెస్ ప్రాపర్టీ గురించి జరిగిన వాగ్వాదం రికార్డయ్యింది. 'మనం విడాకులు తీసుకున్నాం.. కానీ, నేను ఇంకా వ్యాపార భాగస్వామినే.. నాకు రావాల్సిన మొత్తం చెల్లించాల్సిందే' అని పునీత్‌ను మానికమె డిమాండ్ చేయడం స్పష్టంగా వినిపిస్తోంది. పునీత్ ఆత్మహత్య ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు.. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పునీత్ భార్యను విచారణకు హాజరుకావాలని నోటీసు పంపారు. తమ కుమారుడిని మానికా చాలా వేధించినట్టు పునీత్ పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం కావాలని వాళ్లు వేడుకుంటున్నారు. ఏడాది వరకు ఇద్దరు బాగానే ఉన్నారు. తరువాత గొడవలు ప్రారంభమయ్యాయి. తన బిడ్డను చాలా టార్చర్ చేసింది.. ఎంతో మానసిక వేదన అనుభవించాడు.. డబ్బుల గురించి , బిజినెస్ గురించి గొడవలు జరిగాయి.. అయితే తన కొడుకు ఎప్పుడు తన బాధను తమకు చెప్పలేదని తల్లిదండ్రులు చెప్పారు. తాము టెన్షన్ పడుతామని చెప్పేవాడు కాదు.. లోలోన చాలా బాధపడ్డాడని చెప్పారు. తన భార్య పెట్టే టార్చర్ భరించలేకే తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కొడుకు మరణించాడు.. తమకు న్యాయం కావాలంటూ పునీత్ తల్లిదండ్రులు చెబుతున్నారు. డిసెంబరు మొదటి వారంలో బిహార్‌కు చెందిన అతుల్ సుభాష్.. బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య నికిత సింఘానియా, ఆమె కుటుంబసభ్యుల వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు అతుల్ 24 పేజీల సూసైడ్ లెటర్ రాసి.. దానిని హైకోర్టు, తాను పనిచేసే ఆఫీసు, తల్లిదండ్రులకు మెయిల్ చేశాడు. న్యాయవ్యవస్థపై కూడా అతుల్ ఆరోపణలు చేయడం.. విడాకుల కేసు విచారించిన జడ్జి తనను రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపించాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలన రేపింది. ఈ కేసులో అతుల్ భార్య నికిత, ఆమె తల్లి, సోదరుడ్ని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరవక ముందే ఢిల్లీలో పునీత్ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర కలకలం రేపుతోంది.

# స్విస్ లో కూడా బురఖా బ్యాన్

న్యూఢిల్లీ, జనవరి 2, స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రజలు తిరిగే ప్రైవేట్ భవనాల్లో కూడా బురఖా నిషేధించబడుతుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 96,947) జరిమానా విధించబడుతుంది. ఈ నిర్ణయాన్ని ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో జరిగిన దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో, 51 శాతం మంది బురఖా నిషేధానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ నిర్ణయాన్ని అక్కడి పార్లమెంట్ కూడా ఆమోదించింది. దాదాపు 8.85 మిలియన్ల జనాభా కలిగిన స్విట్జర్లాండ్‌లో, ముస్లింలు 5 శాతం ఉన్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం, బహిరంగ ప్రదేశాల్లో ముఖాన్ని కప్పి ఉంచడం నిషేధించబడింది, ఈ నిబంధనను ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ. 96 వేలు) జరిమానా విధించబడుతుంది. స్విట్జర్లాండ్‌లో 2021 ప్రజాభిప్రాయ సేకరణలో ఆమోదించబడిన ఈ నిషేధాన్ని ముస్లిం సంస్థలు విమర్శించాయి. విశేషమేమిటంటే, 2009లో దేశంలో కొత్త మినార్ల నిర్మాణాన్ని నిషేధించిన గ్రూపునే బురఖాపై నిషేధం విధించింది. 2021లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్విట్జర్లాండ్‌లో 51.21 శాతం మంది ప్రజలు ఈ నిషేధానికి మద్దతుగా ఓటు వేశారు. మితవాద స్విస్ పీపుల్స్ పార్టీ దేశంలో బురఖా నిషేధాన్ని ప్రతిపాదించింది, ఇది దేశ సాంస్కృతిక విలువలు, ప్రజా భద్రతను కాపాడుతుందని వాదించింది. దీని తరువాత, 2022 సంవత్సరంలో దేశ జాతీయ కౌన్సిల్ ఈ చట్టాన్ని ఆమోదించింది. దీని ప్రకారం, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, దుకాణాలు, రెస్టారెంట్లలో మహిళలు తమ ముఖాలను పూర్తిగా కప్పి ఉంచడం నిషేధించబడింది. బురఖా నిషేధానికి సంబంధించి స్విస్ ప్రభుత్వం విమానాల్లో లేదా దౌత్య, కాన్సులర్ ప్రాంగణాల్లో బురఖా నిషేధం వర్తించదని స్పష్టం చేసింది. ఇది కాకుండా, మతపరమైన ప్రదేశాలు, ఇతర పవిత్ర ప్రదేశాలలో ఒక వ్యక్తి తన ముఖాన్ని కప్పుకోవడానికి కూడా అనుమతించబడతారు. ఆరోగ్యం, భద్రతా కారణాలు, సాంప్రదాయ ఆచారాలు లేదా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఫేస్ కవర్లు అనుమతించబడతాయని ప్రభుత్వం తెలిపింది. కళాత్మక లేదా వినోద కారణాలతో పాటు ప్రకటనల ప్రయోజనాల కోసం వారికి ఈ ఆమోదం మంజూరు చేసింది. సెప్టెంబరు 2022లో కొంతమంది ముస్లిం మహిళలు ధరించే బురఖా వంటి ముఖ కవచాలను నిషేధించాలని స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువ సభ ఓటు వేసింది. జాతీయ కౌన్సిల్ ఈ చట్టానికి వ్యతిరేకంగా 29 ఓట్లతో పోలిస్తే 151 ఓట్లతో ఆమోదించింది. అనేక ముస్లిం సంస్థల అభ్యంతరాలు ఉన్నప్పటికీ రైట్-వింగ్ స్విస్ పీపుల్స్ పార్టీ ఈ చట్టం కోసం ముందుకు వచ్చింది. ఇలా చేయడంలో స్విట్జర్లాండ్ మొదటి దేశం కాదు, ఐరోపాలోని బెల్జియం, డెన్మార్క్, ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ఇలాంటి ఆంక్షలు విధించాయి. అయితే, ఈ యూరోపియన్ దేశాలలో మత స్వేచ్ఛకు సంబంధించి చాలాసార్లు ప్రశ్నలు తలెత్తాయి. ప్రజా భద్రత పేరుతో చేసిన ఈ చట్టాల ద్వారా ముస్లిం మహిళలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.

# రవి శాస్త్రి ఆరు సిక్సుల రికార్డ్ కు 40 ఏళ్ళు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని ) రవి శాస్త్రి ఆరు సిక్సుల రికార్డ్ కు 40 ఏళ్ళు నిండాయి. 18 సంవత్సరాల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన రవిశాస్త్రి... కుడి చేతితో బ్యాటింగ్ ఎడమచేతితో స్పిన్ బౌలింగ్ చేయగలడు. 1985 సంవత్సరంలో జనవరి 3వ తేదీన ఆరు బాల్లలో ఆరు ఆరు సిక్సర్లు కొట్టిన మొట్ట మొదటి భారతీయుడిగా రికార్డు సాధించాడు రవి శాస్త్రి. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా రవిశాస్త్రి రికార్డు సృష్టించాడు. 1985లో ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ చాంపియన్ క్రికెట్లో తన క్రీడా జీవితంలోనే అత్యంత ప్రతిభను కనబర్చి చాంపియన్ ఆఫ్ చాంపియన్స్‌గా ఎన్నికైనాడు. అదే సీజన్‌లో ఒకే ఓవర్లో వరుసగా 6 సిక్సర్లు కొట్టి ఈ ఘనతను సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ప్రపంచంలోనే ఈ ఘనతను సాధించిన వారిలో వెస్ట్ఇండీస్ కు చెందిన గారీ సోబర్స్ తర్వాత ఇతను రెండో వాడు మాత్రమే. టెస్ట్ క్రికెట్లో ఇతను 11 సెంచరీలు సాధించాడు, రవిశాస్త్రి క్రికెట్ కు వీడ్కోలు పలికిన తర్వాత క్రికెట్ కామెంటేటర్ గా మారిపోయాడు. ఎన్నో మ్యాచ్ లకు తన స్టైల్లో క్రికెట్ కామెంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరించారు రవి శాస్త్రి. కొన్ని రోజుల పాటు టీమిండియా కోచ్ గా కొనసాగి టీమిండియా విజయాలను ముందుండి నడిపారు.

# అందాల కశ్మీరం... మంచులో నిండిపాయెరా...

శ్రీనగర్, జనవరి 2, జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాలు మంచుమయం అయ్యాయి. ఎటువైపు చూసినా కనుచూపు మేరలో హిమపాతం దర్శనమిస్తోంది. మంచు దుప్పటి కప్పుకున్న కాశ్మీర్ అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడ చూసినా పర్యాటకుల సందడే కనిపిస్తోంది. అదే సమయంలో భారీ మంచు వర్షంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా.. రైల్వే ట్రాకులపై భారీగా మంచు పేరుకుపోవడంతో పలు ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ దెబ్బతింది. దీంతో.. స్నో కట్టర్ అమర్చిన లోకోమోటివ్ ద్వారా ట్రాక్ క్లియరెన్స్ పనులు కొనసాగిస్తున్నారు రైల్వే అధికారులు. ట్రాకులపై పేరుకుపోయిన మంచును తొలగించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మంచు కారణంగా పలు ప్రాంతాల్లో రైలు సర్వీసులను నిలిపివేశారు. ఈ క్రమంలోనే.. శ్రీనగర్ రైల్వే స్టేషన్‌లో మంచు పెద్దయెత్తున కురుస్తుండడంతో రైల్వే ట్రాకులు మంచుతో నిండిపోయాయి. దాంతో.. అలెర్ట్ అయిన ఇండియన్ రైల్వే టీమ్.. స్నో కట్టర్లతో రంగంలోకి దిగింది. రైలు ఇంజిన్లకు స్నో కట్టర్‌లను అమర్చి ట్రాకులపై నిలిచిన మంచును తీసివేస్తున్నారు. కంటిన్యూ హిమపాతం ఉన్నప్పటికీ.. రైల్వే కనెక్టివిటీకి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. శ్రీనగర్ రైల్వే స్టేషన్‌లో లోకోమోటివ్ స్నోకట్టర్‌లతో మంచు తొలగిస్తున్న దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు.. ఎప్పటికప్పుడు మంచు తొలగిస్తుండడంతో జమ్మూ-శ్రీనగర్ హైవేపై వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇక.. మరో రెండు రోజులపాటు మంచు భారీగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో దట్టమైన మంచు కురుస్తుందని వెల్లడించింది. ఎల్లుండి నుంచి జనవరి 6 మధ్యలో కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ హిమపాతం కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఇదిలావుంటే.. న్యూ ఇయర్ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో మంచు అందాల మధ్య పర్యాటకులు ఎంజాయ్ చేశారు.

# బీటా బేబీస్ జనరేషన్

న్యూయార్క్, జనవరి 2, మనమందరం 2025లోకి అడుగుపెట్టేశాం. అయితే ఈ ఏడాదికి ఒక ప్రత్యేక ఉంది. ఇకనుంచి 2025 జనవరి ఒకటి నుంచి పుట్టేవారిని జనరేషన్ బీటాగా పిలవనున్నారు. 2025 నుంచి 2039 మధ్య జన్మించే తరాన్ని బీటా బేబీస్‌గా పిలవనున్నారు. అయితే ఈ బీటా జనరేషన్ టెక్నాలజీ యుగంలో పిల్లలు అత్యున్నతంగా ఎదుగుతారని నిపుణలు చెబుతున్నారు. అలాగే ఇంతకుముందున్న తరాలు ఎప్పుడూ చూడని సవాళ్లను ఎదుర్కొంటారని.. నూతన అవకాశాలు అందిపుచ్చుకుంటారని భావిస్తున్నారు. అయితే జనరేషన్ బీటా తరం 2035 నాటికి ప్రపంచ జనాభాలో 16 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఈ తరం 22వ శతాబ్దపు ప్రారంభానికి సాక్షంగా నిలుస్తారని చెబుతున్నారు. అంతేకాదు సాంకేతిక పరిణామాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), సామాజిక మార్పుల మధ్య బీటా తరం జీవితం గడుపుతుంది. అయితే ఈ తరం ప్రతి అంశంలో కూడా సాంకేతికతను వినియోగించడమే కాకుండా పర్యావరణ, సామాజిక సవాళ్లను కూడా ఎదుర్కోనుంది. ఇదిలాఉండగా.. 1981-1996 మధ్య పుట్టిన వాళ్లను మిలీనియల్స్ అని పిలుస్తారు. 1996 - 2010 మధ్య పుట్టినవారిని జెనరేషన్ జెడ్ అని అంటారు. 2010 నుంచి 2024 మధ్య పుట్టిన తరాన్ని అల్ఫా జనరేషన్‌గా పరిగణిస్తారు. ఇక 2025 నుంచి 2039 మధ్య పుట్టిన తరాన్ని బీటా బేబీస్‌గా పిలవనున్నారు. అయితే బీటా బేబీస్ తరంపై టెక్నాలజీ యుగం సామాజిక పరిశోధకుడు మార్క్ మెక్‌క్రిండిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనరేషన్ బీటా వారి జీవితాలు కృత్రిమ మేధా సాయంతోనే సాగుతాయని చెప్పారు. విద్య, ఆరోగ్యం, వినోదం, ఇతర విషయాల్లో వీళ్లు ఎక్కువగా ఏఐని వినియోగిస్తారని పేర్కొన్నారు


# ఎమ్మెల్యేల ప్రోగ్రెస్ రిపోర్ట్...



హైదరాబాద్, జనవరి 2, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి న్యూ ఇయర్ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రభుత్వ, పార్టీపరమైన అంశాలపై కీలక సూచనలు జారీ చేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇకపై తాను ఎక్కువ సమయం పార్టీ నాయకులకు కేటాయించనున్నట్లు, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. న్యూ ఇయర్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు తరలివచ్చారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి నివాసం సందడిగా మారింది. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే రిపోర్ట్ లు తన వద్ద ఉన్నాయని, అలాగే తన రిపోర్టు కూడా తాను తెప్పించుకున్నట్లు సీఎం అన్నారు. ఎవరి ప్రోగ్రెస్ రిపోర్టు వారికి అప్పగించడం జరుగుతుందని, ప్రజలకు ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. ఏడాది పాలనలో తెలిసి తప్పు చేయలేదని, తెలియకుండా జరిగిన తప్పులపై చర్యలు తీసుకున్నామంటూ సీఎం అన్నారు. ఏడాది పాలనలో ఎన్నికల కోడ్ రావడంతో పూర్తిస్థాయి పాలన ఆరు నెలలు సాగినట్లుగా భావించాలని, కేవలం ఆరు నెలల్లో ప్రజా మద్దతును తమ ప్రభుత్వం సాధించిందన్నారు. ఏడాది పాలన అనుభవాలు, వచ్చే నాలుగేళ్లకు ఉపయోగపడతాయని, ప్రజా ప్రభుత్వంగా మన ప్రభుత్వం గుర్తింపు పొందేలా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సీఎం సూచించారు. ఈ దశలో అంగన్వాడీ, డీలర్ల నియామకంలో పార్టీ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఓ మంత్రి కోరగా, ఆ విషయాన్ని సీఎం తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఆన్లైన్లో దరఖాస్తులు తీసుకొని, పారదర్శకంగా నియామకాలు చేపట్టకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టేందుకు సాహసించలేదని, తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సాగించిందన్నారు. ఇకపై పార్టీ నాయకులకు ఎక్కువ సమయం కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా కీలకమంటూ ప్రజా ప్రతినిధులకు సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రతి విషయం గురించి తన వద్ద సమాచారం ఉందని, పార్టీ బలోపేతానికి కూడా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారుతెలంగాణలో మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టినట్లు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని కూడా సీఎం అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు గుర్తించి ప్రభుత్వ ఇబ్బందులను అర్థం చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరు తమ పనితీరును మరింతగా మెరుగుపరుచుకుని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మద్దతు కూడబెట్టుకోవాలని సీఎం తెలిపారు.

# కారు గేరు మారుస్తారా...

హైదరాబాద్, జనవరి 2, బీఆర్ఎస్ అధినేత గత ఏడాది ఎక్కడా కనిపించలేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రచారానికి వచ్చారు. అన్ని జిల్లాల్లో పర్యటించారు. అయితే



పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ సాధించలేకపోయింది. దీంతో కేసీఆర్ నాటి నుంచి ఎర్రవెల్లి లోని ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. ఎవరైనా ఆయనను కలవాలనుకున్నాఅక్కడకు వెళ్లాల్సిందే. తప్పఆయన బయటకు రావడం లేదు. ఇటీవల మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించినా ఫాం హౌస్ నుంచి ఒక సంతాప ప్రకటన అయితే పంపారు తప్ప ఆయన మాత్రం బయటకు రాలేదు. నిజానికి మన్మోహన్ సింగ్ తో ఉన్నఅనుబంధంతో ఆయన ఢిల్లీకి వెళ్లి నివాళు లర్పించాల్సిన తరుణంలో ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. మరొకవైపు అసెంబ్లీ సమావేశాలకు కూడా దూరంగా ఉన్నారు. బడ్జెట్ సమావేశాలకు రాలేదు. సరే..ఇటీవల మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపేందుకు ప్రత్యేకంగా సమావేశమైన సభకు కూడా కేసీఆర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. తనకు మన్మోహన్ సింగ్ తో ఉన్న అనుబంధం ఆయన తన నోటి నుంచి చెప్పి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అందరిలో ఉన్నా దూరంగానే ఉన్నారు. ఇక తెలంగాణలో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఆయనపై ఇటు ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతుంది. మరోవైపు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు. ఈడీ అధికారులు అయితే ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఏసీబీ అధికారులు కూడా ఈ కేసులో విచారించే అవకాశాలున్నాయి. అంతే కాదు అరెస్ట్ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అంతా తానే అయి ఇన్ని రోజులు కార్యకర్తలకు భరోసాగా ఉన్న కేటీఆర్ కు నోటీసులు వచ్చిన సమయంలోనైనా కేసీఆర్ బయటకు రాకపోవడం గులాబీ పార్టీలో చర్చనీయాంశమైంది. అసలు కేసీఆర్ కు జనంలో తిరిగే ఆలోచన ఉందా? లేదా? అన్నది కూడా పార్టీలో తెలియకుండా ఉంది. కేసీఆర్ బయటకు వచ్చి జనంలో తిరిగితే కార్యకర్తలకు కూడా ధైర్యం కలుగుతుందని తెలిసినా ఫాం హౌస్ కే పరిమితమవ్వడవేంటన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. ఎర్రవెల్లి ఫాం హౌస్ లో కేసీఆర్ కేవలం వ్యవసాయ పనులు చూసుకుంటూ గడిపేస్తున్నారు. కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపేందుకు కూడా అక్కడకు నేతలకు వెళ్లాల్సిన పరిస్థితి. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని, రైతులకు ఇంత వరకూ భరోసా అందలేదని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ సమయంలో కేసీఆర్ వచ్చి కనీసం మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఇటు ప్రజల్లోనూ , అటు కార్యకర్తల్లోనూ ధైర్యం కలుగుతుందని, కానీ కనీసం ఆ పని కూడా చేయకపోతే ఎలా? అన్న ప్రశ్నలు గులాబీ పార్టీ నుంచి వినపడుతున్నాయి. అనేక మంది పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నా కేసీఆర్ బయటకు రాకపోవడంపై పార్టీలోనే ఒకింత నిరాశ నిస్పృహలు బయలుదేరాయి.

# రేవంత్ ఇప్పుడు పాన్ ఇండియా స్టార్

## భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 2, కేంద్ర మంత్రి గడ్కరీ ని సీఎం రేవంత్ రెడ్డి కలసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై వివరించారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును మొత్తం కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కోరాం. ముందు ల్యాండ్ సేకరించాలని కేంద్ర మంత్రి మాకు సూచించారు. దోచుకునే ,దాచుకునే ఆలోచన మాకు లేదని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అయన గురువారం నాడు గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ఇష్టా రీతిన ప్రాజెక్టు కాస్ట్ పెంచారు కాబట్టే..7 వేల కోట్ల ప్రాజెక్టులో 12 వేల అవినీతి జరిగిందని కేటీఆర్ అంటున్నాడు. కేటీఆర్ లాగే అందరూ చేస్తారనుకుంటున్నారు. కేసీఆర్ లా ప్రతిపక్షం ను మేము లేకుండా చేయాలనుకోవడం లేదు.. బలమైన ప్రతిపక్షం ఉండాలనుకుంటున్నాం. కేసీఆర్ ఎలాగూ బయటకు రాడు.. హరీష్ రావు, కేటీఆర్, కవిత వెళ్లి అయినా సమర్ధవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తే మంచిది. 2025లో అయినా బీఆర్ఎస్ నేతలకు జ్ఞానోదయం కలగాలి. రైతు భరోసా విషయం లో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుంది. కేసీఆర్ అనాలోచిత నిర్ణయం వల్ల రైతు బంధు లో 22 వేల కోట్ల రూపాయలు అనర్హులకు ఇచ్చారు. ఈ ఫార్ములా కేసులో కేటీఆర్ రోజు కో మాట మాట్లాడుతున్నాడు. ఒకరోజు సంబంధం లేదు అంటాడు.. మరోక రోజు అధికారులకు సంబంధం లేదు.. అంతా నేనే చేసాను అంటాడు. అధికారులకు సీరియస్ నెస్ తగ్గింది. బీఆర్ఎస్ లో సింగిల్ విండో ద్వారా ఆదేశాలు వెల్లెవి..ఇప్పుడు చాలా మంది నుంచి ఆదేశాలు వెల్తున్నాయి. పుష్ప అరెస్ట్ తో రేవంత్ రెడ్డి పాన్ ఇండియా సీఎం అయ్యారని అన్నారు.

# రైతు భరోసా... సెల్ఫ్ డిక్లరేషన్

హైదరాబాద్, జనవరి 2,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఈ నెలలోనే అమలు చేయడానికి సిద్ధమయింది. సంక్రాంతికి రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేయడంతో అందుకు తగినట్లుగా విధివిధానాలను నిర్ణయించే పనిలో ఇటు అధికారులు, అటు మంత్రి వర్గ ఉప సంఘం ఉంది. అయితే ఇప్పటికే కొన్ని విధివిధానాలు ఖరారయ్యాయని చెబుతున్నారు. సంక్రాంతి నుంచి విడతల వారీగా నిధులను జమ చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుంది. తొలి విడత నిధులను 7,500 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్లాన్ చేస్తుంది. అయితే సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా ను తొలుత విడుదల చేయాలన్న ఆలోచనలో ఉంది.. అదే సమయంలో కొన్ని ముఖ్యమైన నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసింది. రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్న షరతు విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తన భూమిలో ఏ పంటను సాగు చేస్తున్న విషయాన్ని రైతు డిక్లరేషన్ ద్వారా తెలియాచేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఎంత మేరకు రైతు సాగు చేశారో అంత వరకే రైతు భరోసా నిధులు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించిందని, మంత్రి వర్గ ఉప సంఘం కూడా ఈ రకమైన ప్రతిపాదనకు ఓకే చెప్పిందన్న వార్తలు వస్తున్నాయి. ఏదో ఒక పంట వేసి భూమిని సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులను తొలుత జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల జరిగే మంత్రివర్గ




సమావేశంలో... అదే సమయంలో మిగిలిన వారి విషయం తర్వాత ఆలోచించవచ్చని తెలిపింది. సాగు కాని భూములకు రైతు భరోసా నిధులు ఇవ్వడం అనవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. సాగు కాని భూములకు రైతు భరోసా నిధులను జమ చేస్తే అది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని రేవంత్ రెడ్డి కూడా అభిప్రాయపడుతున్నారు. శాటిలైట్, ఇమేజ్ రిమోట్ సెన్సింగ్ సాయంతో సాగు విస్తీర్ణంపై ఒక క్లారిటీ వస్తుందని, దాని ప్రకారమే నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. జనవరి 2 వతేదీన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశమై దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. ఈ నెల 4వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసా విధివిధానాలపై నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది.

# ఉత్తర తెలంగాణలో.. ఎన్నికల సందడి

కరీంనగర్, జనవరి 2, త్వరలో జరగనున్న ఉత్తర తెలంగాణలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది, థర్డ్ జెండర్లు ముగ్గురు ఉండగా ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది ఉన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ కసరత్తు చేస్తున్న క్రమంలో ఇప్పటికే రెండు సార్లు ఓటర్ నమోదుకు అవకాశమిచ్చింది. తుది జాబితాను ప్రకటించి ఇదే జాబితాతో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓటర్ల సంఖ్య క్రమంలో పట్టభద్రులకు సంబంధించి 499 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్లకు 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.ఓటరు నమోదులో కరీంనగర్ టాప్ లో నిలిచింది. పట్టభద్రులు, టీచర్ ఓటరు నమోదులో రెండింటిలో కరీనీనగర్ జిల్లా వారే ఎక్కువ మంది ఉన్నారు. పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 15 జిల్లాలుండగా పట్టభద్రుల ఓటరు నమోదులో కరీంనగర్ జిల్లాలో 69,657 మంది అత్యధిక సంఖ్యలో ఓటరుగా నమోదు కాగా అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేవలం 2,420 మంది మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవడం విశేషం.ఉపాధ్యాయ ఓటరు నమోదులో 4,020 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా అతి తక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 81మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. నిజామాబాద్, సిద్దిపేట జిల్లాలు కరీంనగర్ తరువాత స్థానాల్లో నిలువగా ఇతర జిల్లాలో నమోదు అంతంతమాత్రమే. సాధారణ ఓటరు జాబితాలో మహిళల ఆధిక్యం ఉండగా ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పురుష సంఖ్యకు సగానికి ఉండటం గమనార్హం.ఈ ఏడాది సెప్టెంబరు 30న ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమై నవంబరు 6వ తేదీ వరకు కొనసాగింది. దీంతో పట్టభద్రులు 3,58,579 మంది ఓటును నమోదు చేసుకోగా, ఉపాధ్యాయులు 27,994 మంది ఓటును పొందడానికి ఉత్సాహాన్ని చూపించారు. తిరిగి నవంబర్ 23వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు




కొత్తగా నమోదుతో పాటు అభ్యంతరాలకు సమయం ఇవ్వడంతో కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి పలువురు ముందుకొచ్చారుపక్షం రోజుల వ్యవధిలో పట్టభద్రులవి 28,111 ధరఖాస్తులు కొత్తగా చేరగా.. ఉపాధ్యాయుల పరంగా అదనంగా 5,054 మంది ఆసక్తిని చూపించారు. దీంతో మొత్తంగా పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తుల సంఖ్య 3,86,690కి చేరింది. ఉపాధ్యాయ ఓటర్ల దరఖాస్తుల సంఖ్య 33,048కి పెరిగింది. మలి విడతలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను డిసెంబర్ 10 నుంచి పరిశీలించగా చాలా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. పక్కాగా ఉన్న వాటిని మాత్రమే ఆమోదం తెలిపి తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. ఇంకా ఎవరైనా నమోదు చేసుకునేవారుంటే షెడ్యూల్ వెలువడ్డాక నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యేవరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించనున్నది.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని బిఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ గా పోటీ చేసేందుకు సిద్దమైన సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు. ఒక్కరి పేరు రెండు మూడు చోట్ల నమోదు అయిందని, అత్యధికంగా 8 చోట్ల ఓటర్ జాబితాలో ఉందన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు విడుదల చేశారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆధార్ ఆధారంగా పట్టభద్రుల ఓటర్ల జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు.

# ఓరుగల్లు కమలానికి కష్టాలు...


వరంగల్, జనవరి 2, ఓరుగల్లు జిల్లా నేతల తీరు తలనొప్పిగా మారిందట. అంతర్గత వర్గపోరుతో క్యాడర్‌ను చేజార్చుకుంటున్న నేతలు ఇప్పుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అధిష్టానానికి లేఖలు సంధిస్తున్నారట. దీంతో ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారట కాషాయ పెద్దలు. దేశవ్యాప్తంగా బలాన్ని పెంచుకునేందుకు బిజెపి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం కోసం పావులు కదుపుతోంది పార్టీ తప్పిదాలు, అంతర్గత కుమ్ములాటల కారణంగా బలహీనపడుతున్నామని తెలుసుకున్న అదిష్టానం.. మొదటగా పార్టీలో నూతన కమిటీల ఏర్పాటుకు



శ్రీకారం చుట్టింది. బూత్ స్థాయి కమిటీల నిర్మాణం పూర్తికాగా.. మండల, జిల్లా స్థాయి కమిటీలను జనవరి మొదటి వారంలో ప్రకటించనుంది. క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే కమిటీల ఏర్పాటుకు సంబంధించి వర్గ పోరు తరాస్థాయికి చేరుతోంది. నేతల మధ్య వర్గపోరు కారణంగా తమ తమ అనుచరులకే కమిటీలలో అవకాశం కల్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో పార్టీ కోసం కష్టపడ్డ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది.ప్రస్తుత హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా ఉన్న రావు పద్మకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా నేతలంతా ఒక్కటయ్యారు. వరుసగా మూడుసార్లు అధ్యక్షురాలుగా పనిచేసిన రావు పద్మపై బిజెపిలోని మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలంతా గుర్రుగా ఉన్నారు. రావు పద్మ సీనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదని ఆరోపణలు ఉన్నాయి. అందుకే రావు పద్మను కాదని మిగతా నేతలంతా ఒక్కటై పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా అధ్యక్షురాలి పదవిలో ఉండి నేతలందరినీ కలుపుకోవాల్సిన ఆమె, వర్గాలను పెంచి పోషించారని బహిరంగంగానే బిజెపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి. కేంద్రంలో ఉన్న బిజెపి హనుమకొండకు చేసిన అభివృద్ధి పనులను సైతం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తీవ్రంగా విఫలమయ్యారని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, స్మార్ట్ సిటీ నిధులు బిజెపి ప్రకటిస్తే, ఈ విషయాలను కనీసం ప్రజల్లోకి తీసుకెళ్లలేదని మండిపడుతున్నారు.అన్ని జిల్లాలలో బీజేపీ పార్టీ కార్యాలయాలు ఉండగా, హనుమకొండ జిల్లాలో మాత్రం రావు పద్మ సొంత భవనంలో పార్టీ కార్యాలయాన్ని నడుపుతున్నారు. దీంతో రావు పద్మ వ్యతిరేకిస్తున్న కీలక నేతలంతా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరికొంతమంది వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో బీజేపీ పార్టీ కార్యాలయాలు నిర్మాణం జరిగింది కానీ.. హనుమకొండ జిల్లాలో మాత్రం ఆ నిధులను జిల్లా అధ్యక్షురాలు వాడుకున్నారని ఆరోపిస్తున్నారు కాషాయ నేతలు. మూడు సార్లు జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగినప్పటికీ, పార్టీ కార్యాలయాన్ని ఎందుకు నిర్మించలేకపోయారని మండిపడుతున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మరో అభ్యర్థికి టికెట్ ఇచ్చి ఉంటే గెలిచే అవకాశాలు ఉండేవని, రావు పద్మకు టికెట్ కేటాయించడంతో బిజెపి శ్రేణులే వ్యతిరేకించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. రావు పద్మ కారణంగా పార్టీ తీవ్రంగా డ్యామేజ్ అవుతోందని, ఆమెను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని అధిష్టానానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు సైతం వెళ్లాయి. అయినా అధిష్టానం ఎటువంటి చర్యలు తీసుకోలేదు.బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం నాంపెల్లి శ్రీనివాస్, సంతోష్ రెడ్డి, రావుల కిషన్, గుజ్జుల వసంత, మరికొంత మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తన వర్గానికి చెందిన వ్యక్తికే జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని రావు పద్మ అధిష్టానం పై ఒత్తిడి తెస్తున్నారంట. ఆ క్రమంలో రావు పద్మ అనుచరులకు పదవి దక్కకుండా ఇతర నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారట. వచ్చే ఎన్నికల్లో హనుమకొండలో బిజెపి జెండా ఎగురుతుందని, అందుకే అధ్యక్ష పదవి ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలని అధిష్టానానికి కొంతమంది నేతలు లేఖలు రాసారట. ఇన్నేళ్లు పార్టీ కోసం కష్టపడ్డ వారిని రావు పద్మ పట్టించుకోలేదని, ఆమె కారణంగానే పార్టీ బలహీనపడుతోందని సీనియర్లు విమర్శిస్తున్నారు. ఒకవేళ ఈ సారి కూడా పార్టీ పదవి ఆమె అనుచరులకే ఇస్తే.. పార్టీని వీడాల్సి వస్తుందని పద్మ వ్యతిరేకులు హెచ్చరిస్తున్నారు.

# టాప్ గేర్ లో నార్త్ హైదరాబాద్

హైదరాబాద్, జనవరి 2,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయంతో హైదరాబాద్ లోని ఉత్తర ప్రాంతంలో ఉన్న భూముల ధరలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో ధరలు ఆకాశాన్నంటాయి. తాజాగా తీసుకున్న నిర్ణయంతో ధరలు మరింత పెరిగే అవకాశముందని తెలిసింది. మేడ్చల్, కొంపల్లి, శామీర్ పేట్ వరకూ భూముల ధరలకు ఇక రెక్కలు వస్తాయి. అందుకు ప్రధాన కారణం మెట్రో రైలు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమే. ఇప్పటికే ఈ ప్రాంతం విస్తరించింది. దాదాపు మేడ్చల్ వరకూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేశారు. అనేక చోట్ల ఈ ప్రాంతంలో వేసిన వెంచర్లు అలాగే ఉన్నాయి. అమ్ముడు పోవడం లేదు. సిటీకి రావాలంటే కష్టంగా మారడం వల్లనే ఈ ప్రాంతంలో కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. . కొత్త సంవత్సరం తొలి రోజు హైదరాబాద్ వాసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. మెట్రో రైలును మేడ్చల్ వరకూ పొడిగించాలని నిర్ణయించారు.ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ కారిడార్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని ఆదేశించారు. డీపీఆర్ ను వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆమోదం పొందేందుకు ప్రయత్నిస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ, షామీర్ పేట్ నుంచి జేబీఎస్ వరకూ వెంటనే రెండు కారిడార్లకు సంబంధించిన డీపీఆర్ లను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో నార్త్ హైదరాబాద్ లో ఉంటున్న వారికి నిజంగా ఇది అమలయ్యేతే కొత్త సంవత్సరం వేళ శుభవార్తే అవుతుంది.. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేయాలంటే సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు ముందుకు రావాలి. అయితే ఇక్కడ నివాసం ఉండి మాదాపూర్, గచ్చిబౌలికి రావాలంటే గంటల తరబడి ప్రయాణం తప్పదు. రోడ్డు మార్గంలో రావాలంటే ట్రాఫిక్ చిక్కుల్లో పడక తప్పదు. అంత దూరంలో ఉండి గంటల తరబడి ఇళ్లకు చేరుకోవడం సాధ్యం కానిపని. కార్యాలయాలన్నీ ఇటు వైపు ఉండగా నగర శివార్లలో ఉత్తరం వైపు ఉన్న ఆ ప్రాంతం వైపు ఉన్న ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనపర్చడం లేదు. అయినా ఇప్పటికే కొంపల్లి నుంచి హైవే ఉన్నందున కొంత మేర అక్కడ అభివృద్ధి ప్రారంభమయింది. చాలా డెవలెప్ అయింది. అనేక నిర్మాణాలు వెలిశాయి. కార్పొరేట్ సంస్థలు కూడా అక్కడ ఏర్పాటయ్యాయి. ఇక మెట్రో రైలు కూడా ఏర్పాటయితే ఇక అక్కడ



భూముల ధరలు కొనలేని పరిస్థితి ఉంటుంది.... ఎప్పటి నుంచో మేడ్చల్ వైపు కనీసం కొంపల్లి వరకూ అయినా మెట్రో రైలును విస్తరించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వం ఇటువైపు చూపిన శ్రద్ధ అటు వైపు పెట్టలేదన్న ఆగ్రహంతో ఉన్నారు. అయినా గత ఎన్నికల్లో మేడ్చల్ ఇతర ప్రాంతాల్లో తిరిగి బీఆర్ఎస్ పార్టీనే గెలిపించారు. అయితే రేవంత్ రెడ్డి కొత్త ఏడాది తీసుకున్న నిర్ణయంతో తమ ట్రాఫిక్ కష్టాలు తీరతాయని భావిస్తున్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఖుషీ కబురు అందినట్లే ఫీలవుతున్నారు. మెట్రో రైలు ఏర్పాటయితే నగరం నడిబొడ్డుకు రాకపోకలు సాగించేందుకు సులువవుతుందని ఇక అమ్మకాలు ఊపందుకున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

శామీర్ పేటకు మెట్రో

మీర్ పేట్, మేడ్చల్ వరకు మెట్రో మార్గాలను పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. జేబీఎస్ నుండి శామీర్ పెట్ వరకు గల 22 కిలోమీటర్లు, ప్యారడైజ్ నుండి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్ల మెట్రో మార్గానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మెట్రో రైల్ ఫేజ్ ? 2 బి భాగంగా డీపీఆర్ తయారు చేయాలని సీఎం మెట్రో అధికారులకు ఆదేశాలిచ్చారు. సీఎం తీసుకున్న నిర్ణయం పై మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.ఇప్పటికే హైదరాబాద్ నగరంలో రెండవ దశ మెట్రో రైల్ మార్గాలను నిర్మించేందుకు మెట్రో సిద్ధమైంది. ఈ దశలో మేడ్చల్ వరకు కూడా మెట్రో మార్గాన్ని పెంచాలని సీఎం నిర్ణయం తీసుకోవడం పట్ల నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఏడాది నుంచి ఇదిగో... అదిగో....
# రేషన్ కార్డులు ఎప్పుడు

అదిలాబాద్, జనవరి 2, ( రేషన్ కార్డుల జారీపై తెలంగాణలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే కొత్త కార్డుల జారీ పలుమార్లు వాయిదా పడటంతో ఆశావహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో రేషన్ కార్డుల జారీపై ప్రకటనలు జారీ చేస్తూ వాయిదా వేస్తూ కేవలం రెండుసార్లు మాత్రమే స్వల్ప సంఖ్యలో రేషన్ కార్డులు అందించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2016 నుంచి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం 2019లో కొన్ని కార్డులు అందించి ఆ వెబ్‌సైట్ మూసివేసింది.ఇదే తీరున కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సంక్రాంతి పండుగ సైతం రేషన్ కార్డులు అందజేయకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్ర ప్రభావం చూపుతోందనే వాదనలు ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు ప్రకారం జిల్లాలోని సివిల్ సప్లై శాఖ కొత్త రేషన్ కార్డులు జారీకి సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల నుండి అధికారులు అర్హుల జాబితాలను పరిశీలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల ప్రకారం గా అర్హుల ఎంపికను చేపడుతోంది. కొత్త నిబంధనలు దేశంలోని పలు రాష్ట్రాల్లో గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేరళ,, మహారాష్ట్ర, పంజాబ్ లలో ఏ విధంగా లబ్ధిదారులను ఎంపిక చేశారో అదే రీతిన మన తెలంగాణ ప్రభుత్వం సైతం నిబంధనల మార్పులు చేసినట్టు తెలుస్తుంది.ప్రజా సంక్షేమలో భాగంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుంది, ప్రభుత్వం నుంచి పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కనీస అర్హత రేషన్ కార్డు ఆధార్ కార్డు కలిగి ఉండాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో కొత్త రేషన్ కార్డులు లేకపోవడంతో అర్హులైన వారికి కూడా అనర్హతకు గురవుతున్నారు.రేషన్ కార్డులో గల్లంతయిన పేర్లు, కొత్తగా జన్మించిన పేర్లు, పెళ్లి చేసుకున్న వారి పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అయితే ఇటీవల ప్రజా పాలనలో భాగంగా



సంక్షేమ పథకాలు లబ్ధి కోసం..రేషన్ కార్డుల దరఖాస్తుల కూడా స్వీకరించారు. ఇప్పటివరకు రేషన్ కార్డులు జారీ చేయలేదు.ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభల్లో సమావేశాలు సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనట్లు మంత్రి ఉత్తరం కుమార్ రెడ్డి ప్రకటించారు. దీంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి, కానీ కార్డుల జారిపై మారదర్శకాలు నిబంధనలపై స్పష్టత ఇవ్వలేదని పాత దరఖాస్తులు పరిగణలోకి తీసుకుంటారా? ప్రజాపాలనలో తీసుకున్న సమీకృత దరఖాస్తుల ఆధారంగా కార్డులు జారి చేస్తారా అనే సందేహం నెలకొంది.మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా అధికారులకు కసరత్తు చేస్తున్నారు, సర్పంచుల పదవీకాలం ముగిసి 11నెలలు కాకావస్తోంది, మరో నెల రోజులైతే పుర సంఘాల ఎన్నికలు రానున్నాయి. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు సన్నాఫ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల జాబితాను కూడా విడుదల చేశారు. నోడల్ అధికారులు సైతం నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రకటిస్తే తెల్ల రేషన్ కార్డులు సన్న బియ్యం పంపిణీకి బ్రేకులు పడ్డ ట్లేననే సందేహాలు ప్రజల్లో ఉన్నాయి.

# ఇతిహాస్ రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ



రంగారెడ్డి జనవరి 2 వినియోగదారుల మనసును చూరగొన్నప్పుడే ఏ వ్యాపారమైన విజయవంతమవుతుందని పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు కెపిహెచ్బి కాలనీ మలేషియా టౌన్షిప్ సర్కిల్ లోని వాసవి సిగ్నేచర్ బిల్డింగ్ లో నూతనంగా అత్యాధునికంగా నిర్మించిన ఇతిహాస్ రెస్టారెంట్, బ్యాంకెట్ హాల్స్ ప్రారంభోత్సవానికి ఇరువురు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకులు కరుణ్ జాస్తి ని అభినందించారు. వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. శాసనసభ్యుడు కృష్ణారావు రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు నిర్వాహకుడు కరుణ్ మాట్లాడుతూ ఈ బిజినెస్ లో తాము 47 ఏళ్లు గా ఉన్నామని వినియోగదారుల అభిరుచి మేరకు వ్యవహరిస్తామన్నారు భవిష్యత్తులో మరిన్ని ఫ్రాంచైజీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

భారత శక్తి



# జగిత్యాల నుంచే కవిత పోటీ...?



కరీంనగర్, జనవరి 2, ఢిల్లి లిక్కర్ స్కాం లో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొన్నాళ్ళ మౌనం తరువాత ఇప్పుడు యాక్టివ్ అయిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే శాసనమండలి సమావేశాల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదేసే ప్రయత్నం చేశారు. నిజామాబాద్ ఎంపీగా ఒక్కసారి గెలిచి, రెండు సార్లు ఓడిపోయిన కవిత తండ్రి ఆశీస్సులతో ప్రస్తుతం శాసనమండలి సభ్యురాలిగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమె అసెంబ్లీకి పోటీ చేస్తానంటున్నారంట.

బెయిల్ వచ్చాక ఇన్ని రోజులు మౌనమే అన్నింటికి సమాధానం అన్నట్లు వ్యవహరించిన కవిత ఇప్పుడు తనకి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన బతుకమ్మనే మరో సారి నమ్ముకొని మరోసారి తెలంగాణ సెంటిమెంట్ ని రగిల్చే పనిలో పడినట్లు కనిపిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లికి సంప్రదాయ రూపమిచ్చి.. సెక్రటేరియట్‌లో అధికారికంగా ప్రతిష్టించింది. అయితే తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మ లేదని బీఆర్ఎస్ రచ్చ చేస్తుంది. తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు కవిత ఏ సెంటిమెంట్‌ని తన అస్త్రంగా రాజకీయాలకి వాడుకున్నారో.. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ని మరోసారి రగిలించే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ప్రభుత్వం ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని.. కాంగ్రెస్ తల్లి అంటూ నిరసనలు తెలుపుతూ? బతుకమ్మ లేని తెలంగాణ తల్లి ని ఒప్పుకోమని జగిత్యాల లో 20 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకి భూమిపూజ చేసారు. యితే జగిత్యాలలోనే ఆమె తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వెనుక ప్రత్యేక కారణాలు ఉన్నాయని బీఆర్ఎస్ శ్రేణులు, జాగృతి శ్రేణులు భావిస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కవిత జగిత్యాల నుండి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతుంది.ఇంకా ఎన్నికలకు నాలుగేళ్ల సమయం ఉండడంతో ఇప్పటి నుండే జగిత్యాల నియోజకవర్గం లో గ్రౌండ్ వర్క్ చేసుకుని జైత్రయాత్రకి సిద్ధమవ్వాలని భావిస్తున్నారంట. అందుకే తరుచుగా జగిత్యాల బీఆర్ఎస్ లీడర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని ఫిక్స్ అయ్యారంట. అందుకే మరోసారి తెలంగాణ సెంటిమెంట్ , తెలంగాణ తల్లి సెంటిమెంట్ ని రగిల్చేందుకు బతుకమ్మ తో కూడిన తెలంగాణ తల్లి ఏర్పాటుకు జగిత్యాలలోనే భూమిపూజ చేసారంట. అయితే ఆమె జగిత్యాలలో అంత యాక్టివ్ అయి. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం వెనుక మరో కారణం ఉందని బీఅర్ఎస్ శ్రేణులు అంటున్నాయి.గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో జగిత్యాలలో అన్ని తానై తన అనుంగు అనుచరుడిగా పేరున్న సంజీవ్‌కుమార్‌ను కవిత గెలిపించుకున్నారు. ఆయన కాంగ్రెస్ లో చేరడాన్ని కవిత జీర్ణించుకోలేక పోతున్నారట. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని టార్గెట్ చేసి ఆయనకు కవిత చెక్ పెట్టగలిగారు. జగిత్యాలలో కంటి వైద్యుడిగా మంచి పేరున్న డాక్టర్ సంజయ్ కుమార్‌ను బీఅర్ఎస్ అభ్యర్థిగా నిలబెట్టి అసెంబ్లీ ఎన్నికలలో ప్రచారం చేసి జీవన్‌రెడ్డిని ఓడిస్తానన్న ఛాలెంజ్‌ను నిలబెట్టుకున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల తరువాత ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. బీఅర్ఎస్ అధికారం కోల్పోవడంతో పాటుగా లిక్కర్ స్కాంలో కవిత అయిదునెలలు పైగా తీహార్ జైలుకు వెళ్లడంతో జగిత్యాల జిల్లా బీఅర్ఎస్ క్యాడర్ పూర్తిగా నైరాశ్యంలో మునిగిపోయింది. ఇటు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరిపోయారు. సంజయ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని బీఅర్ఎస్ క్యాడర్ ముఖ్యంగా కేటీఆర్, కవితలకు అస్సలు మింగుడు పడటం లేదంట.తనకి అనుంగ అనుచరుడుగా ఉన్న వెలమ సామాజిక వర్గానికి చెందిన సంజయ్‌కుమార్ కాంగ్రెస్ లో చేరడంతో ఆయన గెలుపు కోసం తాను పట్ట కష్టమంతా వృధా అయిందని కవిత ఫీలవుతున్నారంట. అందుకే జగిత్యాల నుండి తానే స్వయంగా బరిలోకి దిగి సంజయ్‌కుమార్‌ని ఓడించి జగిత్యాల గులాబీ పార్టీకి కంచుకోట అని నిరూపించాలని కంకణం కట్టుకున్నారంట. అందులో భాగంగా రానున్న రోజుల్లో జగిత్యాలలోనే మకాం వేసి కార్యక్రమాలు నిర్వహించేలా ప్లాన్ చేసుకుంటున్నారంట. మరి చూడాలి బెయిల్‌పై బయట తిరుగుతున్న కవిత ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో?

## ఎట్టకేలకు బోనులో పెద్ద పులి

చంద్రాపూర్‌జనవరి 2 గత కొద్ది నెలలుగా తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పులిని ఎట్టకేలకు చంద్రపూర్ అటవీ అధికారులు బోనులో బంధించారు. గత కొద్ది నెలలుగా ఈ అటవీ ప్రాంతాల్లోని తిరుగుతున్న పెద్దపులి ? ఈ రహదారి వెంటనే రెగ్యులర్గా తిరుగుతుండడంతో వేటగాళ్ల దృష్టి పడే ప్రమాదము ఉండడంతో చాకచక్యంగా వ్యవహరించి దాదాపు వారం రోజులుగా శ్రమించి పులిని ఎట్టకేలకు బోను లో బంధించి చంద్రాపూర్ తరలించారు? సిర్పూర్ టి మండలంలోని మాకిడికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరం నుండి అంతర్గాం అటవీ ప్రాంతంలో పులిని బోలో బంధించారు.. తాడోబా ఫారెస్ట్ చంద్రపూర్ కు తరలించారు. మత్తు మందు బంధించిన పులికి అవసరమైన వైద్యం అందించిన తర్వాత తడోబా పులుల సంరక్షణ కేంద్రంలో వదిలిపెట్టనున్నట్లు సమాచారం.

## విద్యుత్ తీగలు తెగిపడి బస్సు దగ్ధం

అనంతపురం జనవరి 2 అనంతపురం నగరంలో దివాకర్ బస్సుల ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ వద్ద 11 కేవీ విద్యుత్తు తీగలు ప్రమాదవశాత్తు తెగిపోయి బస్సు మీద పడడంతో బస్సు పూర్తిగా కాలిపోయింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల భయభ్రాంతులకు గురయ్యారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకున్నారు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకోవడంతో నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

## గంజాయి బ్యాచ్ బీభత్సం.. ఏకంగా పోలీసులపైకే కారు ఎక్కించిన వైనం

కాకినాడజనవరి 2 కాకినాడ జిల్లా కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద గంజాయి బ్యాచ్ బీభత్సం సృష్టించింది. అక్కడ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో కొందరు కారులో గంజాయి తరలిస్తున్నారు. కారు ఆపేందుకు

ప్రయత్నించగా.. కానిస్టేబుళ్లపైకి కానును ఎక్కించారు. ఈ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు.

## మాంజా కోసుకోవడంతో వ్యక్తి మెడకు తీవ్ర గాయాలు

భద్రాద్రి కొత్తగూడెం జనవరి 2చంద్రుగొండ మండలం గుర్రాయి గూడెం గ్రామానికి చెందిన ఏరువా కృష్ణారావు భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణంలో ఉన్న హెరిటేజ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

ఈ క్రమంలో విధులు ముగించుకుని తిరిగి బైక్ పై ఇంటికి వెళుతుండగా రామవరం సమీపంలో కొందరు వ్యక్తులు జాతీయ రహదారిపై గాలి పటం ఎగరవేయడం ఆ దారం గొంతుకు తగిలి కోసుకు పోయింది. మెడకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు గుర్తించి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

## స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడుతో కూడిన అగ్ని ప్రమాదం,6 మందికి గాయాలు..

పెన్నేపల్లి జనవరి 2 పెళ్లకూరు మండలం పెన్నేపల్లిలో ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బుధవారం రాత్రి 10 గంటల 15 నిమిషాలకు భారీ పేలుడు సంబవించింది.భారీ శబ్దం తో కూడిన పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గుర్తై ఇంటి నుండి బయటకు పరుగులు తీశారు. ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బాయిలర్ అగ్ని ప్రమాదానికి గురవడంతో జరిగిన పేలుడు సంఘటనతో పెన్నేపల్లి గ్రామ ప్రజలు బిక్కు, బిక్కు మంటూ భయాందోళనలో ఉన్నారు.ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న ఆందోళన వారిని భయపెడుతుంది.పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమలోని పలువురికి గాయాలు అయినట్లు తెలిసింది. నెల్లూరు మరియు నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రులకు క్షతగాత్రులను తరలించడం జరిగింది,

## స్టీల్ ఫ్యాక్టరీ అగ్నిప్రమాదంపై గ్రామస్థుల మండిపాటు

తిరుపతి జనవరి 2పన్నేపల్లి ఐరన్ స్టీల్ ఫ్యాక్టరీ అగ్నిప్రమాదంపై గ్రామస్తులు భగ్గుమంటున్నారు.ఫ్యాక్టరీ రసాయనాల కాలుష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇష్టానుసారంగా ఫ్యాక్టరీని విస్తరించి గ్రామం పై బూడిదకుమ్మరిస్తున్నారు. ఫ్యాక్టరీ కాలుష్యంపై ఎంతమందికి వినతులు సమర్పించినా ప్రయోజనం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడల్లా యాజమాన్యం గోప్యంగా ఉంచుతోంది. గత రాత్రి ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం భూకంపాన్నితలపించింది. వచ్చుటి గ్రామంలో నిప్పులు వెదజల్లుతోంది. ఎమ్మెస్ అగర్వాల్ స్టిల్ ఫ్యాక్టరీ తో గ్రామానికి, పొలాలకు ముప్పు వాటిల్లుతుందని గ్రామస్తులు - తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో నీరు లీకేజీ

శ్రీశైలం జనవరి 2శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రానికి పొంచిఉన్న ప్రమాదంపై యంత్రాంగం అప్రమత్తమయింది. కొద్ది రోజులుగా జీరో ఫ్లోర్ లో నీటి లీకేజీ ప్రారంభమయింది. డ్రాఫ్ట్ ట్యూబ్ చుట్టూ లీక్ నీరు అవుతోంది. ప్లాంట్ అధికారుల సమన్వయ లోపంతో పర్యవేక్షణ కొరవడిందని మీడియాలో వార్తలు వచ్చాయి.

## తెలంగాణ హైకోర్టులో పూర్తిస్థాయి జడ్జీలు వుండాలి

హైదరాబాద్ జనవరి 2, నేటికి సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం లోక్ సభ లో వేసిన ప్రశ్నోత్తరాల సమయం లో హైకోర్టు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపాను. 2019 డిసెంబర్ 31 నాడు తెలంగాణ కు ప్రత్యేక హై కోర్టు వచ్చింది. తెలంగాణ హై కోర్టు కు 42 మంది జడ్జిలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా ఎపుడూ 23 మంది కి మించి భర్తీ చేయడం లేదని మాజీ ఎంపి బి వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ జడ్జీల్లో ఎస్సీ ,ఎస్టీ లకు సంబంధించిన వారు ఎవ్వరూ లేరు. పూర్తి స్థాయిలో జడ్జీలను నియమిస్తే దళిత గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుంది. కేసీఆర్ హయం లోనే మేము పార్లమెంటు లో ఒత్తిడి చేసిన ఫలితంగా హై కోర్టు జడ్జీల సంఖ్యను 42 కు పెంచారు. .హై కోర్టు లో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి పెరిగి పోతోంది ..జడ్జీలు పూర్తి స్థాయిలో ఉంటె తప్ప కేసులు తొందరగా పరిష్కారం కావు. హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి లో జడ్జీల నియమాకానికి చర్యలు చేపట్టాలి. సామాజిక న్యాయం న్యాయ వ్యవస్థ లో కూడా పాటించాల్సిందే. వేరే రాష్ట్రాల నుంచి తెలంగాణ హై కోర్టులో నలుగురు జడ్జీలు ఉన్నారు. జడ్జీలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణ కు కూడా న్యాయం జరుగుతుంది. శామీర్ పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టు వేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జేబీఎస్ నుంచి శామీర్ పేట కు డబుల్ డెక్ ఫ్లై ఓవర్ ను ఏర్పాటు చేయాలని అన్నారు.

## స్టేడియంను నాశనం చేసారు

హైదరాబాద్ జనవరి 2, ఉప్పల్ జిహెచ్ఎంసి స్టేడియంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రైవేట్ పార్టీ దుమారం రేపుతోంది. ప్రభుత్వ స్థలంలో న్యూ ఇయర్ వేడుకల పేరుతో అన్ లిమిటెడ్ మద్యం సరఫరా చేసి యువతను పెడదారి పెట్టించడంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని నాశనం చేశారని చిలుకానగర్ కార్పొరేటర్ , జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ఆరోపించారు. త్రైవ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుక లలో విపరీతమైన మద్యం సరఫరా , అసభ్యకరమైన డ్యాన్సులతో హంగామా చేశారని అన్నారు. జిహెచ్ఎంసి స్థలంలో న్యూఇయర్ సెలబ్రేషన్స్ అనంతరం పగిలిన మద్యం సీసాలు , వ్యర్థ ఆహర పదార్థాలతో మున్సిపల్ గ్రౌండ్ మొత్తం భ్రష్టుపట్టించారని అందుకు బాధ్యులైన ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ తోపాటు ఇతర శాఖల అధికారుల , ఈవెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కార్పోరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ డిమాండ్ చేశారు.

## గేమ్ ఛేంజర్ ను భయపెట్టేసిన పుష్పరాజ్



హైదరాబాద్, జనవరి 2, గేమ్ చేంజర్' ని 'పుష్పరాజ్' భయపెట్టేశాడు. ఒక్క 'గేమ్ చేంజర్' అనే కాదు... తెలంగాణ రాష్ట్రంలో స్టార్ హీరోల సినిమాలకు సంబంధించి ఏ ఈవెంట్ జరగాలన్నా.. భయపడే పరిస్థితులని 'పుష్ప 2' సినిమా కల్పించింది. అది ఫస్ట్ ఫేస్ చేయబోతుంది మాత్రం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సినిమానే. అవును.. సంక్రాంతికి పెద్ద హీరోల సినిమాలు మూడు విడుదల కాబోతున్నాయి. వాటిలో రామ్ చరణ్ 'గేమ్ చేంజర్'తో పాటు బాలకృష్ణ 'డాకు మహారాజ్', వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలున్నాయి. వీటిలో భారీ బడ్జెట్ చిత్రమంటే 'గేమ్ చేంజర్' సినిమానే. ఈ సినిమాకు ప్రమోషనల్ ఈవెంట్స్ ఎంతో కీలకం కూడా. కానీ ఇటీవల జరిగిన సంధ్య థియేటర్ ఘటనతో తెలంగాణ వ్యాప్తంగా స్టార్ హీరోల సినిమాలపై ఆంక్షలు నెలకొన్నాయి. అందులోనూ 'గేమ్ చేంజర్' నిర్మాతకు తెలంగాణ ప్రభుత్వం పిలిచి మరీ ఎఫ్‌డిసి ఛైర్మన్ పదవి ఇవ్వడంతో... ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. దీంతో 'గేమ్ చేంజర్'కు భారీ ఈవెంట్స్ ఏమీ లేకుండానే.. సినిమా తెలంగాణలో విడుదల కానుంది.అయితే, మరీ ఈ రేంజ్‌లో భయపడుతున్నారా? అనే విధంగా ఇప్పుడు 'గేమ్ చేంజర్' పరిస్థితి మారిపోయింది. 'భయపడుతున్నారా?', 'భయపెడుతున్నారా?' అనే విషయం పక్కన పెడితే... ఆఖరికి 'గేమ్ చేంజర్' ట్రైలర్ విడుదల కార్యక్రమానికి కూడా ఆంక్షలు విధించడం చూస్తుంటే... తెలంగాణలో సినిమా పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అవును... 'గేమ్ చేంజర్' మూవీ ట్రైలర్‌ని హైదరాబాద్‌లోని ఏఎంబీ మాల్‌లోని స్క్రీన్‌లో విడుదల చేయనున్నారు. ఇంతకు ముందు స్టార్ హీరోల సినిమాల ట్రైలర్స్‌ని థియేటర్లలో విడుదల చేసే సమయంలో ఎటువంటి ఆంక్షలు లేవు. మీడియాతో పాటు, ఫ్యాన్స్ అందరూ థియేటర్లలోకి అనుమతి ఉండేది. కానీ 'గేమ్ చేంజర్' ట్రైలర్ ఈవెంట్‌కు మాత్రం టికెట్స్ పెట్టేశారు. టికెట్ ఉంటేనే థియేటర్ లోపలికి అనుమతి. ఆఖరికి మీడియా పర్సన్స్‌కి కూడా టికెట్ ఉండాల్సిందే అనేలా రూల్ పెట్టేశారు. అంటే, 'పుష్ప' ఘటన ఎంతగా భయపెట్టేసిందో అర్థం చేసుకోవచ్చు.టికెట్ ఉంటేనే థియేటర్‌లోనికి అనుమతి ఉంటుందని 'గేమ్ చేంజర్' పీఆర్ టీమ్ కూడా అధికారికంగా తెలియజేసింది. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సంఘటనతో ఏర్పడిన ఈ పరిస్థితిని అందరూ అర్థం చేసుకోవాలని, అందరూ టికెట్ తీసుకుని మాత్రమే లోపలికి వెళ్లాలంటూ స్పష్టమైన ప్రకటనను పీఆర్ టీమ్ విడుదల చేసింది. అయితే, కాస్త కఠినంగా ఉన్నా.. ఇది మంచి నిర్ణయమే అనేలా కూడా దీనిపై అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే, రామ్ చరణ్ నటించిన 'గేమ్ చేంజర్' సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి.మెగా ఫ్యాన్స్ ఈ వేడుకను గ్రాండ్ సక్సెస్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు. అంతే కాదు, ఈ ట్రైలర్ లాంచ్ తప్పితే, తెలంగాణలో 'గేమ్ చేంజర్'కు సంబంధించి మరే ఇతర వేడుక బహుశా ఉండకపోవచ్చు. చిత్ర ప్రీ రిలీజ్ వేడుకని ఏపీలో నిర్వహించేందుకు గ్రాండ్‌గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణలో జరిగే ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని మెగా ఫ్యాన్స్ ప్రెస్టీజీయస్‌గా తీసుకుని, భారీగా తరలి వస్తే మాత్రం మళ్లీ 'సంధ్య థియేటర్' వంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. అందుకే, తెలంగాణ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా.. ట్రైలర్ విడుదలకు కూడా ఆంక్షలు విధించి ఉండవచ్చంటూ.. సినీ పెద్దలు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ నిర్ణయం మాత్రం మెగా ఫ్యాన్స్‌ని డిజప్పాయింట్ చేస్తుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

రంగారెడ్డి జనవరి 2,2025 కొత్త సంవత్సర వేడుకలు రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా జరిగాయి. ఈరోజు ఉదయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కేక్ కట్ చేశారు. సిబ్బంది అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరి కృషితో డిసెంబర్ లో నిర్వహించిన విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించగలిగామని ఆయనన్నారు. భవిష్యత్తులోనూ విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి అందరూ పునరంకితం అవ్వాలని జానయ్య పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల నాలుగునుంచి ఇంద్రజాల్ మెగా మ్యాజిక్ షో

సికింద్రాబాద్ ప్రపంచ ప్రఖ్యాత మెజిషియన్ పి సి సర్కార్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ హరిహర కళాభవన్ లో ఇంద్రజాల్ మెగా మ్యాజిక్ షోను నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 4న మెగా మ్యాజిక్ షోను హరిహర కళాభవన్ వేదికగా ప్రారంభించనున్నట్లు ప్రముఖ మెజీషియన్ పోరుష్ పేర్కొన్నారు. జనవరి 4 నుండి 19 వరకు శని ఆదివారాలలో సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రదర్శనలు జరగనున్నట్లు వెల్లడించారు. పీవీ సర్కార్ గొప్ప కళ్ళతో అంతర్జాతీయ స్థాయిలో మెజీషియన్ గా కీర్తి ప్రతిష్టలు పొందారని ఆయన బాటలోనే తాను కూడా నడుస్తున్నట్లు పోరుష్ తెలిపారు. నూతన వైవిధ్యభరితమైన మ్యాజిక్ షోలతో ప్రజలను ఆకట్టుకోవడమే లక్ష్యంగా పీవీ సర్కారు కుటుంబం వినోదాన్ని పంచుతున్నట్లు తెలిపారు. పోరుష్ చిన్న వయసులోనే సరికొత్త మ్యాజిక్ షో లతో ప్రజలకు చేరువయ్యారని అన్నారు.

## ప్రతి నెల శ్రవణా నక్షత్రం సంధర్భంగా శ్రీ దేవీ భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామీ కళ్యాణం

చాగలమర్రి జనవరి 2, నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డ నియోజకవర్గం చాగలమర్రి మండలం ముదురాళ్ళపల్లే గ్రామంలో పూజారులు కళ్యాణ్ శర్మ , శివ శంకర్ శర్మ వేదమంత్రాలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.ప్రతి నెల శ్రవణా నక్షత్రం సంధర్భంగా ఆలయములో కల్యాణం జరుగుతుందని తెలిపారు. కళ్యాణం అనంతరం దేవాలయము చుట్టూ పల్లకి సేవా కార్యక్రమం నిర్వహించారు.భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు పులి చిన్న ఓబుల్ రెడ్డి ధర్మపత్ని పద్మావతి , ఉభయదాతలు పులి చంద్ర ఓబుల్ రెడ్డి ధర్మపత్ని మీనాక్షి దేవి కుమార్తె దీక్షా రెడ్డి , కుమారుడు ధీరజ్ రెడ్డి కుటుంబ సభ్యులు , గ్రామ భక్తులు , మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ స్టేడియంలో ప్రైవేటు ఈవెంట్లు బంద్

హైదరాబాద్ జనవరి 2, ఉప్పల్ జిహెచ్ఎంసి స్టేడియంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రైవేట్ పార్టీ దుమారం రేపుతోంది. ఈ సంఘటనపై జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు స్పందించారు. న్యూఇయర్ సెలబ్రేషన్స్ అనంతరం పగిలిన మద్యం సీసాలు , వ్యర్థ ఆహర పదార్థాలతో మున్సిపల్ గ్రౌండ్ మొత్తం భ్రష్టుపట్టించారని అందుకు బాధ్యులైన త్రైవ్ ఈవెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఇకనుండి ఎటువంటి ప్రవేట్ ఈవెంట్లకు పర్మిషన్ ఇవ్వమని డిసి తెలిపారు

# బటన్ నొక్కుడెప్పుడు

## వివిధ వర్గాల నుంచి ప్రశ్నలు

విజయవాడ, జనవరి 2, గత ప్రభుత్వంలో అలవాటయిన బటన్ నొక్కే కార్యక్రమం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లేదు. 2019 నుంచి 2024 వరకూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ చంద్రబాబు ప్రాధాన్యతలు వేరు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందచేయాలనుకుంటున్నారు తప్పించి నేరుగా డబ్బులు వారి ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పెద్దగా సుముఖత చూపరు. అందుకే గత ఏడు నెలల నుంచి బటన్ నొక్కడం అనేది లేదు. జనాల ఖాతాల్లో కూడా నగదు కనపడటం లేదు. కేవలం పింఛనుదారులకు మినహా ఇప్పటి వరకూ ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించింది లేదనే చెప్పాలి. అందుకు రాష్ట్ర ఖజానా కూడా ఒక కారణమని అధికార పార్టీ చెబుతుందిగత ప్రభుత్వంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు నెలలో ఒకటి రెండు సార్లు ఎవరో ఒకరికి బటన్ నొక్కి నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. వారికి ఆర్థికంగా ఇవి ఉపయోగపడేవి. అమ్మఒడి, వసతి దీవెన, చిరు వ్యాపారులు, చేనేతలు, మత్స్యకారులు ఇలా అన్ని సామాజికవర్గాల వారికి కూడా క్యాలెండర్ ను రూపొందించుకుని మరీ నగదును జమ చేసేవారు. తమకు ఈ డబ్బులు గ్యారంటీగా వస్తాయని భావించేవారు. సంక్రాంతి పండగను హుషారుగా ఆనందంగా జరుపుకునే వారు. కానీ గడిచిన ఏడు నెలల నుంచి రూపాయి కూడా బ్యాంకు అకౌంట్ లో పడకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నారన్నది వాస్తవం. బ్యాంకు ఖాతాల్లో నగదు లేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు... గత ప్రభుత్వం అప్పులు చేసి వెళ్లిందని, ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ దానిని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే తమకు అవన్నీ అనవసరం. తమకు అవసరమైనది నగదు. అది అందనప్పుడు అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రకటనలు తమకు కూడు బెడతాయా? ని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరుగా ఉండటంతోనే ప్రజలకు తొలి రెండు నెలల్లోనే అర్థమయింది. చంద్రబాబు అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయారిటీ ఇస్తారు. ఆ రెండు దీర్ఘకాలంలో సంపదను సృష్టిస్తాయని ఆయన బలంగా నమ్ముతున్నారు. అప్పుడు ఆర్థికంగా పేదలు బలపడతారని భావిస్తున్నారు. కానీ జనం మాత్రం అలా అనుకోవడం లేదు. తమకు ఎలాంటి నగదు ఇవ్వకపోవడమేంటని కొందరు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను నిలదీసే పరిస్థితికి గ్రామాల్లో వచ్చిందని అంటున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఎమ్మెల్యే అయితే గ్రామస్తులకు నచ్చచెప్పలేక వెనుదిరిగారు. ప్రభుత్వం పాలసీ ప్రకారం వెళుతుంది. రహదారులు బాగాలేకున్నా, రాష్ట్రానికి రాజధానికి లేకున్నా వారికి ఫరక్ పడదు. తమకు అలవాటుగా మారిన నగదు బ్యాంకు ఖాతాల్లో కనిపించకపోయే సరికి ఆ ఫ్రస్టేషన్ ను ప్రజా ప్రతినిధులపై చూపిస్తున్నారంటున్నారు. అయితే ఏడు నెలలే అయినందున ప్రభుత్వం తన ప్రాధాన్యతలను అమలు చేస్తుందని, గతంలో జగన్ కూడా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల తర్వాతనే పథకాలు అమలు చేశారని, తాము కూడా అంతేనని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కూటమి పార్టీ పాలనపై మాత్రం తమకు నగదు బదిలీ చేయడం లేదన్న అసంతృప్తి మాత్రం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు,గత ప్రభుత్వంలో అలవాటయిన బటన్ నొక్కే కార్యక్రమం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లేదు. 2019 నుంచి 2024 వరకూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ చంద్రబాబు ప్రాధాన్యతలు వేరు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందచేయాలనుకుంటున్నారు తప్పించి నేరుగా డబ్బులు వారి ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పెద్దగా సుముఖత చూపరు. అందుకే గత ఏడు నెలల నుంచి బటన్ నొక్కడం అనేది లేదు. జనాల ఖాతాల్లో కూడా నగదు కనపడటం లేదు. కేవలం పింఛనుదారులకు మినహా ఇప్పటి వరకూ ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించింది లేదనే చెప్పాలి. అందుకు రాష్ట్ర ఖజానా కూడా ఒక కారణమని అధికార పార్టీ చెబుతుంది. గతంలో అలవాటయి... గత ప్రభుత్వంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు నెలలో ఒకటి రెండు సార్లు ఎవరో ఒకరికి బటన్ నొక్కి నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. వారికి ఆర్థికంగా ఇవి ఉపయోగపడేవి. అమ్మఒడి, వసతి దీవెన, చిరు వ్యాపారులు, చేనేతలు, మత్స్యకారులు ఇలా అన్ని సామాజికవర్గాల వారికి కూడా క్యాలెండర్ ను రూపొందించుకుని మరీ నగదును జమ చేసేవారు. తమకు ఈ డబ్బులు గ్యారంటీగా వస్తాయని భావించేవారు. సంక్రాంతి పండగను హుషారుగా ఆనందంగా జరుపుకునే వారు. కానీ గడిచిన ఏడు నెలల నుంచి రూపాయి కూడా బ్యాంకు అకౌంట్ లో పడకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నారన్నది వాస్తవం. బ్యాంకు ఖాతాల్లో నగదు లేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందన్నా... గత ప్రభుత్వం అప్పులు చేసి వెళ్లిందని, ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ దానిని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే తమకు అవన్నీ అనవసరం. తమకు అవసరమైనది నగదు. అది అందనప్పుడు అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రకటనలు తమకు కూడు బెడతాయా? ని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరుగా ఉండటంతోనే ప్రజలకు తొలి రెండు నెలల్లోనే అర్థమయింది. చంద్రబాబు అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయారిటీ ఇస్తారు. ఆ రెండు దీర్ఘకాలంలో సంపదను సృష్టిస్తాయని ఆయన బలంగా నమ్ముతున్నారు. అప్పుడు ఆర్థికంగా పేదలు బలపడతారని భావిస్తున్నారు. గ్రామాల్లో నిలదీత మొదలు... కానీ జనం మాత్రం అలా అనుకోవడం లేదు. తమకు ఎలాంటి నగదు ఇవ్వకపోవడమేంటని కొందరు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను నిలదీసే పరిస్థితికి గ్రామాల్లో వచ్చిందని అంటున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఎమ్మెల్యే అయితే గ్రామస్తులకు నచ్చచెప్పలేక వెనుదిరిగారు. ప్రభుత్వం పాలసీ ప్రకారం వెళుతుంది. రహదారులు బాగాలేకున్నా, రాష్ట్రానికి రాజధానికి లేకున్నా వారికి ఫరక్ పడదు. తమకు అలవాటుగా మారిన నగదు బ్యాంకు ఖాతాల్లో కనిపించకపోయే సరికి ఆ ఫ్రస్టేషన్ ను ప్రజా ప్రతినిధులపై చూపిస్తున్నారంటున్నారు. అయితే ఏడు నెలలే అయినందున ప్రభుత్వం తన ప్రాధాన్యతలను అమలు చేస్తుందని, గతంలో జగన్ కూడా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల తర్వాతనే పథకాలు అమలు చేశారని, తాము కూడా అంతేనని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కూటమి పార్టీ పాలనపై మాత్రం తమకు నగదు బదిలీ చేయడం లేదన్న అసంతృప్తి మాత్రం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు.

# కల్లు, గీత కార్మికులకు 340 షాపులు



ఒంగోలు, జనవరి 2 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏపీలో గీత కులాలకు మద్యం దుకాణాలను కేటాయించేందుకు రంగం సిద్ధమైంది. మద్యం దుకాణాల కేటాయింపులో గీత కులాలకు ఇస్తామన్న హామీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మద్యం షాపుల్లో గీత కులాలకు 10 శాతం షాపులు కేటాయించాలని, ఇందుకు సంబంధించి వారం రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.రాష్ట్రంలో మొత్తం 3,396 మద్యం షాపులు ఉండగా ఇందులో 10 శాతం అంటే 340 షాపులు గీత కులాలకు ఇవ్వనున్నారు. గౌడ, శెట్టి బలిజ, ఈడిగ, గామల్ల, కలాలీ, శ్రీసాయన, శెగిడి, గౌండ్ల, బలిజ, యాత, సోంది వంటి కులాలకు 10 శాతం రిజర్వేషన్ కింద షాపులు కేటాయిస్తారు. షాపులను అక్కడ ఉన్న ఆయా కులాల సంఖ్య ఆధారంగా వారికి కేటాయిస్తారు.ఒక్కొక్కరు ఎన్ని షాపుల కోసం అయినా ఫీజు చెల్లించి ధరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఒక వ్యక్తికి ఒకటే షాపు కేటాయిస్తారు. ఈ షాపుల కాలపరిమితి 2026 సెప్టెంబర్ 30 వరకు ఉంటుంది. దీనిపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసిన అధికారులు... ఆ వివరాలను సిఎం ముందు ఉంచారు. అన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి నోటిఫికేష్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారుమద్యం రిటైల్ షాపులకు ఇచ్చే మార్జిన్ ను కూడా పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు మద్యం షాపులకు 10.5 శాతం మార్జిన్ ఇస్తున్నారు. దీని వల్ల తాము నష్టపోతున్నామని, మార్జిన్ పెంచాలని యజమానులు కోరుతున్నారు. ఈ విషయంలో వాస్తవ పరిస్థితులను పరిశీలించిన ప్రభుత్వం మార్జిన్ ను తెలంగాణలో ఇచ్చినట్లు ఇక్కడ కూడా 14 శాతం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది.మరోవైపు రూ. 99కి మద్యం అందుబాటులోకి తేవడం, 21 శాతం అమ్మకాలు వీటిపైనే సాగుతున్నాయని... దీని వల్ల అనుకున్న స్థాయిలో ఆదాయం రావడం లేదని అధికారులు వివరించారు. రాష్ట్రంలో 72 శాతం అమ్మకాలు జరిగే 20 మద్యం బ్రాండ్ల రేట్లను తెలంగాణతో పోల్చినప్పుడు ఒక్క బ్రాండ్ తప్ప 19 బ్రాండ్ల మద్యం ఎపిలోనే తక్కువ రేటు ఉందని అధికారులు వివరించారు. ప్రతి సంవత్సరం మద్యం అమ్మకాలు పెరుగుతాయని... అయితే తక్కువ రేట్లకే మద్యం అమ్మకం వల్ల ప్రభుత్వానికి ఆశించిన స్థాయి ఆదాయం లభించడం లేదని అధికారులు తెలిపారు.ఆదాయం తగ్గినా తక్కువ రేటుకే మద్యం అన్ని చోట్లా అందుబాటులో ఉండేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్రంలో బెల్ట్ షాపుల విషయంలో కఠినంగా ఉండాలని సిఎం సూచించారు. మద్యం తయారీ, సరఫరా, సేల్స్ ను టెక్నాలజీ సాయంతో పర్యవేక్షించి... నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలని సిఎం ఆదేశించారు.హోలోగ్రామ్ ద్వారా ఎక్కడ తయారైన మద్యాన్ని ఎక్కడ అమ్ముతున్నారు అనేది కూడా తెలుసుకోవాలని.... స్టాక్ వివరాలను తెలుసుకుని తప్పు జరిగితే చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఆదాయం కోల్పోయినా పర్వాలేదని ప్రజలకు మంచి జరగాలి అని ఈ మద్యం విధానం తీసుకువచ్చామని . దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాల మద్యం, నకిలీ మద్యం రాకుండా చూడాల్సిన అవసరం ఉందని సిఎం ఆదేశించారు.ఈ 6 నెలల్లో బెల్ట్ షాపుల మీద 8,842 కేసులు బుక్ చేశామని.... 26 వేల లీటర్లు సీజ్ చేశామని అధికారులు చెప్పగా.... బెల్ట్ షాపుల విషయంలో ఉపేక్షించవద్దని.... వారికి మద్యం అమ్మిన షాపుల పైనా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. మద్యం అక్రమ తయారీని అరికట్టేందుకు, బెల్ట్ షాపులు నియంత్రణకు, మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు నవోదయం 2.0 పేరుతో జనవరి నుంచి ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి చర్యల ద్వారా వారి జీవితాల్లో మార్పులు తెచ్చే విధంగా కార్యక్రమాలు చేపట్టనన్నట్లు అధికారులు తెలిపారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన సమీక్షకు మంత్రి కొల్లు రవీంద్ర, ఆబ్కారీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో వైరల్ అవుతున్న సోషల్ మీడియా క్యాంపెయిన్స్

గుంటూరు, జనవరి2, సోషల్ మీడియాపై ఏపీ సర్కార్ నయా ప్రచారాన్ని ప్రారంభించింది. సోషల్ మీడియాను మంచికి వాడుదామంటూ భారీ హోర్డింగ్‌లతో ప్రజలకు పిలుపు ఇస్తుంది. మరోవైపు సినీ సెలబ్రిటీలు కూడా రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను మంచి కోసమే ఉపయోగించుకోవాలని, అంతే తప్పా తప్పుడు ప్రచారంతో ఇతరుల పట్ల ద్వేషం ప్రదర్శించొద్దని కోరుతున్నారు.సోషల్ మీడియాలో



ఫేక్ న్యూస్ ప్రచారం, విద్వేష, విషపూరిత రాతలు వద్దని కోరుతోంది. చెడు పోస్టులు చేయొద్దని విజ్ఞప్తి చేస్తోంది. అసత్య ప్రచారాలకు, దూషణలకు స్వస్తి పలుకుదామంటూ ప్రజలకు పిలుపు ఇస్తోంది. సోషల్ మీడియాపై ప్రజలను, నెటిజన్లను చైతన్యపరిచేలా పోస్టులు చేయాలని సూచిస్తోంది. సోషల్ మీడియాను మంచికి వాడుదాం అంటూ పలు నగరాల్లో భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. అలాగే ఆటోలపై పోస్టర్లు అతికించి ప్రచారం చేస్తోన్నారు. చెడు వినొద్దు, చెడు చూడొద్దు, చెడు మాట్లాడవద్దు అనే గాంధీజీ సూక్తి కాన్సెప్ట్‌తో సోషల్ మీడియాపై క్యాంపెయిన్ చేస్తోంది.త్రీ మంకీస్ బొమ్మకు ఫోర్త్ మంకీ చేర్చి చెడు పోస్టులు వద్దంటూ ఆసక్తికరంగా హోర్డింగులు ప్రభుత్వం పెట్టింది. పోస్ట్ నో ఈవిల్ (చెడు పోస్టు వద్దు) పేరుతో నాలుగో మంకీ బొమ్మతో భారీ హోర్డింగ్‌ల ఏర్పాటు చేశారు. మేక్ సోషల్ మీడియా ఎ పాజిటివ్ ఎక్స్ పీరియన్స్ పేరుతో ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ పెట్టారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం చేయవద్దని, విద్వేష, విషపూరిత రాతలు వద్దంటూ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను మంచికి, పాజిటివ్ అంశాలకు వేదికగా మార్చుదామని అనే స్లోగన్‌తో పిలుపు ఇస్తున్నారు.విజయవాడ– గుంటూరు దారిలో తాడేపల్లి హైవే వద్ద భారీ హోర్డింగ్‌ల పెట్టారు. రాజధాని అమరావతితో పాటు తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాల్లో ఫ్లెక్లీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అందరికీ అర్థమయ్యేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో వీటిని ప్రదర్శించారు. సోషల్ మీడియాలో విష ప్రచారాన్ని, వ్యక్తిత్వ హననాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం, ఈ తరహా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇప్పటికే బూతులు, మార్ఫింగ్‌లతో పోస్టుల పెట్టిన వారిపై ఇప్పటికే ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. సోషల్ మీడియాపై ప్రజలను, నెటిజన్లను చైతన్యపరిచేలా తాజాగా క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.ఈ క్యాంపెయిన్‌లో హీరో, హీరోయిన్ సినీ ప్రముఖులు భాగస్వామ్యం అయ్యారు. శ్రీలీల, అడవి శేషు, అఖిల్ తదితర నటీనటులు కూడా ప్రచారం చేస్తున్నారు. హీరోయిన్ శ్రీలీల వీడియో విడుదల చేశారు. "లైక్స్ కోసం, వ్యూస్ కోసమని తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దు. మీ వ్యూస్ కోసం ఇంకొకరిని యూజ్ చేసుకోవద్దు. అసత్య ప్రచారాలకు దూరంగా ఉందాం. సామాజిక బాధ్యత వహిద్దాం" అంటూ పేర్కొన్నారు.హీరో నిఖిల్ విడుదల చేసిన వీడియోలో "మనం ఒక వస్తువు కొనేటప్పుడు ఎలాగైతే ఎక్స్‌పైర్ డేట్ చూస్తాం. కానీ సోషల్ మీడియాలో పోస్టు చేసేటప్పుడు అది నిజమా? కాదా? అని ఎందుకు చెక్ చేయం. ఎందుకంటే ఏమవుతుందిలే అనే క్యాజువల్‌గా తీసుకుంటాం. కానీ మీరు సరదాగా షేర్ చేసే ఆ ఫేక్ న్యూస్ కొన్ని జీవితాలను నాశనం చేస్తోంది. కనుక మీరు న్యూస్ షేర్ చేసేముందు, అది నిజమా? కాదా? అని ఒకసారి చెక్ చేసుకోండి. సోషల్ మీడియాను పది మందికి ఉపయోగపడేలా వాడుదాం. అంతేతప్ప ఇబ్బందిపెట్టేలా కాదు" అంటూ పేర్కొన్నారు.నటుడు అడవి శేషు విడుదల చేసిన వీడియోలో "ఏమవుతుందిలే అనుకుని ఒక అమ్మాయి పోస్టు కింద చెడ్డ కామెంట్ పెడితే, అది చదివి వారు ఆందోళన చెందుతారు. ఏం కాదులే అనుకుని ఫేక్ న్యూస్ షేర్ చేస్తే, అదే నిజమని చాలా మంది అనుకుంటారు. సో కాస్తా ఆలోచిద్దాం. బాధ్యతగా ఫేక్ న్యూస్ షేర్ చేయొద్దు. చెడ్డ కామెంట్లు పెట్టొద్దు" అని అన్నారు. మరోవైపు జనసేన పార్టీ కూడా సోషల్ మీడియా వేదికగా క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.

ఉద్యమం చేస్తున్నది ఎవరు

అందరికీ అర్థమయ్యేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో వీటిని ఏర్పాటు చేశారు.సోషల్ మీడియాను మంచి కోసం వాడుదాం అంటూ ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ద్వారా చైతన్యం తెచ్చేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. చిన్న చిన్న పోస్టర్లు కాదు ఏకంగాపెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఫ్లెక్సీలు చర్చనీయాంశం అవుతున్నాయి. సోషల్ మీడియా వల్ల జరుగుతున్న అనర్థాలు.. మంచి కోసం ఎలా ఉపయోగించుకోవాలన్న చర్చ కూడా వస్తోంది. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. వీటిని ఎవరు ఏర్పాటు చేశారనేదానిపై మాత్రం స్పష్టత లేదు. సినిమా తారలతోనూ ప్రచారం చేయిస్తున్నారు. సలహాలు, నీతులు ఉరకనే చెబుతారు. భారీ హోర్డింగ్‌లకు వేలల్లో వసూలు చేస్తారు ఇలా అన్ని సిటీల్లో వేయాలంటే లక్షలు ఖర్చవుతుంది. అయినా ఎవరూ ఖర్చు పెట్టి చెప్పరు. కానీ ఏపీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో ఎవరి పేర్లు లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉంటే జారీ చేసిన వారు సమాచార, ప్రచార సంబంధాల శాఖ అని వేసుకునేవారు. కానీ అలా వేయలేదు. ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసి ఉంటే అంత ఖర్చుపెట్టి పబ్లిసిటీ చేసుకోవడం లేదు.

# కాపు సామాజిక వర్గంలో ఆందోళన

కాకినాడ, జనవరి 2, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారంలోకి రాకముందు ఒకలా.. వచ్చిన తర్వాత మరొకలా కనిపిస్తున్నారు. చంద్రబాబు నాయుడు చెప్పినట్లే నడుచుకుంటూ తన పార్టీని పణంగా పెడుతున్నారని సొంత పార్టీ నేతలే అనుకుంటున్నారు. ఎన్నికలకు ముందు అయితే ఒక విధంగా పవన్ కల్యాణ్ ను ఆయన అభిమానులు, సామాజికవర్గం ఊహించుకుంది. కానీ ఇంతలా తగ్గుతారని మాత్రం పవన్ విషయంలో అంచనా వేయలేదు. అంతా చంద్రబాబు దర్శకత్వంలోనే పనిచేస్తున్నట్లు అర్థమవుతుంది. ఇతరపార్టీల నుంచి చేరుతున్న నేతల విషయంలోనూ చంద్రబాబు సూచనల మేరకే కండువాలు కప్పుతున్నారన్న కామెంట్స్ మాత్రం జనసేన పార్టీలో బలంగా వినిపిస్తున్నాయిఒంగోలుకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి నుంచి నిన్న మంగళగిరి నియోజకవర్గ నేత గంజి చిరంజీవి వరకూ తన పార్టీలో చేర్చుకోవడం వెనక చంద్రబాబు నాయుడు ఆలోచన ఉందని చెబుతున్నారు. అక్కడ వైసీపీని బలహీనం చేయాలన్న ఆలోచనతో తాను నేరుగా చేర్చుకోవడానికి చంద్రబాబుకు ఇబ్బందులున్నాయి. సొంత పార్టీ నేతలు వ్యతిరేకిస్తారు. అలాగని వైసీపీ అక్కడ వచ్చే ఎన్నికల్లోనూ బలంగా ఉండకూడదు. అయితే అదే సమయంలో ఆ నేతలు కూడా వైసీపీలో కొనసాగకూడదు. ఇది చంద్రబాబు నాయుడు ఆలోచన. అందుకే తన పార్టీలోకి నేరుగా చేర్చుకోలేని నేతలను జనసేన వైపునకు పంపుతున్నారన్న కామెంట్స్ పార్టీలో వినపడుతున్నాయి.ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను చేరిక విషయంలోనూ ఇదే జరిగిందని చెబుతున్నారు. జగ్గయ్యపేటలో బలమైన నేత ఉదయ భాను కావడంతో అతనిని జనసేనలోకి పంపితే తమకు వచ్చే ఎన్నికల్లో ఎలాగూ రాజకీయంగా ఇబ్బందులుండవన్న అంచనాలతో ఈ పనిచేశారంటున్నారు. అలాగే మంగళగిరి నియోజకవర్గంలో ముఖ్యనేత గంజి చిరంజీవిని కూడా జనసేనలోకి పంపింది చంద్రబాబేనన్న టాక్ పార్టీలో బలంగా వినిపిస్తుంది. ఎందుకంటే మంగళగిరిలో నారా లోకేష్ కు మరింత పట్టు పెంచాలంటే గంజి చిరంజీవిని తమలో కలుపుకోవాలి. అయితే తన పార్టీలోకి నేరుగా చంద్రబాబు తీసుకోలేరు. అందుకే గంజి చిరంజీవిని జనసేనలోకి పంపి మంగళగిరిలో లైన్ క్లియర్ చేశారంటున్నారు.జనసేనలో చేరే ప్రతి చేరిక వెనక చంద్రబాబు ఆలోచన ఉంటుందని చెబుతున్నారు. రేపు తమ్మినేని సీతారాం కూడా జనసేనలో చేరితే అది చంద్రబాబు డైరెక్షన్ అన్న కామెంట్ వినపడుతుంది. ఇప్పుడు జనసేనలో చేరిన నేతలు ఎవరికీ వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దక్కే అవకాశం లేదు. అక్కడ టీడీపీ నేతలే పోటీ చేస్తారు. ఒకవేళ నియోజకవర్గాల పెంపు జరిగి అక్కడ సానుకూలత ఉంటే తప్ప వీరికి టిక్కెట్ దక్కే అవకాశం లేదు. జనసేన కోటాలో చేరిన వారికి టిక్కెట్ దక్కకపోయినా పెద్దగా ఇబ్బంది ఉండదు. అదే సమయంలో టీడీపీ విజయానికి ఢోకా ఉండదు. ఈ ప్లాన్ లోనే చంద్రబాబు పవన్ కల్యాణ్ ద్వారా అమలు చేస్తున్నారని, అందుకోసమే పవన్ కు ఇష్టం లేకపోయినా కొందరిని చేర్చుకుంటున్నారని పార్టీలో ముఖ్యనేతలే చెబుతుండటం విశేషం.

# నెలకో జిల్లాకు జనసేనాని

కడప, జనవరి 2, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి నెలా ఒక జిల్లాలో పర్యటించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పవన్ స్వయంగా రంగంలోకి దిగనున్నారు. 2025 కొత్త ఏడాది నుంచి ప్రజల మధ్యకు వెళ్లి వారి ఇబ్బందులు తీసుకొనేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రతి నెల ఒక జిల్లాను ఎంచుకొని పవన్ పర్యటించనున్నారు.

ఆ జిల్లాలో వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాల్లో క్యాంపు చేసేలా ఏర్పాట్లు ఉండాలని తన కార్యాలయ అధికారులకి డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని సమస్యలు, ప్రజల స్థితిగతులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ప్రత్యక్షంగా ఆయన పరిశీలించనున్నారు. పర్యటనలో రోజంతా ప్రజలతో మమేకం కానున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కడప జిల్లాలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీ బిజీగా ఉన్నారు. రిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును పవన్ పరామర్శించారు. బాధితుడు ఎంపీడీఓ జవహర్ బాబుకు, కుటుంబసభ్యులకు నేనున్నాను.. ధైర్యంగా ఉండమంటూ పవన్ భరోసా కల్పించారు.

==========================

# కొడాలి నాని అరెస్ట్ తప్పదా?



విజయవాడ, జనవరి 2,కొత్త సంవత్సరంలో మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టు తప్పదని విశ్లేషణలు ఉన్నాయి. సరిగ్గా ఇదే సమయంలో ఆయన ప్రధాన అనుచరుడిని గుడివాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి కీలక వాంగ్మూలం సేకరించినట్లు సమాచారం.మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టు తప్పదా? ఆయనను ఏ క్షణంలోనైనా పోలీసులు అరెస్టు చేస్తారా? ఆయన అనుచరుడు కీలక వాంగ్మూలం ఇచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు అలానే ఉన్నాయి. తాజాగా కొడాలి నాని ప్రధాన అనుచరుడు కాలిని గుడివాడ పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు షాపుపై పెట్రోల్ దాడి కేసులో కాళీ అరెస్టయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో గుడివాడ పోలీసులు అస్సాం వెళ్లి మరి కాలిని అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో 13 మందిని అరెస్టు చేయగా.. వారంతా ఇప్పటికే నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. తాజాగా ఖాళీని అరెస్టు చేశారు. విచారణ చేపడుతున్నారు. అయితే తాను మాజీ మంత్రి కొడాలి నాని ఆదేశాల మేరకు అలా చేశానని కాళీ చెప్పినట్లు సమాచారం. దీంతో కొడాలి నాని చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది.వైసిపి ప్రభుత్వ హయాంలో గుడివాడలో టిడిపి కార్యాలయం పై దాడి జరిగింది. ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావు పై కూడా దాడి జరిగింది. ఈ రెండు కేసుల్లో కాళీ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. 13 మంది వైసీపీ కార్యకర్తలు ఈ దాడిలో పాల్గొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కేసులో పురోగతి పెరిగింది. ఆ 13 మంది వైసీపీ కార్యకర్తల అరెస్టు జరిగింది. వారంతా ఇప్పుడు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇప్పుడు సూత్రధారిగా భావిస్తున్న కాళీని సైతం అస్సాంలో అదుపులోకి తీసుకున్నారు గుడివాడ పోలీసులు. ఆయనను విచారిస్తున్నారు.

ఎవరి ప్రమేయం ఉందా? ఎవరు ప్రోత్సహించారు? అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. 2022 డిసెంబర్ 26న వంగవీటి మోహన్ రంగా వర్ధంతి. గుడివాడలో కార్యక్రమాలు నిర్వహించేందుకు టిడిపి నేతలు సిద్ధమయ్యారు. అయితే డిసెంబర్ 25న టిడిపి నేత రావి వెంకటేశ్వరరావుకు కొడాలి నాని ప్రధాన అనుచరుడు అయిన కాళీ ఫోన్ చేసి హెచ్చరించారు. రంగా వర్ధంతి నిర్వహిస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని రావి వెంకటేశ్వరరావు చెప్పగా.. చంపేస్తానని కాళీ బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే రోజు వెంకటేశ్వరరావు కు చెందిన బట్టల దుకాణం పై కొడాలి నాని అనుచరులు పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేశారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. ఈ క్రమంలోనే టిడిపి కార్యాలయానికి నిప్పంటించబోతుండగా పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.వైసిపి హయాంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే అప్పట్లో పట్టించుకోలేదు. ఓటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొడాలి నాని అనుచరులపై వరుసగా కేసులు నమోదు చేశారు. ఇటీవల 13 మందిని అరెస్టు చేయగా.. ప్రధాన అనుచరుడు కాళీ దొరకలేదు. తాజాగా అరెస్టు చేయగా.. ఈ మొత్తం ఎపిసోడ్లో కొడాలి నాని పాత్ర పై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే కాళీ నుంచి కీలక వాంగ్మూలం తీసుకున్న పోలీసులు కొడాలి నానిని అరెస్టు చేయబోతున్నట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# జేపీసీ నేతను కలిసిన రాష్ట్ర మాల మహానాడు సభ్యులు



ఆళ్లగడ్డ జనవరి 2,రానున్న రోజుల్లో ప్రజల సమస్యలపై సంయుక్త పోరాటం చేస్తామని రాష్ట్ర మాల మహానాడు జిల్లా నాయకులు పెన్నెం సుధాకర్, ఓబులేసులు పేర్కొన్నారు. ఈరోజు ఆళ్లగడ్డ పట్టణంలోని జాయింట్ యాక్షన్ కమిటీ కార్యాలయంలో జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాషను రాష్ట్ర మాల మహానాడు నాయకులు సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ప్రజా సమస్యల కొరకు నిత్యం శాంతియుత మార్గంలో పోరాటం చేసే బీరువాళ్ళ భాష నడవడిక తమకి ఎంతో నచ్చిందని ఆయన అనుసరిస్తున్న మార్గం ఎంతోమందికి అనుసరణీయమని పెన్నం సుధాకర్ అన్నారు. రానున్న రోజుల్లో లౌకిక దేశమైన భారతదేశంలో కులాల మధ్య మతాల మధ్య చిచ్చులు పెట్టే మతోన్మాదులపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఇందు కొరకు బీరువాళ్ళ భాష సహకారం అందించాలని మీడియా ముఖంగా కోరారు. బీరువాల భాష మాట్లాడుతూ శాంతి సద్భావం సామరస్యం ప్రేమ ఆయుధాలుగా మరో స్వాతంత్ర ఉద్యమ పోరాటానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తనతో పాటు నడిచి వచ్చే ఎవరైనా రాజ్యాంగబద్ధంగా శాంతియుతంగా మన పోరాటం చేద్దామని రాష్ట్ర మాల మహానాడు నాయకులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు గౌస్ పీర్, మెకానిక్ నూర్ భాషా, రాష్ట్ర మాల మహానాడు 6 మండలాల నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

# రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం...

కొలిమిగుండ్ల, జనవరి 2,కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల గ్రామంలోఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారి ఆదేశాలు మేరకు క్షయవ్యాధి నిర్మూలన దిశగా ప్రచారం కార్యక్రమంలో భాగంగా రాంకో సిమెంట్ యాజమాన్యం వారు గురువారం నాడు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పం దన లభించింది. కల్వటల గ్రామంలోని సచివాలయం లో డా. శశిధర్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో 106 మంది రోగులు వైద్య సేవలు వినియోగించుకున్నారు. రోజులకు రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన పలు జాగ్రత్తలను రోగులకు సూచించారు. వ్యాధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించ్చవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైన్స్ జిఎం అజ్మల్ అహ్మద్, మైన్స్ డీఎం నాయుడు,నరేష్, డాక్టర్ శశిధర్,




సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు...

# తమ్మినేని దారెటు......

శ్రీకాకుళం, జనవరి 2, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పవన్ నో చెప్పారా? జనసేనలో చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదా? అందుకే తమ్మినేని వెనక్కి తగ్గారా? వైసీపీలో కొనసాగుతానన్న ప్రకటన అందులో భాగమేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఇటీవల ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జిగా.. కొత్త నేతను నియమించారు జగన్. తన కుమారుడికి ఆ పదవి ఇవ్వాలని కోరారు తమ్మినేని. కానీ జగన్ ఓ ద్వితీయ శ్రేణి నేతకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటినుంచి పార్టీకి దూరంగా ఉన్నారు తమ్మినేని. పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనడం లేదు. ఇటీవల ఆయన కుటుంబంతో సహా జనసేన లో చేరతారని ప్రచారం పెద్ద ఎత్తున నడిచింది. కానీ ఉన్నట్టుండి తమ్మినేని తాను వైసీపీలోనే కొనసాగుతానని చెప్పడం విశేషం.సందిగ్ధతలో పడిపోయారు సీనియర్ నాయకుడు తమ్మినేని. టిడిపిలో ఒక వెలుగు వెలిగిన ఈ నాయకుడు తర్వాత కష్టాలు ఎదుర్కొన్నారు. జగన్ పుణ్యమా అని స్పీకర్ అయ్యారు. కానీ ఇప్పుడు ఆయన రాజకీయ జీవితానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి.అయితే తమ్మినేని ఒకటి ఆశిస్తే.. జనసేన నుంచి మరో రిప్లయ్ వచ్చింది. తమ్మినేని సీతారాం తెలుగుదేశం పార్టీలోనే ఎదిగారు. పార్టీ ఆవిర్భావం నుంచి 2009 వరకు కొనసాగారు. తరువాత ప్రజారాజ్యంలో చేరారు. ఆ పార్టీ కాంగ్రెస్లో విలీనమైన తర్వాత తెలుగుదేశంలోకి తిరిగి వచ్చారు. కొద్దిరోజుల పాటే ఆ పార్టీలో కొనసాగారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత జగన్ వెంట అడుగులు వేశారు. కానీ ఇప్పుడు జగన్ ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించడంతో మనస్థాపానికి గురయ్యారు. టిడిపిలో చేరేందుకు అవకాశం లేకపోవడంతో జనసేనలో చేరడానికి సిద్ధమయ్యారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా స్పీకర్ గా ఉన్న తమ్మినేని వ్యవహార శైలిపై అనేక రకాల అభ్యంతరాలు ఉన్నాయి. ఈ విషయంలో



చంద్రబాబు నుంచి అభ్యంతరాలు వెళ్లడంతో పవన్ సైతం పునరాలోచనలో పడ్డారు. అందుకే తమ్మినేని చేరికకు బ్రేక్ పడినట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఎట్టి పరిస్థితుల్లో ఆమదాలవలస అసెంబ్లీ టికెట్ ఈసారి తమ్మినేని కుటుంబానికి ఇచ్చే అవకాశం లేదు. కేవలం పెద్దన్న పాత్ర మాత్రమే పోషించాలని జగన్ స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. అయితే ఇప్పుడు అనవసరంగా పార్టీ మారడం ఎందుకన్న అభిప్రాయంతో తమ్మినేని ఉన్నారు. కానీ కుటుంబ సభ్యులు మాత్రం వైసీపీలో కొనసాగకూడదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తమ్మినేని వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నా.. ఐ కమాండ్ నుంచి ఎటువంటి స్పందన లేదు. తమ్మినేని వదులుకోవడానికి వైసిపి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టమైంది. అదే సమయంలో పవన్ నుంచి సైతం గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో తమ్మినేని ఇరకాటంలో పడినట్టు కనిపిస్తున్నారు. అందుకే వైసీపీలోనే కొనసాగుతానని చెప్పినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అనిల్ బెయిల్ పిటీషన్ కొట్టివేత

విజయవాడ, జనవరి 2, వైసీపీ నేత బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. నిందితుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా.? అని వ్యాఖ్యానించిన కోర్టు.. ఇలాంటి వారిని క్షమించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. పిటిషనర్‌కు పూర్వ నేర చరిత్ర ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అనుచిత పోస్టుల వ్యవహారంలో నమోదైన 2 కేసుల్లో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని చెప్పారు. కాగా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో బోరుగడ్డపై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.బోరుగడ్డ అనిల్.. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా ఏపీలో పరిచయం అక్కర్లేని పేరు. గుంటూరు నగరానికి చెందిన ఈయన.. కేంద్ర మంత్రిగా పనిచేసిన రాందాస్ అతావలె అనుచరుడిగా చెప్పుకొంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అయ్యాడు. జగన్‌ను అన్నా అంటూ తాను పులివెందులకు చెందినవాడినేనంటూ వైసీపీ నేతలతో తిరిగాడు. వైసీపీ హయాంలో సోషల్ మీడియా, పలు యూట్యూబ్ ఛానళ్ల ఇంటర్వ్యూల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ (ఖజీలిజీని ఐజీశ్రీఎజీని), లోకేశ్‌లే టార్గెట్‌గా దుర్భాషలతో విరుచుకుపడ్డాడు. వైసీపీ అధినేత జగన్ భజనే పరమావధిగా వీరిపై అసభ్యకర కామెంట్స్ చేస్తూ హల్చల్ చేశాడు. జగన్ పేరు చెబుతుండడంతో పోలీసులు సైతం అతని వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిని వారిని చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొద్ది రోజులు పరారయ్యాడు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై పలుచోట్ల కేసులు నమోదు కాగా పోలీసులు బోరుగడ్డను



అరెస్ట్ చేయగా... కోర్టు రిమాండ్ విధించింది.అయితే, బోరుగడ్డ అనిల్‌ను అరెస్ట్ చేసి ఉంచినా అతనికి పోలీసులు రాచమర్యాదలు చేశారన్న విమర్శలు వచ్చాయి. దీనికి సంబంధించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. పీఎస్‌లోనే దిండు, దుప్పటి అందించిన నలుగురు పోలీస్ సిబ్బందిపై వేటు వేశారు. ఇటీవలే రాజమహేంద్రవరం కారాగారానికి తరలిస్తూ.. పోలీసులు ఓ రెస్టారెంట్‌లో బోరుగడ్డకు బిర్యానీ అందించారు. ఈ తతంగాన్ని వీడియో తీసిన టీడీపీ సానుభూతిపరులపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేయగా.. దీనిపైనా విచారించి సదరు పోలీసులపై చర్యలు చేపట్టారు.ప్రస్తుతం రాజమండ్రి జైలులో బోరుగడ్డ ఉండగా.. ఆయనపై అనంతపురంలోనూ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే బోరుగడ్డను అనంతపురం నుంచి రాజమండ్రికి తరచూ తరలించేవారు. అనంతలో నమోదైన కేసును తాజాగా విచారించిన హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి వారిని క్షమించడానికి

# స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడు

**- భారీ శబ్దంతో ఒక్కసారిగా పేలిన రెండు బాయిలర్లు**

**- ఈ ఘటనలో పలువురు మృతి చెంది ఉంటారని అనుమానం**

**- మరికొందరికి తీవ్ర గాయాలు**

**- అర్ధరాత్రి స్టీల్ పరిశ్రమ ఎదుట నెలకొన్న తీవ్ర ఉత్కంఠత**

తిరుపతి జనవరి 2, జిల్లా పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పెను ప్రమాదం చోటుచేసుకుంది. పరిశ్రమంలోని రెండు బాయిలర్లు ఒక్కసారిగా పేలినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో భారీగా విస్ఫోటనం జరిగినట్లు తెలుస్తుంది. ఈ ఘటనతో పరిశ్రమలోని పలువురికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్ లలో క్షతగాత్రులను నాయుడుపేట, నెల్లూరు ప్రభుత్వాసుపత్రులకి తరలించారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. పేలుడు దాటితో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిశ్రమలో పనిచేస్తున్న పలువురు మృతిచెందవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నట్టు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పరిశ్రమ నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. దీంతో అక్కడ ఉత్కంఠ నెలకొంది.

# సంధ్య థియేటర్ కేసు రోజుకో మలుపు

హైదరాబాద్, జనవరి 2, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంధ్య థియేటర్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. కొత్త సంవత్సరం రోజున ఈ కేసుకు సంబంధించిన రెండు కీలక పరిణామాలు జరిగాయి. ఈ కేసులో జాతీయ మానవహక్కుల కమిషన్ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఈ కేసులో నిర్మాతలను అరెస్టు చేయొద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.డిసెంబర్ 4న పుష్ప-2 ప్రీ రిలీజ్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, ఓ బాలుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. దీనిపై జాతీయ మానవహక్కుల కమిషన్‌లో ఓ లాయర్ ఫిర్యాదు చేశారు. పోలీసుల కారణంగానే తొక్కిసలాట జరిగిందని అందులో పేర్కొన్నారు. పోలీసుల లాఠీఛార్జితోనే తొక్కిసలాట చోటు చేసుకుందన్నారు.

# సీఎంఆర్ కాలేజీ హాస్టల్‌లోకి ప్రైవేట్ వ్యక్తులు

హైదరాబాద్, జనవరి 2, మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు మరోసారి భగ్గుమన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గర్ల్స్ హాస్టల్‌లోకి వచ్చి బాత్‌రూమ్‌లో ఫొటోలు తీశారని ఆరోపిస్తూ బుధవారం అర్ధరాత్రి ఆందోళనలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పడంతో శాంతించారు. అయితే వారి వద్ద న్యూడ్ వీడియోలు ఉన్నాయని ప్రచారం జరగడంతో మరోసారి విద్యార్థులు నిరసన బాటపట్టారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరుగుతోందని ఆరోపిస్తూ కాలేజీ ఎదుట ధర్నాకు దిగారు. సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు చేస్తున్న ధర్నాకు విద్యార్థి సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి. ఉదయం నుంచి కాలేజీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బయటవారు లోపలికి రాకుండా కాలేజీ సెక్యూరిటీ సిబ్బంది గేట్లకు తాళాలు వేశారు. దీంతో కాలేజీ లోపల విద్యార్థులు ధర్నా చేస్తుంటే గేటు బయట విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. ఈ పరిస్థితుల్లో అక్కడకు విద్యార్థి సంఘాల నాయకులు రావడంతో పరిస్థితి మరింతగా మంటపుట్టించింది. వారంతా సెక్యూరిటీని తోసుకొని గేట్లు ఎక్కి కాలేజీ లోపలికి చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. గర్ల్స్ హాస్టల్ బాత్‌రూమ్‌లో వీడియోలు తీశారని విద్యార్థినులు వారికి వివరించారు. వంట చేసే వారే వీడియోలు తీసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీ యాజమాన్యం దిగి వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని అంటున్నారు. మరోవైపు విద్యార్థి సంఘ నాయకులు కూడా అదే ఆరోపణలు చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకొని మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి తప్పు చేయకుంటే యాజమాన్యం ఇంత వరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. రాత్రి నుంచి జరుగుతున్న గడబిడ చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు కాలేజీకి చేరుకుంటున్నారు. తమ బిడ్డలకు ఏమైందో అని కంగారు పడుతున్నారు. పోలీసులు, ప్రభుత్వం జోక్యం చేసుకొని వివాదాన్ని పరిష్కరించాలని వేడుకుంటున్నారు. ఇందులో ఎవరి పాత్ర ఉన్నా సరే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నో ఆశలతో బిడ్డలను దూరంగా ఉంచి చదివిస్తుంటే ఇలాంటి ఘటనలు తమను నిద్రపోనివ్వడం లేదని వాపోతున్నారు.

# మను బాకర్, గుకేశ్ సహా నలుగురికి ఖేల్‌రత్న.. 32మందికి అర్జున పురస్కారాలు

దిల్లీ: భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలన కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 ఏడాదికి గాను నలుగురు క్రీడాకారులను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేసింది. చెస్ విభాగంలో డి.గుకేశ్(హాకీ విభాగంలో హర్మన్‌ప్రీత్ సింగ్( పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్



కుమార్( షూటింగ్ విభాగంలో మను బాకర్)ను ఈ అవార్డులు వరించాయి. అలాగే, 32మందికి అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య పురస్కారాలకు ఎంపిక చేశారు. అర్జున పురస్కారాలు దక్కించుకున్నవారిలో 17మంది పారా అథ్లెట్స్ ఉండటం విశేషం. జనవరి 17న ఉదయం 11గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వీరంతా పురస్కారాలను అందుకుంటారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఇదీ ఖేల్ రత్నాల ఘనత

భారత స్వాతంత్ర్యం వచ్చాక.. ఒకే ఒలింపిక్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా మను బాకర్ ఘనత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ వ్యక్తిగత విభాగంతోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యాలను సొంతం చేసుకుంది. తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో పేరు ఉండటంతో క్రీడాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన గుకేశ్‌కు ఖేల్ రత్న అవార్డు వరించింది. ఫైనల్‌లో చైనా ప్లేయర్‌పై అద్భుత విజయంతో ఛాంపియన్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో వరుసగా భారత్ రెండో పతకం సాధించడంలో హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హై జంప్ %ు%64 విభాగంలో బంగారు పతకం సాధించాడు.

అర్జున అవార్డులు వీరికే..

జ్యోతి యర్రాజి (అథ్లెటిక్స్)అన్ను రాణి (అథ్లెటిక్స్)నీతు (బాక్సింగ్)స్వీటీ బురా (బాక్సింగ్)

వంతిక అగర్వాల్ (చెస్)సలీమా (హాకీ)అభిషేక్ (హాకీ)సంజయ్ (హాకీ)జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)సుఖ్‌జీత్ సింగ్ (హాకీ)స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్)సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్)అభయ్ సింగ్ (స్క్వాష్)సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్)అమన్ (రెజ్లింగ్)రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్)ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్)జీవాంజి దీప్తి ((పారా అథ్లెటిక్స్)అజీత్‌సింగ్ ((పారా అథ్లెటిక్స్)సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్)ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్)హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్)సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్)నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్)నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్)తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్)నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్)మనీశా రాం దాస్ (పారా బ్యాడ్మింటన్)కపిల్ పర్మార్ (పారా జుడో)మోనా అగర్వాల్ (పారా షూటింగ్)రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్)అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్)సుచా సింగ్ (అథ్లెటిక్స్)మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్)ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు)సుభాష్ రాణా (పారా షూటింగ్)దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్) సందీప్ సంగ్వాన్ (హాకీ)లైఫ్‌టైం కేటగిరీలో..మురళీధరన్ (బ్యాడ్మింటన్)

# ఏం చేస్తారో ఏమో.. స్పిన్నర్లపైనే దృష్టి..

: బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో భారత్( కు విషమ పరీక్షగా భావించే చివరి టెస్ట్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఆడిన 13 మ్యాచ్‌ల్లో ఒక్క విజయం (1978) మినహా ఐదు డ్రాలు.. ఏడు ఓటములే ఉన్నాయి. తాజాగా బీజీటీలో పరువు



కాపాడుకోవాలంటే భారత్ ఈ మ్యాచ్ గెలిచి తీరాల్సిన పరిస్థితి నెలకొంది. స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే మనవాళ్లు ఎలా రాణిస్తారో అన్న టెన్షన్ ఉంది. ఇప్పటికే జట్టులో ఉన్న స్పిన్నర్లు కూడా ఘోరంగా విఫలమయ్యారు. మొత్తం నాలుగు టెస్టుల్లో కలిపి కేవలం 7 వికెట్లు మాత్రమే సాధించారు. వీరిలో నాలుగో టెస్ట్‌లో జడ్డూ తీసిన 78 పరుగులకు 3 వికెట్లే అత్యధికం. ఈ నేపథ్యంలో సిడ్నీ మైదానంలో ఏ రకంగా ఆడతారనేది ఇప్పుడు భారత్‌కు టెన్షన్‌గా మారింది. జడ్డూ, సుందర్‌పైనే ఇప్పుడు జట్టు ఆధారపడింది.

ఈ పిచ్‌పై భారత్ తరఫున కుంబ్లే 2003–04లో తీసిన 12 వికెట్లే అత్యధిక రికార్డు. నాటి మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 8/141, రెండో ఇన్నింగ్స్‌లో 4/138 సాధించాడు.

తాజాగా స్టార్ స్పిన్నర్ అశ్విన్ రిటైర్మెంట్‌తో భారత్ స్పిన్ దళానికి జడేజానే పెద్దదిక్కుగా మారాడు. 2019లో కుల్దీప్ యాదవ్ ఈ వికెట్‌పై ఐదు వికెట్లు సాధించాడు. కానీ, ఈ సారి సిరీస్‌లో అతడికి స్థానం దక్కలేదు.

భారత్‌కు ఇక్కడ ఇన్నింగ్స్ ఓటమిని మూటగట్టుకొన్న రికార్డు కూడా ఉంది. 2011–12 మ్యాచ్లో భారత్ 191, 400 పరుగులు చేసింది. ఆసీస్ నాలుగు వికెట్లకు 659 పరుగులతో తొలి ఇన్నింగ్స్‌లోనే 463 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకొంది. ఈ మ్యాచ్‌ను భారత్ ఇన్నింగ్స్ 68 పరుగుల తేడాతో ఓడిపోయింది.

ఈ మైదానంపై సచిన్‌కు ఎదురులేదు. మొత్తం ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడి.. 157 సగటున 785 పరుగులు సాధించాడు. వీటిల్లో మూడు శతకాలు, ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. ఇక్కడ 241 పరుగులు మాస్టర్‌బ్లాస్టర్ అత్యధిక స్కోర్.

టెస్ట్‌ల్లో ఆరుగురు కెప్టెన్లు త్రిశతకాలు సాధించగా.. వాటిల్లో మూడు భారత్‌పైనే చేశారు. వీటిల్లో ఒకటి 2012 సీజన్‌లో ఆసీస్ కెప్టెన్ మైకెల్ క్లార్క్ సాధించాడు. నాడు భారత్‌పై అత్యధికంగా 329 పరుగులు చేశాడు. అదే మ్యాచ్‌లో క్లార్క్–మైక్ హస్సీ కలిసి 334 పరుగుల అభేద్య భాగస్వామ్యం నెలకొల్పారు. భారత్‌పై ఇదే త్రిశతక భాగస్వామ్యం.

# రోహిత్ రిటైర్మెంట్‌పై రవిశాస్త్రి

ఆస్ట్రేలియాతో ఐదో టెస్ట కోసం టీమ్‌ఇండియా సన్నద్ధమవుతోంది. ఈ టెస్టులో గెలిస్తేనే భారత్ సిరీస్‌ను కోల్పోకుండా డ్రాతో గట్టెక్కే అవకాశం ఉంది. అదే సమయంలో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోలుగుతుంది. మరోవైపు ఈ సిరీస్‌లో కెప్టెన్‌గానూ,



బ్యాటర్‌గానూ ఇబ్బందిపడుతోన్న రోహిత్ సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేస్తాడంటూ కథనాలు వస్తున్నాయి. వీటిపై భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. ఇదేమీ తనను షాక్‌కు గురిచేయదని.. అతను చివరి మ్యాచ్‌లోనైనా దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాలని వ్యాఖ్యానించాడు.

"నేను రోహిత్‌కు దగ్గరగా ఉండుంటే.. అతడికి ఒకటే సూచిస్తా. మైదానంలోకి దిగినప్పటినుంచి వేగంగా ఆడమని చెబుతా. వెళ్లామా? ఎటాకింగ్ చేశామా? అన్నట్లుగా ఉండాలి. ఇప్పుడు అతడు ఆడుతున్న తీరు బాగోలేదు. ఫామ్ పరంగా గొప్పగా అనిపించడం లేదు. ప్రత్యర్థిపై రోహిత్ దూకుడుగా ఆడితేనే ఫలితం ఉంటుంది. కెరీర్ కొనసాగించడంపై నిర్ణయం తీసుకోవాల్సింది అతడే. ఒకవేళ రోహిత్ రిటైర్మెంట్ తీసుకుంటే నేనేమీ షాక్‌కు గురికాను. ఎందుకంటే అతడు కుర్రాడేమీ కాదు. చాలామంది యువ క్రికెటర్లు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. శుభ్‌మన్ గిల్ వంటి ప్లేయర్ ముందు వరుసలో ఉన్నాడు. 2024లో అతడు 40 నగటుతో పరుగులు రాబట్టాడు. ఆసీస్‌తో టెస్టు సిరీస్ అనంతరం రోహిత్ నిర్ణయం తీసుకోవచ్చు. ఒకవేళ భారత్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే పరిస్థితి భిన్నం. అప్పుడు సరైన సమయం చూసి వీడ్కోలు పలికే అవకాశం రోహిత్‌కు ఉంది" అని రవిశాస్త్రి వెల్లడించాడు.

ఐదో టెస్టకు గిల్ సారథ్యమా?

ఆసీస్ – భారత్ జట్ల మధ్య ఐదో టెస్టు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. తుది జట్టులో రోహిత్ ఉంటాడా? లేదా? అనే దానిపై కోచ్ గంభీర్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. దీంతో రోహిత్ ఆడకపోవచ్చని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరి అతడు లేకపోతే సీనియర్ విరాట్ కోహ్లీకి సారథ్యం అప్పగిస్తారని అభిమానులు భావిస్తున్నారు. కానీ, మాజీ క్రికెటర్ శ్రీవాత్స్ గోస్వామి మాత్రం శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నాడు. అందుకుతగ్గట్టుగానే భారత శిబిరం ప్రాక్టీస్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27 సీజన్ కోసం టీమ్‌ఇండియా సన్నాహాలను ప్రారంభించినట్లు వెల్లడించాడు. ఒకవేళ సిడ్నీ టెస్టులో రోహిత్ లేకపోతే.. ఓపెనర్లుగా యశస్వి, కేఎల్ రాహుల్ వస్తారు. వన్‌డౌన్‌లో గిల్ ఆడతాడు. బాక్సింగ్ డే టెస్టులో గిల్ ఆడని విషయం తెలిసిందే.



# మళ్లీ విరాట్‌కే టెస్టు జట్టు పగ్గాలు

ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు చెబుతాడని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. ఈ సిరీస్‌లో రోహిత్ కేవలం 31 పరుగులు చేయడమే కాకుండా.. ఒక్కసారి మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు సాధించాడు. మరోవైపు విరాట్ కోహ్లి (4 మ్యాచుల్లో 167 పరుగులు) ఒక సెంచరీ చేసిన సంగతి తెలిసిందే. మిగతా మ్యాచుల్లో అంతగా ప్రభావం చూపించలేదు. రోహిత్‌తో పోలిస్తే ఫిట్‌నెస్‌లో కోహ్లి మెరుగ్గా ఉన్నాడు. ఆఫ్‌సైడ్ బంతిని ఆడే బలహీనతను వదిలేస్తే మరికొంతకాలం జట్టులో తన స్థానాన్ని ఉంచుకోగలడు. ఈ క్రమంలో బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ అనంతరం మేనేజ్‌మెంట్ కఠిన చర్యలు తీసుకోవడం ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి. అందులోభాగంగా రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడం లేదా అతడే స్వయంగా వైదొలగడం జరిగితే.. సీనియర్‌గా ఉన్న విరాట్ కోహ్లి కే మళ్లీ సారథ్య బాధ్యతలు అప్పగిస్తుందని కథనాలు వస్తున్నాయి.

అక్కడే మొదలైంది..

మెల్‌బోర్న్ టెస్టులో కెప్టెన్ విరాట్ కోహ్లీనా? రోహిత్ శర్మనా? అని చూసేవారికి అనిపించింది. ఫీల్డింగ్ సెటప్, బౌలర్లకు సూచనలు ఇవ్వడంలో విరాట్ కోహ్లి మైదానంలో చురుగ్గా కనిపించాడు. డీఆర్ఎస్ తీసుకొనే విషయంలో తప్పా, మిగతా వాటిల్లో కెమెరాలన్నీ కోహ్లి వైపే ఉండటం గమనార్హం. దీంతో విరాట్ కోహ్లి మళ్లీ జట్టు సారథ్యం తీసుకుంటాడనే ఊహాగానాలు మొదలయ్యాయి.

అందుకే.. విరాట్ కోహ్లి గ్రేట్: మైకెల్ క్లార్క్

మెల్‌బోర్న్ టెస్టులో ఆస్ట్రేలియా యువ ఆటగాడు సామ్ కొన్‌స్టాస్‌తో విరాట్ కోహ్లీకి స్వల్ప వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై ఐసీసీ కూడా చర్యలు తీసుకుంది. కోహ్లిపై 20 శాతం జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, విరాట్‌పై ఇంకా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ఆసీస్ మాజీలు డిమాండ్ చేశారు. ఆసీస్ మీడియా మరింత దారుణంగా హెడ్‌లైన్లను ఉంచింది. కానీ, ఆ జట్టు మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ మాత్రం కోహ్లీని వెనకేసుకొచ్చాడు.

"విరాట్ గురించి నాకు బాగా తెలుసు. మ్యాచ్ ముగిశాక కొన్‌స్టాస్‌తో విరాట్ మాట్లాడాడు. అందుకే కోహ్లి గొప్ప అని చెబుతా. అయితే, విరాట్ సారీ చెప్పాడో, లేదో నాకైతే తెలియదు. అందరూ అంటున్నట్లుగా విరాట్ మరీ దారుణమైన వ్యక్తేమీ కాదు. సమస్య సమసిపోయి ఉంటుంది. బుమ్రా బౌలింగ్‌లో రివర్స్ షాట్లను కొట్టేందుకు కొన్‌స్టాస్ ప్రయత్నించాడు.

# సిడ్నీ టెస్టు.. తుది జట్టులో రోహిత్ కష్టమేనా? గంభీర్ ఏమన్నాడంటే?

సాధారణంగా సిరీస్‌లో ఏదొక మ్యాచ్‌లో కెప్టెన్ కనీసం ఒక్క ఇన్నింగ్స్‌లోనైనా ఆడతాడు. కానీ, ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్ – గావస్కర్ () ట్రోఫీలో భారత్ సారథి రోహిత్ శర్మ దారుణమైన ప్రదర్శనతో అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు. అతడిని తుది జట్టులో కొనసాగించవొద్దనే డిమాండ్లు వచ్చాయి. దీంతో సిడ్నీ వేదికగా శుక్రవారం నుంచి ఆసీస్‌తో ఐదో టెస్టు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో రోహిత్‌ను ) తప్పిస్తారా? లేదా కొనసాగిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తాయి. అయితే, వీటికి భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. మ్యాచ్ సమయానికే తుది జట్టును ప్రకటిస్తామని వెల్లడించాడు. రోహిత్‌తో సమస్యేమీ లేదన్నట్లుగా గంభీర్ వ్యాఖ్యలు చేశాడు.



"ప్రతిఒక్కరికీ తాము ఎక్కడ సరిగ్గా ఆడలేకపోతున్నామో తెలుసు. దానిపై కఠినమైన సాధన చేయాలి. దేశం కోసం ఆడేటప్పుడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి. జట్టులో ఏం మాట్లాడుకుంటున్నామనేది బయటకు రానీయకుండా ఉండాలి. కెప్టెన్ రోహిత్‌తో ఇబ్బందేం లేదు. ఫైనల్ %శ×% మందిని మ్యాచ్‌కు ముందే ప్రకటిస్తాం. పిచ్ పరిస్థితులను బట్టి తుది నిర్ణయం ఉంటుంది. సిడ్నీ టెస్టులో ఎలా విజయం సాధించాలనేది ప్రతిఒక్కరం మాట్లాడుకుంటూనే ఉన్నాం. ఈ టెస్టు మాకు అత్యంత కీలకం" అని గంభీర్ వెల్లడించాడు.

రోహిత్ గైర్హాజరీపై..

ప్రెస్ కాన్ఫరెన్స్‌కు రోహిత్ శర్మ (%ఋుఝ్ఖుఅఅ =శీ్‌ప్త్రఱ్ గాఞ్టుతీఝ%) హాజరుకాకపోవడంపై గంభీర్‌కు ప్రశ్న ఎదురైంది. దానికి సమాధానం ఇస్తూ.. "ఇది సంప్రదాయమని అనుకోవడం లేదు. హెడ్‌కోచ్‌గా నేను ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చా. అది సరిపోతుందని అనుకుంటున్నా. ఇక బోర్డర్ – గావస్కర్ ట్రోఫీని సమం చేస్తామని బలంగా నమ్ముతున్నా. సిడ్నీ టెస్టులో (%ూఖూ జం ×చీణ%) విజయం సాధిస్తాం" అని స్పష్టం చేశాడు. మరోవైపు తుది జట్టులో పలు మార్పులు ఉంటాయని తెలుస్తోంది. పంత్, ఆకాశ్‌దీప్ స్థానాల్లో ధ్రువ్ జురెల్/శుభ్‌మన్ గిల్, ప్రసిధ్ కృష్ణను తీసుకొనే అవకాశం లేకపోలేదు. మ్యాచ్‌కు అప్పుడప్పుడు వరుణుడు అంతరాయం కలిగించే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ చెబుతోంది.

# రూ. 6 వేల కోట్ల పోంజీ స్కామ్.. గిల్, సాయి సుదర్శన్‌లకు సీఐడీ సమన్లు

గుజరాత్‌తోపాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోంజీ కుంభకోణం సెగ క్రికెటర్లనూ తాకింది. బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామని ప్రజలను మోసం చేసి రూ.6 వేల కోట్లను సేకరించిన బీజెడ్ గ్రూప్ సీఈవో భూపేంద్ర సింగ్ ఝలాను ఇప్పటికే గుజరాత్ సీఐడీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తోపాటు సాయి సుదర్శన్, రాహుల్ తెవాతియా, మోహిత్ శర్మ వంటి పలువురు ఇందులో పెట్టుబడి పెట్టినట్లు తాజాగా బయటకొచ్చింది.

బీజెడ్ గ్రూప్‌నకు చెందిన రూ.450 కోట్లకు సంబంధించి లావాదేవీలపై సీఐడీ ఆరాతీస్తోంది. అందులోభాగంగా గుజరాత్ క్రికెటర్లకు సమన్లు జారీ చేయనుంది. వారి నుంచి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనుంది. అహ్మదాబాద్ మిర్రర్ నివేదిక ప్రకారం.. ఇందులో గిల్ రూ. 1.95 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు పేర్కొంది. అతడు కాకుండా.. మిగతా క్రికెటర్లు తక్కువ మొత్తాల్లో ఇన్వెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. అది ముగిసి భారత్‌కు వచ్చాక గిల్‌కు సమన్లు జారీ చేసి.. విచారణ చేపట్టే అవకాశం ఉంది. తమ సంస్థ ద్వారా బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ రేటు ఇస్తామని గుజరాత్‌లోని పలు ప్రాంతాల ప్రజలను భూపేంద్ర సింగ్ నమ్మించారు.

# దలాల్ స్ట్రీట్‌లో బుల్ రన్.. 6 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

ముంబయి: చాలా రోజుల తర్వాత దలాల్ స్ట్రీట్ కళకళలాడింది. అయితే నష్టాలు.. లేదంటే ఓ మోస్తరు లాభాలకే పరిమితమైన సూచీలు.. చాలా రోజుల తర్వాత భారీ లాభాలను నమోదు చేశాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్, ఆటో, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్ల మేర పెరగ్గా.. నిఫ్టీ దాదాపు 450 పాయింట్లు రాణించి 24,200 మార్కుకు చేరువైంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం



విలువ ఒకేరోజు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.450 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 78,657.52 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,507.41) లాభాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు ఓ మోస్తరు లాభాల్లో ట్రేడయిన సూచీ.. తర్వాత భారీ లాభాల్లోకి వెళ్లింది. ఇంట్రాడేలో 80,032.87 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1,436.30 పాయిట్ల లాభంతో 79,943.71 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 445.75 పాయింట్ల లాభంతో 24,188.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మాత్రం మరో 10 పైసలు క్షీణించి 85.74కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క సన్‌ఫార్మా మినహా మిగిలిన అన్ని సూచీలూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2649 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

కారణాలు ఇవే..

డిసెంబర్ నెలకు సంబంధించి వెలువడిన ఆటోమొబైల్ టోకు విక్రయ గణాంకాలు మదుపర్లను మెప్పించాయి. సాధారణంగా డిసెంబర్ విక్రయాలు నెమ్మదిస్తుంటాయి. అందుకు భిన్నంగా అంచనాలు మించి విక్రయాలు నమోదు కావడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ఐషర్ మోటార్స్ 25 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా.. మారుతీ సుజుకీ 30 శాతం వృద్ధిని కనబరిచింది. దీంతో ఐషర్ మోటార్స్ 8 శాతం మేర రాణించగా.. మారుతీ సుజుకీ షేరు విలువ ఐదు శాతానికి పైగా పెరిగింది.

డిసెంబర్ త్రైమాసికంతో పాటు 2025లోనూ ఐటీ కంపెనీలు మెరుగైన రెవెన్యూ వృద్ధిని కనబరిచే అవకాశం ఉందన్న సీఎల్ఎస్ఏ, సిటీ బ్రోకరేజీ సంస్థల అంచనాలు ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది. దీంతో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు నేడు రాణించాయి.

డిసెంబర్ నెలకు సంబంధించి వెలువడిన జీఎస్టీ గణాంకాలు సైతం మదుపర్లను మెప్పించాయి. గతేడాది డిసెంబర్‌తో పోలిస్తే 7 శాతం వృద్ధితో రూ.1.77 లక్షల కోట్లుగా జీఎస్టీ వసూళ్లు నమోదు కావడం.. ఆర్థిక వ్యవస్థ మెరుగవుతోందన్న సంకేతాలు వెలువడ్డాయి. ఆటో, ఫైనాన్షియల్ వంటి రంగాలకు నుంచి వస్తున్న గణాంకాలు.. మెరుగైన క్యూ3 ఫలితాల నమోదు కావొచ్చన్న అంచనాలకు కారణమైంది.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ బలంగా పుంజుకోవడంతో సూచీలు రాణించాయి. ముఖ్యంగా బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది.

టెక్నికల్‌గా నిఫ్టీ 200 రోజుల మూవింగ్ యావరేజీకి పైకి చేరుకోవడంతో బలమైన కొనుగోళ్ల మద్దతు లభించిందని అనలిస్టులు చెబుతున్నారు.

# త్వరలోనే వొడాఫోన్ ఐడియా 5జీ మొబైల్ సేవలు..

ప్రైవేటురంగ వొడాఫోన్ ఐడియా ఎట్టకేలకు 5జీ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది మార్చిలో 5జీ సేవల్ని తీసుకొస్తున్నట్లు వొడాఫోన్ ఐడియా ప్రతినిధి ఒకరు తెలిపారు. తద్వారా దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ సేవల్ని అందిస్తున్న రిలయన్స్ జియో (భారతీ ఎయిర్‌టెల్ (%)కు పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. మెరుగైన నెట్‌వర్క్ అనుభవంతో, తక్కువ ధరలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని సమాచారం.




టెలికాం రంగంలో నెలకొన్న త్రిముఖ పోరులో మొదటినుంచి అంతంత మాత్రంగానే ఉన్న వొడాఫోన్ ఐడియాకు.. 5జీ రూపంలో గట్టి సవాలు ఎదురైంది. 5జీ స్పెక్ట్రమ్‌ను దక్కించుకున్న ఆ కంపెనీ.. నిధుల కొరత కారణంగా 5జీని విస్తరించడంలో ఆలస్యం చేసింది. అదే సమయంలో జియో, ఎయిర్‌టెల్ 5జీ సేవల్ని వేగంగా విస్తరించి మరింతమంది యూజర్లను ఆకర్షించాయి. దీంతో వీఐ పెద్దసంఖ్యలో యూజర్లను కోల్పోయింది. ఇప్పుడు కాస్త ఆలస్యంగానైనా 5జీ సేవల్ని తీసుకొచ్చి తన ఉనికిని కాపాడుకోవడానికి సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా ఎయిర్‌టెల్, జియోతో పోలిస్తే ఎంట్రీ లెవల్ ప్లాన్లు 15 శాతం చౌకగా తీసుకురానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్రీపెయిడ్ యూజర్లను ఆకర్షించేందుకు డీలర్ కమీషన్లు, ప్రచార ఖర్చుల్ని పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తొలుత 75 నగరాల్లో 5జీ నెట్‌వర్క్‌ను పరిచయం చేయాలని వొడాఫోన్ ఐడియా చూస్తోంది. అధిక డేటా వినియోగించే పారిశ్రామిక కేంద్రాలపై దృష్టిసారించనుంది.

# తోళ్ల పరిశ్రమ అభివృద్ధికి సీఎల్ఆర్ఐతో జట్టు.. రాష్ట్రంలో ఆరు లెదర్ పార్క్‌లు

రాష్ట్రంలో ఆరు లెదర్ పార్క్‌ల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇందులోభాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్(సీఎస్ఐఆర్) అనుబంధ సంస్థ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎల్ఆర్ఐ-చెన్నై)తో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్(టీజీఎల్ఐపీసీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఆరు లెదర్ పార్క్‌ల ఏర్పాటునకు సంబంధించి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కూడా రూపొందించారు.



ఈ లెదర్ పార్క్‌ల్లో తోలు వస్తువులు, దుస్తులు, ఫర్నీచర్, ఫుట్‌వేర్ తదతర ఉత్పత్తులు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తాజాగా పోలేపల్లి(మహబూబ్‌నగర్), దండేపల్లి(నల్గొండ), మందమర్రి(మంచిర్యాల), జింకుంట(నాగర్‌కర్నూల్), రుక్మాపూర్(కరీంనగర్), మల్లెమడుగు(ఖమ్మం) తదితర ఆరు లెదర్‌పార్క్‌ల అభివృద్ధికి ప్రభుత్వం సీఎల్ఆర్ఐతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. పీపీపీ పద్ధతిన వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రంలో పశువులు, గొర్రెల జనాభా గణనీయంగా పెరిగిన విషయం విధితమే. దీంతో మాంస వినియోగం, ఉత్పత్తిలో భారీగా వృద్ధి నమోదైంది. ముడి సరుకు కొరత లేకపోవడంతో తోళ్ల పరిశ్రమను అభివృద్ధి చేయడం ద్వారా వివిధ తోలు ఉత్పత్తులు ఇక్కడే తయారు చేయాలని గత బీఆర్ఎస్ సర్కారు నిర్ణయించింది. దీంతో వేలాదిమందికి ఉపాధి లభించే అవకాశం ఉండటంతో టీజీ ఎల్ఐపీసీవో ఆధ్వర్యంలో పీపీపీ పద్ధతిలో లెదర్‌పార్క్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 53 ఎకరాల్లో మెగా లెదర్ క్లస్టర్‌తోపాటు భూమి లభ్యత ఉన్న 12ప్రాంతాల్లో లెదర్‌పార్క్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది గత సర్కారు. వీటికి అవసరమైన భూములను కూడా సిద్ధం చేసింది.

# మెటా నుంచి త్వరలో ఏఐ యూజర్లు.. అసలేంటివి? ఏం చేస్తాయ్?

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా ( వినూత్న ఆలోచనతో ముందుకొస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( సాయంతో పనిచేసే ఏఐ బాట్స్ ( ను తీసుకురావాలని యోచిస్తోంది. సాధారణ యూజర్లలానే ఈ ఏఐ బాట్స్ అకౌంట్లు నిర్వహింగలవని తెలుస్తోంది. ఇతర సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్న తరుణంలో మెటా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.





ఏఐ బాట్స్ ఏం చేస్తాయ్..?

ఏఐ బాట్స్ సోషల్‌మీడియా అకౌంట్లను నిర్వహిస్తాయి. అంటే సాధారణ యూజర్ల అకౌంట్ల మాదిరిగానే ఏఐ బాట్స్ కూడా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో ఖాతాలు కలిగి ఉంటాయి. వీటికి ప్రొఫైల్ ఫొటో, బయో కూడా ఉంటుంది. ఈ ఏఐ బాట్స్.. కంటెంట్‌ను క్రియేట్ చేసి పోస్ట్ చేయగలవు కూడా. అంతే కాదు వ్యక్తి ఖాతాను హ్యాండిల్ చేసినట్లుగానే ఇవి కూడా నచ్చిన పోస్ట్‌లను లైక్ చేస్తాయి, ఇతరులతో పంచుకుంటాయట.

టిక్‌టాక్, 'ఎక్స్' సోషల్‌మీడియా నుంచి గట్టి పోటీ ఎదురవుతున్న తరుణంలో మెటా తన ప్లాట్‌ఫామ్‌లను మరింత వినోదాత్మకంగా, ఆకర్షణీయంగా చేయాలని చూస్తోందని మెటా ఏఐ విభాగం వైస్ ప్రెసిడెంట్ కన్నర్ హేస్ తెలిపారు. ఇప్పటికే మెటా ఏఐ చాట్‌బాట్, ఇన్‌స్టాగ్రామ్ డీఎంలో ఏఐ రైటింగ్ టూల్స్, కంటెంట్ క్రియేటర్ల కోసం ఏఐ అవతార్ వంటి సేవల్ని పరిచయం చేసింది. త్వరలో ఏఐ బాట్స్‌తో రూపొందించిన అకౌంట్లు తీసుకురానుంది. అయితే మరోవైపు ఏఐ బాట్స్‌పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇలాంటి ఏఐ అకౌంట్లతో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# యుద్ధ విమానాలకు.. మిధాని విడిభాగాలు

హైదరాబాద్: రక్షణ రంగానికి చెందిన ప్రభుత్వ సంస్థ మిధాని (మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్) యుద్ధ విమానాల విభాగంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించడానికి సిద్ధమవుతోంది. యుద్ధ విమానాల ఇంజిన్లలో వినియోగించే అత్యంత సంక్లిష్ట అల్లాయ్స్‌ను అగ్రశ్రేణి సంస్థలకు అందించనుంది. ఇందులో ప్రాట్ అండ్ విట్నీ వంటి బహుళ జాతి సంస్థలు, దేశీయ ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఉన్నాయి. ఇప్పటికే కొన్ని విడిభాగాలను ప్రాట్ అండ్ విట్నీకి అందిస్తుండగా, ఇంజిన్ విడిభాగాల సరఫరాకు సంబంధించి త్వరలో దీర్ఘకాలిక ఒప్పందాన్నీ ఆ సంస్థతో మిధాని కుదుర్చుకోనుంది. విమానాలు, విమానాల ఇంజిన్లలో వినియోగించే నికెల్ అల్లాయ్స్, టంగ్‌స్టన్ అల్లాయ్స్.. తదితర ప్రత్యేక లోహాలకు ప్రపంచ మార్కెట్లో, మనదేశంలో గిరాకీ ఉండగా, మార్కెట్ పరిమాణం మరింత పెరుగుతోంది. ఈ తరుణంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని, కొత్త అల్లాయ్స్‌ను మిధాని ఆవిష్కరిస్తూ, దేశీయ వినియోగంతో పాటు ఎగుమతులు పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది.




హెచ్ఏఎల్‌కు అండగా..

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) అభివృద్ధి చేస్తున్న ఎల్‌సీఏ మార్క్- 2 యుద్ధ విమానానికి అవసరమైన కీలక లోహ ఉత్పత్తులను మిధాని నిర్ణీత గడువు కంటే ముందుగానే అందిస్తోంది. దీనివల్ల మార్క్- 2 విమానం అభివృద్ధి, ఉత్పత్తి ప్రక్రియ ఎటువంటి అవరోధాలు లేకుండా ముందుకు సాగే సానుకూలత ఏర్పడింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) వినియోగిస్తున్న సుఖోయ్ యుద్ధ విమానాల్లోని ఇంజిన్లకు విడిభాగాలను కూడా సరఫరా చేస్తోంది. సుఖోయ్ యుద్ధ విమానాల ఇంజిన్లను, ఇంజిన్ విడిభాగాలను పూర్తిగా మనదేశంలోనే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ కార్యక్రమంలో మిధాని క్రియాశీలక పాత్ర పోషిస్తోంది.

పెరుగుతున్న ఎగుమతులు

కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ వల్ల మిధాని ఎగుమతులు ఏటేటా పెరుగుతున్నాయి. ప్రస్తుతం టర్నోవర్‌లో 12 శాతానికి ఎగుమతులు చేరుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు రూ.100 కోట్లకు మించే అవకాశం ఉంది. ముమ్ముందు ఇంకా అధిక ఎగుమతులు సాధిస్తామని సంస్థ సీఎండీ ఆశావహంగా ఉన్నారు. ఏటా 20% వృద్ధి సాధించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. సంస్థ చేతిలో ప్రస్తుతం రూ.1819 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 15.22% వృద్ధితో రూ.262 కోట్ల టర్నోవర్‌ను మిధాని సాధించింది. నికరలాభం 70% అధికంగా రూ.23.55 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో టర్నోవర్ రూ.227 కోట్లు, నికరలాభం రూ.13.85 కోట్లు ఉన్నాయి.

'ఐకానెల్ 718' సూపర్ అల్లాయ్స్ ఉత్పత్తి

యుద్ధ విమానాల ఇంజిన్లకు అవసరమైన అతి ముఖ్య విడిభాగాల్లో 'ఐకానెల్ 718' సూపర్ అల్లాయ్స్ వినియోగిస్తారు. ఇది ఎంతో సంక్లిష్ట మిశ్రమ లోహం. ఎటువంటి లోపాలకు తావులేని రీతిలో దీన్ని ఉత్పత్తి చేయాలి. భారీ పరిమాణంలో విడిభాగాలను ఆవిష్కరించాలి. మిధాని ఎంతో ఆసక్తికరంగా 325 ఎంఎం డయామీటర్ పరిమాణంలో, అత్యంత మెరుగైన నాణ్యతతో 'ఐకానెల్ 718' సూపర్ అల్లాయ్స్ విడిభాగాలను ఉత్పత్తి చేస్తోంది. డీఆర్‌డీఓ చేపట్టిన ఏటీడీజీ కావేరీ డ్రై ఇంజిన్, స్మాల్ టర్బో ఫ్యాన్ ప్రాజెక్టుల్లో భాగస్వామి అవుతున్నట్లు మిధాని సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా ఇటీవల వెల్లడించారు. ఈ అవసరాలకు అనుగుణంగా అధిక సామర్థ్యం గల రెండో వీఏఆర్ (వ్యాక్యూమ్ ఆర్క్ రీమెల్టింగ్) ఫర్నేస్‌ను ప్రారంభించారు. దీనివల్ల సమీప భవిష్యత్తులో సంస్థ అధిక వృద్ధి నమోదు చేయడానికి అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

# రికార్డుస్థాయికి ప్యాసింజర్ వాహనాల సేల్స్..

న్యూఢిల్లీ, జనవరి 1: దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. గడిచిన సంవత్సరానికిగాను దేశీయంగా 43 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. వాహన దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, టయోటా కిర్లోస్కర్ మోటర్, కియాలు అత్యధిక వార్షిక వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కలిసొచ్చింది. పీవీల విక్రయాలు దూసుకోవడానికి ప్రధానంగా గ్రామీణ ప్రాంత మార్కెట్ చాలా కీలక పాత్ర పోషించిందని, 2023లో అమ్ముడైన 41.1 లక్షల యూనిట్లతో పోలిస్తే రెండంకెల వృద్ధి నమోదైందని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. గతేడాదిలో మారుతి అత్యధికంగా 17,90,977 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. చిన్న స్థాయి నగరాలు, పట్టణాల్లో సైతం రిటైల్ అవుట్‌లెట్లను తెరవడానికి తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని,

గత ఏడాది కంపెనీల వాహన విక్రయాలు

మారుతి సుజుకీ 17,90,977 యూనిట్ల వాహనాలను విక్రయించింది.



హ్యుందాయ్ మోటర్ ఇండియా అత్యధికంగా 6,05,433 యూనిట్ల అమ్మకాలు జరిపింది. వీటిలో ఎస్‌యూవీ వాహనాల వాటా 67.6 శాతంగా ఉన్నది.

# కొత్త సంవత్సరంలో అలరించనున్న సినిమాలు ఇవే...






కొత్త సంవత్సరం కొంగొత్త ఆశలు, ఆకాంక్షలతో వచ్చేసింది. అయితే 2024 ఏడాది సినిమా ప్రేక్షకులకు మంచి అనుభవాలను నింపి వెళ్లిన విషయం తెలిసిందే. గుంటూరు కారంతో మొదలైన కొత్త ఏడాది.. ఆ తర్వాత హన్ మాన్, కల్కి, సరిపోదా శనివారం, లక్కీ భాస్కర్, పుష్ప 2 ది రూల్ వంటి సినిమాలతో మర్చిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది. అయితే ఈ ఏడాది కూడా

పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలు అలరించబోతున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో బాక్సాఫీసు ముందుకు రానున్న చిత్రాలేవో చూసేద్దాం. ఈ ఏడాది టాలీవుడ్‌లో తెలుగు సినిమా కాకుండా ఒక మలయాళం డబ్బింగ్ చిత్రం బోణీ కొడుతుంది. మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం మార్కో. హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. 5 రోజుల్లో రూ. 50 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమాను తెలుగులో జనవరి 01న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు మేకర్స్. మలయాళ నటుడు టొవినో థామస్, సౌత్ క్వీన్ త్రిష ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం 'ఐడెంటిటీ'. అఖిల్ పాల్, అనాస్ ఖాన్ ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. ఈ చిత్రం జనవరి 02న ప్రేక్షకుల ముందుకు రానుంది.

గేమ్ ఛేంజర్


ప్రతి సంక్రాంతిలాగే ఈ సంక్రాంతి కూడా రసవత్తరంగా సాగబోతుంది. జనవరి 10న రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో మొదలవ్వనున్న ఈ పోటీ తర్వాత వెంకటేశ్, బాలకృష్ణతో పాటు డబ్బింగ్ సినిమాలు రానున్నాయి. రామ్ చరణ్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుడటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

'డాకు మహారాజ్'

గేమ్ ఛేంజర్ వచ్చిన రెండు రోజులకే బాక్సాఫీస్ మీద దండయాత్ర చేయడానికి 'డాకు మహారాజ్' అంటూ వస్తున్నాడు బాలయ్య. బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న ఈ యాక్షన్ డ్రామాలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలుగా నటిస్తుండగా.. 'వాల్తేరు వీరయ్య' సినిమాతో 2023 సంక్రాంతికి హిట్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.

సంక్రాంతికి వస్తున్నాం

సంక్రాంతి రేసులో ఉన్న మరో పెద్ద సినిమా సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేశ్‌కి ఎఫ్2, ఎఫ్ 3 వంటి సూపర్ హిట్లు అందించిన దర్శకుడు అనిల్ రావిపుడి మరోసారి జతకట్టిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇవే కాకుండా హిందీ నుంచి కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' సినిమాని జనవరి 17న తీసుకురాబోతుండగా.. సోనూసూద్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న 'ఫతేహ్' జనవరి 10న రిలీజ్ కానుంది.






# కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిసిన సినీ ప్రముఖులు

కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ టాలీవుడ్ అగ్ర నటులు సోషల్ మీడియా వేదికగా అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మెగాస్టార్ చిరంజీవి కొత్త ఏడాది సందర్భంగా.. 2024కి వీడ్కోలు చెబుతూ.. 2025కి స్వాగతం.. ఈ కొత్త సంవత్సరం మరింత ప్రకాశవంతంగా విస్తరించాలని, కొత్త ఆశలు, ఆకాంక్షలు సాకారం చేసుకునే శక్తిని అందివ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భారతీయ సినిమా వైభవం మరింత ప్రకాశవంతంగా విస్తరించాలి. కొత్త సంవత్సరమంతా ప్రేమతో కలిసిమెలిసి ఉంటూ అందరితో ఆనందాన్ని పంచుకోవాలని కోట్లాదిమంది అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రెగొరియన్ క్యాలెండర్ ప్రకారం మొదలవుతోన్న నూతన సంవత్సరం సందర్భంగా ప్రతిఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నటుడు పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు.

పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ.. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నా అభిమానులందరికీ హ్యాపీ న్యూ ఇయర్. లవ్ యూ ఆల్ అంటూ రాసుకోచ్చాడు. నూతన సంవత్సర శుభాకాంక్షలు.. ఈ ఏడాది మరింత ఆనందాన్ని, విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా అంటూ ఎన్టీఆర్ రాసుకోచ్చాడు.

# ముద్దులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన సోనాక్షి దంపతులు




బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా దంపతులు 2025 సంవత్సరానికి వినూత్న రీతిలో స్వాగతం పలికారు. ముద్దుల్లో మునిగిపోతూ ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన వీడియోను సోనాక్షి కపుల్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆ వీడియోలో సోనాక్షి సిన్హా అభిమానులను ఉద్దేశంచి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు అని చెబుతూ కనిపిస్తుంది. ఆ తర్వాత తన భర్త జహీర్ ఇక్బాల్ చెంపపై ముద్దు పెట్టింది. ఈ సమయంలో వారి వెనుక న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి ఫైర్ క్రాకర్స్ పేలుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వేడుకలను వీక్షిస్తూ సోనాక్షి మరోసారి భర్త మెడపై ముద్దుపెట్టగా.. అందుకు స్పందనగా జహీర్ కూడా సోనాక్షి తల నిమురుతూ ముద్దులు పెట్టాడు. ఈ వీడియోను సోనాక్షి దంపతులు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. 'హమారా హ్యాప్పీ న్యూ ఇయర్ హెూగయా.. హ్యాప్పీ న్యూ ఇయర్ ఫ్రమ్ సిడ్నీ అనే క్యాప్షన్ ఇచ్చారు.

# షూటింగ్ షురూ..

## ఎస్ఎస్ రాజమౌళి, మహేష్‌బాబు కాంబో భారీ సినిమా





సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే! ప్రీ ప్రొడక్షన్ వర్క్ జోరుగా సాగుతోంది అయితే. సినిమా సెట్స్ మీదకు ఎప్పుడు వెళుతుంది? అని ప్రేక్షకులంతా ఆతురతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు వాళ్లందరికీ గుడ్‌న్యూస్ అందింది. జనవరి 2వ తేదీ, గురువారం నాడు పూజా కార్యక్రమాలతో మహేష్ బాబు, ఎస్ఎస్ రాజమౌళి సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ఉదయం పది గంటలకు ఓపెనింగ్ జరుగుతుంది. మామూలుగా తన సినిమా ప్రారంభోత్సవానికి మహేష్ బాబు హాజరు కారు. మరి ఈ సినిమాకు వస్తాడా లేదా అన్నది చూడాలి. ఈ కార్యక్రమానికి పరిశ్రమలో ప్రముఖులతోపాటు వంద మందికి పైగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. 'ఆర్ఆర్ఆర్' సినిమా చిత్రీకరణలో కొంత భాగం అల్యూమినియం ఫ్యాక్టరీలోనే షూటింగ్ చేశారు. ఆ సమయంలోను రాజమౌళి ఆఫీస్ అక్కడే ఏర్పాటు చేశారు. బాహుబలి కోసం రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ చేసినప్పుడు తన ఆఫీసును అక్కడే ఏర్పాటు చేశారు రాజమౌళి. ఇప్పుడు కూడా అంతే... అల్యూమినియం ఫ్యాక్టరీలో మహేష్ బాబు సినిమా షూటింగ్ కొంత చేసేలా ప్లాన్ చేస్తున్నారు. అందుకని ఆఫీస్ అక్కడ ఏర్పాటు చేశారు. సుమారు ఏడాదిగా అక్కడ ఈ సినిమా పనులు చేస్తున్నారని సన్నిహితుల నుంచి సమాచారం. ఈ సినిమా మొదటి షెడ్యూల్ ఆఫ్రికాలో జరగనుంది. కొన్ని రోజుల క్రితం కెన్యాలోని అంబోసెలి నేషనల్ పార్క్ వెళ్లిన రాజమౌళి, లొకేషన్ రెక్కీ నిర్వహించి వచ్చారు. ఆయనతో పాటు తనయుడు ఎస్ఎస్ కార్తికేయ కూడా ఉన్నారు. ఇప్పుడు ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ ఆఫ్రికాలో ప్లాన్ చేస్తున్నారు. కెన్యాతోపాటు సౌత్ ఆఫ్రికాలోని కొన్ని లొకేషన్లలో కూడా షూటింగ్ చేసే అవకాశం ఉందని తెలిసింది. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## పుట్టపర్తి సాయిబాబా సన్నిధిలో సాయి పల్లవి



కొత్త ఏడాది సందర్భంగా అందరూ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో మునిగితేలుతుంటే సాయి పల్లవి మాత్రం ఆధ్యాత్మికం వైపు వెళ్లింది. కొత్త సంవత్సరం కానుకగా.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబాను దర్శించుకుంది సాయి పల్లవి. కుటుంబంతో కలిసి పుట్టపర్తికి వెళ్లిన సాయిపల్లవి ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం బాబా నామస్మరణ చేస్తూ ఆధ్యాత్మికతను చాటుకుంది. ఈ సందర్భంగా పట్టుచీరలో సంప్రదాయంగా మెరిసి ఆకట్టుకుంది. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# 6న హరిహర వీరమల్లు పాట రిలీజ్



ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. జ్యోతి కృష్ణ ఈ భారీ యాక్షన్ ఎపిక్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అభిమానులు, ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపే వార్తను తాజాగా నిర్మాతలు పంచుకున్నారు. 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని జనవరి 6వ తేదీన ఉదయం 9:06 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్ ను వదిలారు. తుఫానుకి ముందు ప్రశాంతతలా, యుద్ధానికి ముందు చిరునవ్వు చిందిస్తూ ప్రశాంతంగా కనిపిస్తున్న యోధుడిలా ఉన్న పవన్ కళ్యాణ్ లుక్ పోస్టర్ లో ఆకట్టుకుంటోంది.

.....................

# రక్తం పోటెత్తుతోంది

అధిక రక్తపోటు (హైబీపీ) నిశ్శబ్ద హంతకి. పైకేమీ తెలియకుండా లోలోపలే తీవ్ర నష్టం కలిగిస్తుంది. నిజానికిది తేలికగా గుర్తించదగిందే. జీవనశైలి, మందులతో సులభంగా అదుపులో ఉంచుకోదగిందే. అయినా ఎంతోమంది నిర్లక్ష్యం చేస్తుండటం ఆందోళనకరం. ప్రపంచ ఆరోగ్యసంస్థ తొలిసారి అధిక రక్తపోటు మీద వెలువరించిన నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మంది, మనదేశంలో 18.83 కోట్ల మంది దీంతో బాధపడుతున్నారని వివరిస్తోంది. వీరిలో దాదాపు సగం మందికి జబ్బుందన్న సంగతే తెలియకపోవటం.. తెలిసినవారిలోనూ ప్రతి ఐదుమందిలో నలుగురే సరైన చికిత్స తీసుకుంటుండటం విచిత్రం. అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే పక్షవాతం, గుండెజబ్బు, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. ప్రాణాలకూ ముప్పు వాటిల్లొచ్చు. తగు చికిత్స తీసుకుంటే 2050 కల్లా అధిక రక్తపోటుతో సంభవించే 7.6 కోట్ల మరణాలను ఆపొచ్చు! కాబట్టి అధిక రక్తపోటు మీద అంతా అవగాహన కలిగుండటం తప్పనిసరి.

మన శరీరంలో ప్రతి కణానికీ రక్తం అవసరం. దీని ద్వారానే ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. రక్తం అన్ని అవయవాలకూ సరిగ్గా సరఫరా కావటానికి గుండె కాస్త బలంగా పంప్ చేస్తుంటుంది. ఈ క్రమంలో రక్తనాళాల గోడల మీద కాస్త ఒత్తిడి పడుతుంది. ఇదే రక్తపోటు. దీన్ని రెండు సంఖ్యలతో (120/80) సూచిస్తుంటారు. ఇందులో మొదటి లేదా పైసంఖ్య సిస్టాలిక్ పోటుకు.. అంటే గుండె సంకోచించి, రక్తాన్ని పంప్ చేస్తున్నప్పుడు రక్తనాళాల గోడల మీద పడే ఒత్తిడికి సంకేతం. ఇక కింది లేదా తర్వాతి సంఖ్య డయాస్టాలిక్ పోటుకు.. గుండె వ్యాకోచించినప్పుడు రక్తనాళాల్లో ఉండే ఒత్తిడిని సూచిస్తుంది. రక్తపోటు 120/80, అంతకన్నా తక్కువగా ఉండటం నార్మల్. అదే 140/90 కన్నా పెరిగితే అధిక రక్తపోటుగా పరిగణిస్తారు. అయితే అందరిలోనూ రెండు సంఖ్యలు పెరగాలనేమీ లేదు. కొందరిలో ఒకటే పెరగొచ్చు. రెండు సంఖ్యల్లో ఏది పెరిగినా అధిక రక్తపోటుగానే భావిస్తారు.

రెండు రకాలు

అధిక రక్తపోటును రెండు రకాలుగా విభజించుకోవచ్చు. 1. ఇతరత్రా సమస్యలతో ముడిపడనిది (ప్రైమరీ హైపర్‌టెన్షన్). చాలామందిలో కనిపించేది ఇదే.

2. ఇతర జబ్బులతో ముడిపడినది (సెకండరీ హైపర్‌టెన్షన్). కిడ్నీ వైఫల్యం, థైరాయిడ్, అడ్రినల్ గ్రంథి సమస్యలు.. పుట్టుకతోనే గుండె రక్తనాళాల్లో లోపాలు ఉండటం, రక్తనాళాల లోపల కందిపోయి, వాపు తలెత్తటం (వ్యాస్కులైటిస్) వంటివి దీనికి దోహదం చేస్తుంటాయి. అందువల్ల అధిక రక్తపోటు విషయంలో ఇలాంటి సమస్యలనూ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఎందుకొస్తుంది?

ఇతరత్రా సమస్యలేవీ లేకుండా తలెత్తే అధిక రక్తపోటుకు రకరకాల కారణాలు దోహదం చేస్తుండొచ్చు.

జన్యువులు: కొన్ని కుటుంబాల్లో అధిక రక్తపోటు వంశ పారంపర్యంగా రావొచ్చు. దీనికి జన్యు పరమైన అంశాలు దోహదం చేస్తుంటాయి. వీరిలో చిన్నవయసులోనే అధిక రక్తపోటు మొదలవుతుండటం గమనార్హం.

వయసు: వయసు మీద పడుతున్నకొద్దీ రక్తనాళాల మృదుత్వం తగ్గుతుంది. దీంతో రక్తనాళాలు సరిగా సాగవు. ఫలితంగా వీటి లోపల రక్తం అధిక పీడనంతో ప్రవహించొచ్చు.

అనారోగ్యకర జీవనశైలి: ప్రముఖంగా చెప్పుకోవాల్సింది ఇదే. పొగ అలవాటు, ఎక్కువగా మద్యం తాగటం రక్తపోటు పెరిగేలా చేయొచ్చు. వ్యాయామం, శారీరక శ్రమ అంతగా చేయకుండా బద్ధకంగా ఉండటం మరో కారణం.

అధిక బరువు: బరువు మితిమీరితే శరీరంలో ఇన్సులిన్, లెప్టిన్, కార్టిజోల్ వంటి హార్మోన్ల మోతాదులు పెరగొచ్చు. దీంతో ఒంట్లో ద్రవాల స్థాయులు, రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ పెరిగే అవకాశం ఎక్కువ. శరీరానికి అవసరమైన రక్తాన్ని పంప్ చేయటానికి గుండె మరింత బలంగా పనిచేయాల్సి ఉంటుంది కూడా. ఇవన్నీ రక్తపోటు పెరిగేలా చేసేవే. బరువు మామూలుగానే ఉన్నా బొజ్జ పెద్దగా ఉండటమూ ప్రమాదకరమే.

మానసిక ఒత్తిడి: ఇది ఎక్కువైనప్పుడు రక్తంలోకి ఒత్తిడి హార్మోన్లు (కాటాకొలమైన్స్) విడుదలవుతాయి. ఇవి రక్తనాళాలు సంకోచించేలా చేయటమే కాదు, గుండె వేగాన్నీ పెంచుతాయి. గుండె మరింత బలంగా పనిచేసేలా పురికొల్పుతాయి. కాబట్టి దీర్ఘకాలం మానసిక ఒత్తిడితో బాధపడేవారికి అధిక రక్తపోటు ముప్పూ పెరుగుతుంది.


నిద్రలేమి: రాత్రిపూట సరిగా నిద్రపట్టకపోయినా ఒత్తిడి హార్మోన్ల మోతాదులు పెరుగుతాయి. ఫలితంగా రక్తపోటూ ఎక్కువవుతుంది. ప్రస్తుతం షిఫ్ట్ ఉద్యోగుల్లో అధిక రక్తపోటుకు ప్రధాన కారణమిదే అని చెప్పుకోవచ్చు.

మధుమేహం: దీనికీ అధిక రక్తపోటుకు దగ్గరి సంబంధముంది. మధుమేహంతో బాధపడే ప్రతి పది మందిలో ఆరుగురికి అధిక రక్తపోటు కూడా ఉంటుండటం గమనార్హం.

గురక: కొందరికి నిద్రలో కాసేపు శ్వాస ఆగిపోతుంటుంది (స్లీప్ అప్నియా). అప్పుడు బిగ్గరగా గురక పెడుతూ శ్వాస తీసుకుంటుంటారు. ఇదీ రక్తపోటు పెరగటానికి దారితీస్తుంది.

ఎప్పుడు సమస్య?

పరీక్ష రాసేటప్పుడు ఆదుర్దా పడొచ్చు. నలుగురిలో మాట్లాడే సమయంలో ఒత్తిడికి గురికావొచ్చు. గబగబా నడిచినప్పుడు, పరుగెత్తినప్పుడు శరీరానికి ఎక్కువ రక్తం అవసరమవుతుంది. ఇలాంటి సమయంలో గుండె వేగం ఎక్కువై రక్తపోటు పెరగొచ్చు. వీటిని సమస్యగా భావించాల్సిన పనిలేదు. ఒత్తిడికి గురికాకుండా, పూర్తిగా విశ్రాంతిగా



ఉన్నప్పుడూ రక్తపోటు నిరంతరం ఎక్కువగా ఉండటమే సమస్య.

నిర్లక్ష్యం చేస్తే అంతే..

మనదగ్గర అధిక రక్తపోటుతో బాధపడేవారిలో సగం మందే మందులు వేసుకోవటం.. వీరిలోనూ సగం మంది మధ్యలోనే మానెయ్యటం చూస్తున్నాం. అంటే మన సమాజంలో వంద మందికి అధిక రక్తపోటు ఉంటే కేవలం 25-30 మందే అదుపులో ఉంచుకుంటున్నారన్నమాట. ఇదే ప్రమాదకరంగా పరిణమిస్తోంది. అధిక రక్తపోటు శరీరంలోని అన్ని భాగాల మీదా విపరీత ప్రభావం చూపుతుందని గమనించాలి.

గుండె జబ్బు: అదేపనిగా రక్తపోటు ఎక్కువగా ఉంటే రక్తనాళాల లోపలి పైపొర దెబ్బతిని, క్రమంగా పూడికలు ఏర్పడొచ్చు. గుండె రక్త నాళాల్లో పూడికలు ఏర్పడితే గుండెపోటు తలెత్తొచ్చు. దీర్ఘకాలంగా రక్తపోటు ఎక్కువగా ఉంటే గుండె కండరం మందం కావొచ్చు కూడా. దీంతో కండరం వ్యాకోచించే స్వభావం తగ్గుతుంది. ఫలితంగా ఒత్తిడి పెరిగి, గుండె వైఫల్యానికి దారితీయొచ్చు. కొందరికి గుండె లయ అస్తవ్యస్తం కావొచ్చు.

పక్షవాతం: మెదడు రక్తనాళాల్లో పూడికలు గలవారికి వీటి మీద హఠాత్తుగా రక్తం గడ్డలు ఏర్పడి, నాళం మొత్తం మూసుకు పోవచ్చు. దీంతో మెదడులో ఆయా భాగాలకు రక్త సరఫరా నిలిచిపోయి, పక్షవాతం తలెత్తొచ్చు. రక్తపోటు మరీ ఎక్కువైతే మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి, రక్తస్రావమూ కావచ్చు. ఇదీ పక్షవాతానికి దారితీస్తుంది.

కిడ్నీ వైఫల్యం: కిడ్నీ రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే మూత్రపిండాలకు రక్త సరఫరా తగ్గిపోతుంది. దీంతో కిడ్నీ సామర్థ్యం తగ్గొచ్చు. అదేపనిగా రక్తపోటు ఎక్కువగా ఉండటం మూలంగానూ కిడ్నీల పనితీరు మందగించొచ్చు. కిడ్నీ వైఫల్యానికి ప్రధాన కారణాల్లో అధిక రక్తపోటు ఒకటి.

చూపు మందగించటం: అధిక రక్తపోటుతో కంట్లోని రక్తనాళాలు దెబ్బతిని చూపు మందగించే ప్రమాదముంది.

నిర్ధరణ పద్ధతిగా..

తొలిసారి పరీక్షించినప్పుడు రక్తపోటు ఎక్కువున్నంత మాత్రాన సమస్యగా నిర్ధరించరు. కనీసం 24 గంటల తర్వాత మరోసారి పరీక్షించి చూస్తారు. ఇలా రెండు, మూడు సార్లు.. అదీ వేర్వేరు రోజుల్లో పరీక్షించి రక్తపోటు 140/90 కన్నా ఎక్కువుంటేనే హైబీపీగా నిర్ధరిస్తారు. అలాగే బీపీ పరీక్షను పద్ధతిగానూ చేయాల్సి ఉంటుంది. పరీక్షకు అరగంట ముందు వరకు కాఫీ, టీ, సిగరెట్లు, బీడీలు, చుట్టల వంటివేవీ తాగొద్దు. కఠినమైన వ్యాయామాలేవీ చేసి ఉండకూడదు. నడుచుకుంటూ ఆసుపత్రికి వచ్చిన వెంటనే కాకుండా కనీసం 5 నిమిషాలు విశ్రాంతిగా కూర్చున్నాకే పరీక్షించాల్సి ఉంటుంది. బీపీ పరికరానికి ఉండే పట్టీ కూడా వ్యక్తుల చేతికి తగిన సైజులో ఉండాలి. పట్టీని చుట్టిన చేయి గుండెకు సమాన ఎత్తులో ఉండాలి. పరీక్ష చేసేటప్పుడు పాదాలు నేలకు తాకించాలి. వీపు కుర్చీ వెనక భాగానికి ఆనుకొని ఉండాలి. వెన్నెముక నిటారుగా ఉండాలి. ఇలాంటి జాగ్రత్తలతో పరీక్షిస్తేనే రక్తపోటు సరిగ్గా తెలుస్తుంది.

కొందరికి ఆసుపత్రికి, డాక్టర్ దగ్గరికి రాగానే రక్తపోటు పెరగొచ్చు. ఇంట్లో మామూలుగా ఉండొచ్చు. దీన్నే వైట్ కోట్ బ్లడ్‌ప్రెషర్ అంటారు. ఇలాంటివారు ఇంట్లో అప్పుడప్పుడూ పరీక్షించుకోవాల్సి ఉంటుంది. కొందరికి వెంట తీసుకెళ్లటానికి వీలైన బీపీ పరికరం (ఆంబులేటరీ బీపీ మానిటరింగ్) అవసరపడొచ్చు. ఇది చిన్న పరికరం. చేతికి పట్టీ అలాగే కట్టి ఉంచి, పరికరాన్ని జేబులో పెడతారు. ఇది ప్రతి 15 నిమిషాలకోసారి బీపీని పరీక్షించి నమోదు చేస్తుంది. 24 గంటల తర్వాత సగటు బీపీని లెక్కించి సమస్య ఉన్నదీ, లేనిదీ నిర్ధరిస్తారు.

ఆరు నెలలకోసారైనా..

రక్తపోటు పరీక్ష తేలికైంది. అయినా చాలామందిలో సమస్యను గుర్తించలేకపోవటం ఆందోళనకరం. అధిక రక్తపోటులో పైకి లక్షణాలు కనిపించక పోవటం, పరీక్ష చేయించుకోకపోవటమే దీనికి మూలం. కాబట్టి 18 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ ఒకసారి రక్తపోటును పరీక్షించుకోవటం మంచిది. ఆ తర్వాత రెండు, మూడేళ్లకోసారి పరీక్షించుకుంటే చాలు. అదే 40 ఏళ్లు దాటితే ఏటా ఒకసారి రక్తపోటును కొలుచుకోవాలి. ఎక్కువ ఉన్నట్టయితే జీవనశైలి మార్పులు, మందులు ఆరంభించాలి. మందులు వేసుకునేవారూ ప్రతి ఆరు నెలలకోసారి డాక్టర్‌ను సంప్రదించటం మంచిది.

# మాటిమాటికీ అలారం కట్టేస్తున్నారా?

పొద్దున్నే లేవాలని అలారం పెట్టుకుంటాం. అది సమయానికి మోగినా లేవాలని అనిపించదు. కళ్లు మూతలు పడుతుంటాయి. అలారం కట్టేసి తిరిగి పడుకుంటాం. మళ్లీ కాసేపటికి అలారం మోగుతుంది. తిరిగి కట్టేస్తాం, పడుకుంటాం. అలా నిద్ర, మెలకువతో తంటాలు



పడుతూ.. పావుగంటకో, అరగంటకో తప్పనిసరి పరిస్థితుల్లో చివరికి మంచం మీద నుంచి దిగుతాం. తరచూ చాలామంది ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటూనే ఉంటారు. నిజానికి పెందలాడే నిద్ర లేవటం మంచి అలవాటే అయినా అందరికీ, అన్నిసార్లూ కుదరకపోవచ్చు. ముఖ్యంగా రాత్రిపూట ఆలస్యంగా నిద్రించేవారికిది పెద్ద సమస్యే. ఒకవేళ గత్యంతరం లేక లేచినా కొంత సేపటి వరకూ నిద్రమత్తుతో సతమతమవుతూనే ఉంటారు. పొద్దున్నే లేవనందుకు తమను తాము నిందించుకుంటుంటారు కూడా. ఇకపై అలా చింతించాల్సిన పనిలేదని స్వీడన్ తాజా అధ్యయనం చెబుతోంది. ఉదయం పూట మెలకువ వచ్చాక వెంట్రనే కాకుండా కునుకు తీసినట్టు కాసేపు పడుకొని లేవటం మంచిదేనని.. ఇది చురుకుగా, స్పష్టంగా ఆలోచించటానికి తోడ్పడుతుందని పేర్కొంటోంది. ముఖ్యంగా రాత్రిపూట ఆలస్యంగా పడుకునేవారికిది బాగా ఉపయోగపడుతుందని పరిశోధకులు వివరిస్తున్నారు. సాధారణంగా ఉదయం అలారాన్ని కట్టేసే అలవాటు చిన్నవయసువారిలో, ఆలస్యంగా నిద్రించేవారిలో ఎక్కువ. వీరిలో చాలామంది లేచాక కనీసం గంట సేపైనా నిద్రమత్తుతో జోగుతుంటారు. కాసేపు అలాగే పడుకొని, లేస్తే హుషారుగా ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అలారం మళ్లీ మళ్లీ మళ్లీ మోగటం వల్ల నిద్ర నాణ్యత తగ్గినప్పటికీ కార్టిజోల్ హార్మోన్ మోతాదులు, మూడ్ మీద పెద్దగా ప్రభావం చూపకపోవటం గమనార్హం. పైగా ఆలోచన సామర్థ్యమూ పెరుగుతున్నట్టు బయటపడింది. అలాగని అలారాన్ని మాటిమాటికి కట్టేస్తూ ఎక్కువసేపు పడుకుంటామని అనుకుంటున్నారేమో. ఇదీ ప్రమాదమే. ఏదో అరగంట సేపైతే ఏమో గానీ ఎక్కువసేపు అలాగే మంచం మీద దొర్లితే మాత్రం ప్రమాదమే. దీంతో లాభాల కన్నా నష్టాలే ఎక్కువని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే మాటిమాటికీ అలారం కట్టేస్తూ ఎక్కువసేపు అలాగే పడుకుంటే నిద్రకు భంగం కలిగినట్టుగానే శరీరం భావిస్తుంది. ఇది రకరకాల అనర్థాలకు దారితీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

# దాల్చిన ఆరోగ్యం

దాల్చిన చెక్కలో విటమిన్లతో పాటు ఐరన్, జింక్, క్యాల్షియం, క్రోమియం, మ్యాంగనీస్, మెగ్నీషియం వంటి ఖనిజాలూ ఉంటాయి. దీనిలోని సినమల్‌డిహైడ్ అనే వృక్ష రసాయనం మంచి యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. విశృంఖల కణాల పనిపట్టే ఇది క్యాన్సర్



నివారణకు తోడ్పడుతుంది. దాల్చిన చెక్క రక్తంలో గ్లూకోజు మోతాదులు తగ్గటానికీ ఉపయోగపడుతుంది. దీనిలో సాలిసైలిక్ ఆమ్లం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇది కణాల్లో అంతర్గత వాపు ప్రక్రియ(ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించటమే కాదు, మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేయగలదు కూడా.

# మలి దంతం పదిలం

వృద్ధులకు దంత సమస్యల ముప్పు ఎక్కువ. వయసుతో పాటు తలెత్తే మార్పులు, నోటి ఆరోగ్యం మీద ప్రభావం చూపే మందులు, లాలాజలం ఉత్పత్తి తగ్గటం, చిగుళ్లు కిందికి జారటం, వాడకంలో భాగంగా దంతాలు క్షీణించటం వంటివన్నీ ఇందుకు కారణమవుతుంటాయి.

వృద్ధులకు దంత సమస్యల ముప్పు ఎక్కువ. వయసుతో పాటు తలెత్తే మార్పులు, నోటి ఆరోగ్యం మీద ప్రభావం చూపే మందులు, లాలాజలం ఉత్పత్తి తగ్గటం, చిగుళ్లు కిందికి జారటం, వాడకంలో భాగంగా దంతాలు క్షీణించటం వంటివన్నీ ఇందుకు కారణమవుతుంటాయి. ప్రత్యేకించి వృద్ధాప్యంలో కొన్ని దంత సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వీటి గురించి తెలుసుకొని, జాగ్రత్త పడటం మంచిది.

దంత క్షీణత

సరిగా శుభ్రం చేసుకోకపోవటమో, లాలాజల ఉత్పత్తి తగ్గటమో.. కారణమేదైనా వృద్ధాప్యంలో పళ్లు పుచ్చిపోయే అవకాశముంది. కొందరికి పళ్ల మీద గుంతలు, రంధ్రాలు స్పష్టంగానూ కనిపిస్తుంటాయి. దీంతో ఆహారం నములుతుంటే నొప్పి పుట్టటం.. వేడి, చల్లటి పదార్థాలను తట్టుకోలేకపోవటం వంటివి వేధిస్తుంటాయి. పిప్పి పళ్లను నిర్లక్ష్యం చేయొద్దు. రంధ్రాలను పూడ్చి సరిచేస్తే చాలావరకు నయమైపోతుంది.

నివారణ: నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకోబోయే ముందు ఫ్లోరైడ్ టూత్‌పేస్టుతో దంతాలను బ్రష్ చేసుకోవాలి. సన్నటి దారాన్ని వేళ్లతో పట్టుకొని, పళ్ల మధ్య దూర్చి శుభ్రం చేసుకున్నా (ఫ్లాజింగ్) మంచిదే. తీపి పదార్థాలు, పానీయాలు తగ్గించాలి.

చిగుళ్ల జబ్బు


ఇది తీవ్రంగా బాధిస్తుంది. ఇందులో చిగుళ్లు ఉబ్బటం, ఎర్రగా అవటం, రక్తం రావటం, దుర్వాసన, చిగుళ్లు కిందికి జారటం.. దంతాలు, చిగుళ్ల మధ్య బుడిపెలు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మొదట్లోనే చికిత్స తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. ఒక మాదిరి సమస్యకు దంతాలను ప్రత్యేకంగా శుభ్రం చేయటం, పళ్లు సరిగా తోముకోవటంతోనే నయమవుతుంది. మరీ తీవ్రమైతే దంత మూలం నుంచీ శుభ్రం చేయాల్సి ఉంటుంది. యాంటీబయాటిక్ మందులూ అవసరమవుతాయి.

నివారణ: నోటిని శుభ్రంగా ఉంచుకోవటం ముఖ్యం. యాంటీమైక్రోబియల్ మౌత్‌వాష్‌తో నోటిని పుక్కిలిస్తే మేలు. సిగరెట్లు, చుట్టలు, బీడీలు తాగరాదు. జర్దా, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు నమలరాదు.

నోరు తడారటం

వృద్ధుల్లో లాలాజలం ఉత్పత్తి తగ్గటం వల్ల నోరు పొడిబారుతుంది (జెరోస్టోమియా). కొన్ని మందులు, నాడులు దెబ్బతినటం, మధుమేహం, పక్షవాతం వంటివీ దీనికి కారణం కావొచ్చు. దీంతో ముద్ద మింగటం కష్టమవుతుంది. రుచీ మారుతుంది. పెదాలు పగలొచ్చు. తరచూ కొద్దికొద్దిగా నీళ్లు తాగటం, అవసరమైతే కృత్రిమ లాలాజలం వాడుకోవటం, నోరు ఎండిపోవటానికి కారణమయ్యే మందులు మార్చటం వంటివి మేలు చేస్తాయి.

నివారణ: ఒంట్లో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి. దాహం వేయకపోయినా అప్పుడప్పుడూ నీరు తాగాలి.



మద్యానికి దూరంగా ఉండాలి. పొగాకు ఉత్పత్తులేవీ వాడొద్దు. లాలాజలం ఊరేందుకు బిళ్లల వంటివి చప్పరించాలి.

పళ్లు జివ్వు

కొందరికి వేడి లేదా చల్లటి పదార్థాలు నోట్లో పెట్టుకోగానే పళ్లు జివ్వుమని లాగినట్టు అనిపించొచ్చు. పుల్లటి పదార్థాలు, పానీయాలు తీసుకున్నా.. బ్రష్‌తో కాస్త గట్టిగా పళ్లు తోముకున్నా ఇలాంటి అనుభూతి కలగొచ్చు. పళ్ల మీది గట్టి పొర ఎనామిల్ క్షీణించటం, చిగుళ్ల జబ్బులు, దంత క్షీణం.. వంటివన్నీ పళ్లు జివ్వుమనటానికి కారణమవుతాయి. ఇది తగ్గటానికి డీసెన్సిటైజింగ్ టూత్‌పేస్ట్, ఫ్లోరైడ్ చికిత్సలు ఉపయోగపడతాయి.

నివారణ: పళ్లు జివ్వుమనేవారు మృదువైన బ్రష్‌లు వాడుకోవాలి. మరీ గట్టిగా బ్రష్ చేయొద్దు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy